శ్రీరస్తు.

శశిరేఖాపరిణయము.

అప్పప్పకవి ప్రణీతము.

చెన్నపురి:

వావిళ్ల. రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్ వారిచే

ప్రకటితము.

1928

All Rights Reserved.

తే. వసుధ రత్నాకరం బనువంశజలధి, కరయ రాకాసుధాకరుఁ డతఁ డటంచుఁ
కవులు వినుతింపఁగాఁ జాల ఘనత కెక్కె, రాజితంబుగ సంజీవరాజఘనుఁడు. 14

సీ. అతనితనూజాతు లవనిఖ్యద్ధైర్యాత్తు లతులితప్రథ మోము లలరువారు
రాజవశంకరతేజులు నలరారు మంజులభాషణుల్ మానధనులు
బంధుజనాహ్లాదసింధుసమీచీనవిమలవాక్యస్ఫూర్తి వెలయువారు
ఏకపత్నీవ్రతం బేప్రొద్దు వదలక సన్మార్గవృత్తిచే నల్పువారు
తే. వెలఁగి సుజనులసౌఖ్యమె సేయువారు, భూమి నన్నృతంబుఁ బలుకని బుద్ధియుతులు
రమ్యమతి యగుహనూన్నరరాజకవియు, నతనితమ్ముఁడు నారాయణాఖ్యకవియు. 15

క. హనూన్నరరాజు వసుధలో, నన్నుతి కెక్కెనఘనుండు సంస్థానముల౯
బన్నుగఁ దెచ్చినబహుమతు, లెన్నెన్నోగలవు వాని నెన్నఁగ వశమే? 16

క. సత్యపథంబును వదలం, డత్యుత్తముఁ డనుచు మెచ్చి యామోదముతోఁ
బ్రత్యక్షంబుగ మారుతి, యత్యంత ప్రియంబుతోడ నతనిం బ్రోచు౯. 17

వ. అట్టి యాంజనేయప్రభావంబునం జేసి. 18

సీ. అతిచమత్కృతు లొప్ప నాశుకవిత్వంబుఁ జెలఁగి వాక్పటిమతోఁ జెప్పు నతఁడు
నవరసాలంకారనైపుణ్యమున మించి సకలప్రబంధముల్ సలుపు నతఁడు
అధికు నధముఁ జేయ నధము నధికుఁ జేయ ఘనమైనవాక్శుద్ధి గలుగు నతఁడు
అతిభీషణాకార మమరి యెల్లప్పుడు నబ్ధిగంభీరుఁడై యలరు నతఁడు
తే. విశదకరుణాకటాక్షసువీక్షణుండు, భట్టుమూర్తికి సరి యనఁ బరగునతఁడు
పలుకుపలికినఁ జక్కెరలొలుకునతఁడు, సుతులు నలుపురతోనుండె సుఖముఁగనుచు.

తే. అతనితమ్ముఁడు మతిమంతుఁ డమితయశుఁడు, కావ్యనాటకాలంకారకవన వేద్యుఁ
డతులితాహోబలుఁ డాతని కరయ సుతులు, నలుసముద్రంబులననొప్పి వెలయుచుంద్రు.

తే. ఆంజనేయుఁడు వీరహనుమప్ప మఱియు, హనుమదాసును దత్తప్ప యనుమదీయ
జనకు లన్యోన్యసఖ్యసంశ్రీమతులు, కీర్తిఁ గాంచిరి యోగ్యసన్మూర్తు లనఁగ. 21

సీ. ఇలలోన నాంజనేయులవాచకస్ఫూర్తి మఱుఁజుఁస్ఫురణతో మధుర మగుచు
నేయే రసంబున కేరాగ మొప్పిన నారాగమున రసం బమరఁ జదివి
యాలకించినవారి నానందవార్ధిలో మగ్నులఁ గావించి మరులుగొల్పు
బంధుజనాళి నాభరణభావంబునఁ గన్నారుగా నొప్పి ఘనత కెక్కె
తే. నతనిసుకృతంబు వర్ణింప నగణితంబు, నతనివరగౌరవం బెన్న నగణితంబు 22
నతనికీర్తిని వర్ణింప నగణితంబు, నతనిఘనమగు శేముషి యగణితంబు. 23

వ. అని మఱియును.

క. వీరహనుమప్ప మిక్కిలి, చారుతరం బైనమూర్తి సాహితియందున్
నేరుపు గలిగియు సంస్కృత, సారాంశము లెఱిఁగి యతఁడు సన్నుతిఁ కెక్కెన్. 24

తే. హనుమదాసన వివరింప నాంధ్రమునను, జెలఁగి కృతిసెప్ప నాతఁడే చెప్పవలయు
నితరకవులను హృదయమం దెంచనేల, ననుచు జనములు వినుతింప నతఁడు చెలఁగె.

క. దత్తప్పవిధముఁ జెప్పెద, నుత్తముఁ డతియుక్తిపరుఁడు నుర్వీస్థలిలో
హత్తినసీతిస్ఫురణన్, బొత్తిగ నరయంగ విదురుఁ బోలినఘనుఁడౌ. 26

వ. అని వెండియు. 27

తే. హనుమదాసాఖ్య గర్భసుధాబ్ధిచంద్రు, లవని సుబ్బన్న రామరాజనెడు సుతులు
రామరాజు భగీరథరాజుఁ బోలి, తీర్థకావడిఁ గొనితెచ్చి వార్తకెక్కె. 28

క. పరనాటకకావ్యంబులఁ, బరమాలంకారములను బండితుఁ డనుచున్
సరసులు సన్నుతిసేయఁగఁ, జిరతర మగుకీర్తిఁ గాంచి చెలఁగుచు నుండెన్. 29

వ. తదనంతరంబ. 30

తే. అగ్రజుం డైనయాంజనేయాఖ్యకవికి, భార్య లిరువురు పతిభక్తిఁ బ్రబలి రందు
నగ్రభార్యతనూజాతు లబ్బమిత్రు, పేరుతావారినామము ల్వేరుకొందు. 31

క. చాయన్న వసుధలోపల, మాయన్నలలోన మేటి మానధనుం డా
చాయన్న చదువ వినియెడి, ధీయుతు లానందవార్ధిఁ దేలుట యరుదే. 32

తే. ఇతనితమ్ముఁడు చెన్నప్ప యింపుగులుక, జనులు వినుతింప సజ్జనసంగుఁ డగుచు
సతిసుతులతోడ వేడ్కతో జగతియందుఁ, బరగె గురుపూజ సేయు సద్భక్తి గలిగి.

తే. ఆంజనేయునిరెండవయాలు సుదతి, భాసురాంగి సరోరుహపత్రనేత్రి
శ్రీరమాదేవిసమ యని చెలులువొగడఁ, జెలఁగు ముఖజితశశిబింబ శేషమాంబ. 34

తే. అట్టిశేషాంబగర్భసుధాబ్ధిచంద్రు, లప్పసామియు నప్పప్ప యొప్పమిగుల
దారపుత్రాదులం గూడి ధరణియందుఁ, బరమసంతోషయుక్తులై ప్రబలి రందు. 35

క. అప్పప్ప యీప్రబంధముఁ, జెప్పెద నని పూని వేడ్కఁ జెప్పెను దీనన్
దప్పులుగల్గినఁ దీర్పుచు, నొప్పుగ సరిచేయరయ్య యోబుధులారా. 36

వ. ఇట్లుఆంధ్రగీర్వాణనాటకాలంకారాది ప్రావీణ్యధురీణవిబుధచరణారవిందమకరందాస్వాదనేందిందిరాయమానహృదయుండును, భూసురాశీర్వాదామోదసుశీలవర్తనుండును, ననవరతపుత్రమిత్రసహాయసంపన్నుండును నగు నాతం డత్యంతసంతసంబునం బొదలుచుండ నొక్కనాఁటిరాత్రియందు. 37

సీ. హాటకపద్మరాగాదుల విలసిల్లు డంబుమీఱినకిరీటంబువాఁడు
మణిమయం బైనట్టిమకరకుండలరుచిప్రామిన భాసిల్లుమోమువాఁడు

మహనీయకౌస్తుభమణికాంతు లంతట రాణించు కంఠహారంబువాఁడు
చూడ్కికి మిఱుమిట్లు సొనిపెడు వరనీలకంధరోజ్జ్వలచారుకాంతివాఁడు
తే. కనకచేలంబుఁ గట్టినకొనువాఁడు, మొలకనవ్వులు మోముపైఁ జిలుకువాఁడు
చాలఁ గృపగల్గి లోకంబు లేలువాఁడు, స్వప్నమునవచ్చి యెదుర సాక్షాత్కరించె.

వ. ఇట్లు ప్రసన్నుండయి మదంకితంబుగా నొక్కప్రబంధం బొనరింపు మనిన విని సంతోషసాగరంబునం దేలి యప్పుడు. 39

షష్ఠ్యంతములు.

క. పూతనప్రాణవిఘాతుకు, మాతకు సంతోష మొసఁగు మహనీయునకున్
జాతభవపాశహరునకు, భూతదయామానసునకు బుధవినుతునకున్. 40

క. దేవకీవరతనయునకును, భావజజనకునకు భక్తమందారునకున్
పావనపదయుగళునకున్, గోవర్ధనభారవహనగోపాలునకున్. 41

క. సరసిరుహలోచనునకున్, శరణాగతపోషకునకు జగతీశునకున్
పురుహూతాదివినుతునకు, పరిణయకేళీవినోదపరిపూర్ణునకున్. 42

క. అర్జునరథసారథికిన్, దుర్జయఖలదనుజవరులఁ ద్రుంచినహరికిన్
నిర్జరపూజితమూర్తికి, నర్జునతరుమూలహారికి నాగమనుతికిన్. 43

క. నరకాసురభంజనునకు, మురదానవమర్దనునకు మునివంద్యునకున్
సరసిజభవసన్నుతునకు, కరిమొర విని మకరిఁ ద్రుంచుకరుణానిధికిన్. 44

క. శ్రీసత్యారుక్మిణులతో, రాసక్రీడలను సలుపురాజాస్యునకున్
హాసాస్యంబున నెపుడును, దాసీదాసులను బ్రోచు ధన్యాత్మునకున్. 45

వ. అంకితంబుగా నాయొనర్పంబూనిన శశిరేఖాపరిణయం బనుమహాప్రబంధంబునకుం గథాక్రమం బెట్టు లనిన. 46

ప్రథమాశ్వాసము.

కథాప్రారంభము.

క. విను సౌధకేతనావళి, జనితం బగు వాతహతిని జంచల మగుచున్
దినమున్ దినమణిహయములు, ఘనభీతిం జెందునట్టి గజపుర మమరున్. 47

తే. ఆపురం బేలుజనపతి యబ్జవైరి, వంశపరిపాలనవ్రతవర్తనుండు
దక్షతను బ్రోచుఁ బ్రజలఁ బారిక్షితుండు, గణుతి కెక్కిన పేరోలగమున నుండి. 48

వ. ఇతిహాసశ్రవణకుతూహలుం డై వైశంపాయనమహామునిం జూచి యిట్లనియె. 49

క. శశికులుఁ డభిమన్యునకున్, శశిరేఖను బెండ్లి చేసి జలజాక్షాదుల్
వసుధను దా రెటు మెలఁగిరొ, విశదంబుగఁ దేటపఱుప వినియెద ననఘా! 50

వ. అని యడిగిన జనమేజయునకు వైశంపాయనుం డిట్లనియె. 51

క. ఖ్యాతిగల శౌనకాదులు, ప్రీతిగ వరసూతు నడుగఁ బెంపలరంగా
నాతఁడు సెప్పిన సత్కథ, చేతోమోదంబు గాఁగఁ జెప్పెద నీకున్. 52

సీ. గోపురం బటు చూచి యాపురంబునఁ గల్గు గోపురంబుల ముద్దు గొనఁగఁ దలఁచుఁ
గోటకొమ్మలు సప్తఘోటకంబులఁ దాఁకుఁ దద్రత్నరుచి భానుఁ దారసించి
వైడూర్యతోరణావళులతో నలరారి చూడ వేడుక యైన మేడ లమరు
నిందురత్నప్రభాసందీపితంబు గా నందమై విలసిల్లు మందిరములు
తే. నవ్యమణికాంతులను నొప్పు నాట్యశాల, లమరుఁ గర్బ్బురవేదు లాయాస్థలంబు
దీధితిద్వారమౌక్తికతోరణంబు, భూమిరత్నంబు ద్వారకాపురవరంబు. 53

క. ఆపురి యుప్పరిగలపై, నెప్పుడు నుయ్యాలలూఁగు నింతులు శశినిన్
జొప్పడఁ గరములఁ బట్టుచుఁ, జప్పట లిడ సుధయుఁ దొరఁగి సౌధము లయ్యెన్.

క. అచ్చట మేడలలోపల, నచ్చరగం డ్లాడు చెలులయందము చూడన్
ముచ్చటమీఱఁగ నాపురి, లచ్చియుం వసియించు వేడ్క రమణీయముగాన్. 55

శా. నీలాభ్రంబులఁ గాంచి పోంగుచు గజానీకంబుగా జెంచుచున్
వాలాయంబునఁ దాఁకఁ బూని వరుసన్ వాలంబు లల్లార్చుచున్
గాలన్ నేలను జీరి దంతముల నాకాశంబునం గ్రుమ్ముకాం
క్షాలోకించి సురాపగాబ్జముల పీఁకన్ బీకు మత్తేభముల్. 56

సీ. పాంసుజాలము గప్పి పవమానవేగంబు మంద మాయె నటంచు మదిఁ దలంచు
సింధుదేశస్థుల సైంధవగమనంబు సాధారణం బంచు సరకుగొనవు

హరిణప్రయాణంబు లాలోకమునఁ జేసి నేర్చుకొమ్మని తమ నేర్పుఁ జూపు
మహి మనోవేగంబు మాకుఁ జెల్లు నటంచు జలధి దాఁటెదమంచుఁ జౌకళించుఁ

తే. కనకమణికాంతులను మించుకళ్లెములను, మోము లెత్తుచు వచ్చుచు మోదమలరఁ
బుచ్ఛములు మీఁది కెత్తుచుఁ బొంగరు మీఱి, కోటలనుదాఁటు నాపురిఘోటకములు.

క. చతురాగమముల నీగిన, చతురాస్యు నిరాకరించు సరసమనీషన్
క్షితి షట్కర్మధురీణులు, నతులితవ్రతసాహసేంద్రు లవనిసురేంద్రుల్. 58

క. తేజోమదమున మించియుం, రాజితరణరంగభూమి రాముని మాడ్కిన్
జేజేలు నుతింపఁగఁ బర, రాజుల మర్దింతు రెలమి రాజతనూజుల్. 59

క. తొమ్మిదినిధులు దొరకిన, యెమ్మెలు గలరాజరాజు నెంచక మదిలో
సమ్మద మందుచు రత్నము, లమ్ముదు రాపీటివణిజు లనవరతంబున్. 60

క. హరిభక్తియె యెల్లప్పుడు, గిరికొనఁగా సల్పుచుండి కృషితో నెపుడున్
సురుచిరధనధాన్యంబులఁ, బరితోషితు లెల్ల పాదభవు లప్పురిలోన్. 61

క. భూరియుంగము ముడివడంగా, నాయుంధములు చేతఁ బూని యతిభీకరులై
వేయుంగజంబులబలిమిన్, గాయము విలసిల్ల నుంద్రు ఘనభటు లచటన్. 62

సీ. పరిమళయుక్తమా సరసిజంబులు లేవె సరసులకే కదా సరసిజములు
పల్లవాధరి మంచి మల్లెపూ లున్నవే పల్లవాగ్రముల కామల్లెపూలు
భువనమోహిని మంచికువలయంబులు లేవె యవి రాజులకుఁ జూడ నందగించు
కరిగజగామిని యరవిందములు లేవె యరవిందములు నుండు నతనిచేత

తే. ఘనసుమంబులు గలవటే కంబుకంఠి, చిరతరంబుగ నున్న వాచెరువు కేగు
మనుచు విటులతో చాతుర్యమలరఁ బలికి, పువ్వులమ్ముదు రవ్వీటిపువ్వుఁబోండ్లు. 63

వ. మఱియు నప్పట్టణంబు రాజవిరాజితంబు కావున సత్పథంబును, ద్విజరాజభాసురంబు గావున నుద్యానవనంబును, భుజంగసంచారితంబు గావున భోగవతీపురంబును, జాంబూనదభూషితంబు గావున జంబూద్వీపంబును, నవరత్నదీపితంబు గావున రోహణాచలంబును, విబుధనివాసంబు గావున నాకలోకంబును, ధనవిశేషంబుగలది కావున లంకాపట్టణంబును, దివ్యభూజాతవంతంబుగావున నందనవనంబును శ్రీరామప్రకాశమానంబు గాన నయోధ్యాపురంబును బోలె నొప్పుచుండి మఱియును. 64

సీ. ఆపురిసౌధాళికాగ్రభాగంబుల కెంట ద్రావుడు డిండిరీతు లరసి
పరమభయంబుతోఁ బాకారి గజరాజు పరువిడఁగాఁ గాంచి పద్మముఖులు
దరహాసమొదవంగఁ బరిహాస మొనరింపఁ బురుహూతుఁ డాలించి పురముఁ గాంచి
యెంతచిత్రము చూడ నీపురం బని మెచ్చి సరసిజాక్షులరూపు మరసి యరసి

తే. నాపురంబును వాసియుంచు నీపురంబు, నమరకాంతల నిందింతు రబ్జముఖులు
సాహాయంబును దోలు నీనగరహయము, లనుచు వినుతించి యింద్రుఁ డానందమొందు.

ఉ. ఆపుటభేదనంబు ననిశంబును బ్రోచు దయాంతరంగునిన్
దీపితతేజునిన్ హరిని దీనదయాళుని దేవదేవునిన్
గోపికలోలు నచ్యుతుని గోగణపాలుని వాసుదేవునిన్
భూపతు లాప్తులు న్సుతులు భూసురులాదిగఁ గొల్చుచుండఁగన్. 66

క. కొంతతడ వుండి పిమ్మట, కంతునికన్నట్టిసతిని గనుఁగొను వేడ్కన్
సంతస మలరఁగ మాధవుఁ, డంతఃపురభూమిఁ జేర నరిగిన నపుడున్. 67

క. వాకిటఁ గావలివారలు, ప్రాకటముగ ముందు నడువ ఫణిహారకులున్
జోకఁగ నిరుపార్శ్వంబుల, లోకేశ్వర గరుడగమన లోలాత్మ హరీ. 68

వ. అని యనేకప్రకారంబులఁ బ్రస్తుతించుజనంబులమనంబు లలర బహూకరింపుచు డెబ్బదిరెండుద్వారంబులుం గడచి పద్మరాగస్థగితసోపానంబులు వేగఁ బ్రాకుచు మహారజితసౌధాంతరంబునకుం జని రుక్మిణీదేవితల్పంబున శయనించి యచ్చటనున్న సఖీజనంబులం బనిచి రతిక్రీడావినోదంబులఁ గొంతతడ వుండి వెండియు నాస్థానంబునకుం జని రాజకార్యనిర్వాహకుం డగుచు దుష్టజననిగ్రహంబును జేయుచుండె. 69

సీ. ఆమహాపురుషున కగ్రజుం డైనట్టి బలరామునకు ధర్మపత్ని యైన
కమలాక్షి రేవతిగర్భవాసమునందు జన్మించె నొకబాల జలధియందు
నిందిర యేచాయ నందమై జన్మించె నాలీల వేడ్కతో నవనియందు
శంబరాంతకు నవ్యశర మనఁ బొగడొంది బంగారుబొమ్మ నారంగు కెక్క
తే. ముదిత తలిదండ్రి కల్లారుముద్దుగాను, మఱియుఁ బినతల్లిగారికి మమత గలుగ
సారెసారెకుఁ బినతండ్రి సంతసిల్ల, మాటలాడును శశిరేఖ మధుర మొదవ. 70

పంచచామరము. సరోజపత్రనేత్రి రూపసంపదల్ నుతింపఁగా
ధరాధరుండు నేరఁడంచుఁ దత్సఖీజనంబులున్
బరాకు చెప్పుచుండఁగాను బాల స్త్రీజనాళికిన్
వరానురాగ మొప్పఁజేసి వాసికెక్కుచుండఁగాన్. 71

సీ. చంచరీకచ్ఛాయ మించు నాసతికురుల్ విధురీతి ముఖకాంతి వెలయుచుండు
నాస చంపకసుమనాకారమున మించు దాడిమబీజము ల్దంతపఙ్క్తి
బింబోష్ఠి బాహువుల్ బిసనాళములఁ బోలు వృత్తకుచంబు లాబిత్తరికిని
హరిపదాకృతిఁ గాంచు హరిణాక్షిమధ్యంబు సరసిజాక్షి పిఱుందు సైకతంబు
తే. నతివయూరులు రంభల నతిశయిల్లు, కాహళులఁ గేరు జంఘలు కమలములను

పాదయుగములు నిరసించి వా దొనర్చు, జవ్వనంబున శశిరేఖ నివ్వటిల్ల. 72

వ. మఱియు నబ్బాలికారత్నంబు సఖీజనంబులతో వినోదంబుగా నాడుచు హంసలకుఁ
దనగమనవిలాసంబు నేర్పుచు మహాసంతోషంబునం బొదలుచు దినదినప్రవర్ధమాన
యై పెరుగుచున్నసమయంబున. 73

తే. దేవకీదేవి యొకనాఁడు దివ్యమైన, భవనమున నుండి కోడండ్రు బలిసి కొలువ
సంతసంబున నుండెడుసమయమునను, ముచ్చటలరఁగ శశిరేఖ వచ్చి నిలిచె. 74

సీ. ఆవేళ దేవకి యత్యంతముదముతో మనుమరాలిని గాంచి మమతమించి
తల్లి రా రమ్మని తనచేత గదియించి తొడలయం దిడికొని నిడుదలైన
కురులు దువ్వుచు గొప్పకొప్పిడి వేడ్కతో ముద్దాడుచున్నంత ముసలి వారియుఁ
జనుదెంచి భక్తితో జననికి మ్రొక్కినఁ గొడుకుల దీవించి కోర్కి మించి
తే. తనమనోభీష్ట మెఱిఁగింపఁ దలఁచి రామ, కృష్ణులను జూచి తనకోర్కి క్రేళ్లువారు
చున్నదది మీకు వినుపింతు శుభమెుఁర్వ, దేవసుతులార యని దేవి పలికె నపుడు.

క. బాలామణి శశిరేఖను, బాలుం డభిమన్యుఁ డింద్రపౌత్రున కెలమిన్
మేలమునఁ బెండ్లిసేయుం, డీలాగున జాగుసేయ నేలా మేలా. 76

క. అనిన విని రామకృష్ణులు, మునుకొని నీయాజ్ఞ మాకు ముఖ్యం బనుచున్
వినయవిచారము లొప్పఁగ, జనని న్వీడ్కొనుచుఁ జనిరి సంతోషముతోన్. 77

వ. అని చెప్పి వైశంపాయనుండు జనమేజయున కిట్లనియె. 78

శా. ఇంద్రగ్రావచితోన్నతామితమణీహారాళసోపానభా
క్ఛంద్రప్రస్తరవేదికానికరమై సౌధాగ్రభాగోన్నమ
త్సాంద్రద్యోతితకేతసాంబరమరుత్సంపీడితాంభోద మై
యింద్రప్రస్థపురంబు భాసిలె మహాహేమోజ్జ్వలాగార మై. 79

తే. ఆపురంబునఁ బాండవు లేపు రరిగి, సంతసంబున నుండెడిసమయమునను
బరమసాహసుఁ డైనట్టిపార్థుఁ జూచి, భద్రమత్తేభయాన సుభద్ర ప్రేమ. 80

మ. కరము ల్మోడ్చి మహాత్మ సామనవి మీకర్ణద్వయిం జేర్చు మీ
చరణాబ్జంబులచెంతఁ జేరి వరుసన్ షణ్మాసము ల్గొల్చితిన్
పరిణామంబున నన్నుఁ బంపు గురుని న్బద్మాక్షి యాతల్లినిన్
సరసాగ్రేసరుతా మదగ్రజుల నే సంతోషినై చూచెదన్. 81

క. సతికోర్కులు కడతేర్పను, పతిరే మఱి లోకమందుఁ బరికింపంగా
మతిఁ దలఁచి నన్నుఁ బంపిన, నతులితు లగువారిఁ జూచి యతివేగముగాన్. 82

క. వత్తు నని విన్నవించినఁ, జిత్తము రంజిల్లఁ బాండుసింహుఁడు నలినిన్
వత్తుకొని రథమునం దిడి, యుత్తమ లగువారివెంట నూరికి ననిచెన్. 83

క. చనిచని సుభద్ర చూచెన్, వననిధిమధ్యంబునందుఁ బరఁగెడుదానిన్
వనమాల నమరునగరముఁ, గనుఁగొని మత్తేభయాన కరములు మొగిచెన్. 84

వ. ఇవ్విధంబునఁ బురలక్ష్మికి ముకుళితకరాంబుజయై తదనంతరంబునఁ బురప్రవేశంబుఁ
జేయుచున్న సమయంబున సుభద్రాగమనంబు విని తత్పురీజనంబు లెదురువచ్చి తో
డ్కొని పోవ నంతఃపురంబునకుం జని తనరాక కెదురుచూచుచున్న జననీజనకులకు
మ్రొక్కి తదగ్రజు లగు రామకృష్ణులకుం బ్రణమిల్లి వారివలనన్ దీవనలఁ గైకొ
నుచుఁ దనకుమారు నభిమన్యుని వారిపాదంబులకు మ్రొక్కించుచున్న సమయంబున.

క. చందురునిఁ బోలుముఖరుచి, కందర్పుని నిందసేయు కరచరణాంగం
బందందఁ జూచి మెచ్చుచు, నిందీవరనేత్ర లెల్ల రెంచిరి మదిలోన్. 86

తే. ఎన్నినోములు నోచెనో యీసుభద్ర, తీర్థయాత్రలు యెన్నెన్ని తిరిగినదియొ
పరమపుణ్యాత్మురాలమ్మ పార్థుపత్ని, యిట్టితనయునిఁ గని పెంచె నింపుగులుక. 87

క. అని యింతులు కొనియాడఁగఁ, దనతనయుఁడు ముద్దుసేయఁ దనపుట్టింటన్
జననీజనకులఁ గొల్చుచు, మన మలర సుభద్ర కొన్నిమాసము లుండెన్. 88

సీ. అంతట నొక్కనాఁ డరవిందలోచనుం డంతఃపురంబులో నంద మలర
నీలాంబరుఁడు తాను నిజపీఠములమీఁద వసియించి యుండఁగా వారికడకు
జననియు జనకుండుఁ జనుదేరఁగాఁ జూచి దిగ్గున లేచి యా దేవనిభులు
సాష్టాంగ మొనరించి సత్పీఠములమీఁద నుంచినసుతుల దీవించి రపుడు
తే. మాటలాడుచు సంతుష్టమానసములఁ, జెలఁగుచున్నట్టి శ్రా తలఁ జేరి తాను
గురుతరంబుగఁ బీఁటపైఁ గూరుచుండె, భాసురాకారగుణభద్ర యాసుభద్ర. 89

వ. అని చెప్పి వైశంపాయనుండు వెండియు నిట్లనియె. 90

క. సభయు లగురాజపుత్రుల, కభయంబు లొసంగి ప్రోచునర్జునసూనుం
డిభరాడ్రిపువిక్రముఁ డా, యభిమన్యునిఁ బోలువీరు లవనిం గలరే. 91

తే. అట్టిసౌభద్రుఁ డావేళ నాడుచుండి, తల్లిదగ్గర కేతేర ధర్మరతుఁడు
కృష్ణుఁ డప్పుడు సౌభద్రుఁ గృపను జూచి, కరము చేఁజేతఁ గీలించి కౌఁగలించి.

తే. శిరము మూర్కొని ముద్దాడి శ్రీధరుఁడు, తొడలపైఁ జేర్చి చుంచుఁ దా దువ్వుచున్న
సమయమున వచ్చి శశిరేఖ సంతసమున, సుందరాకారు నభిమన్యుఁ జూచి యపుడు.

క. పినతండ్రి నేయుమాలిమి, ఘనమై విలసిల్లుకతన గ్రక్కున దానున్
జనుదెంచి కృష్ణుతొడపై, వనితామణి యిందురేఖ వసియించుటయున్. 94

క. అభిమన్యుఁడు శశిముఖి వా, రుభయులు నిరుతొడలయందు నుండఁగ నినయా
నభికులపుణ్యము లుఱగుల, ప్రభునకు వశమగునె పొగడఁ బార్థివనాథా. 95

వ. ఇట్లున్నసమయంబున. 96

క. ముద్దులు గులికెడునల్లుని, నద్దంబులఁ గేరుచెక్కు లమరినపుత్త్రిన్
ఒద్దికగలదంపతు లని, తద్దయు ముదమంది హారియుఁ దాలాంకునితోన్. 97

చ. మనశశిరేఖ కర్జునకుమారునకు న్మది నెంచి చూడఁగా
ననవిలుకానికిన్ రతికి నన్వయముగా నొనగూర్చినట్లు నా
వనజభవుండు గూర్చె నిఁక వాసరము ల్గడపంగ నొప్ప దీ
జనములు సంతసిల్లఁగను జయ్యనఁ బెండిలి సేయు మగ్రజా. 98

వ. అనిన విని యప్పుడు. 99

ఉ. అన్నలు మాటలాడుసమయంబున లేచి సుభద్ర ప్రీతితో
నన్నయశాలి యైనముసలాయుధుఁ గన్గొని నీమఱందియున్
న న్నిటఁ బంపుచుండె పరిణామము వేఁడె భవత్కుమారి యా
కన్నియ మత్సుతాగ్రణికిఁ గారణికోత్తమ పెండ్లిసేయవే. 100

వ. అని పార్థుండు మీతో విన్నవింపు మటంచుఁ జెప్పెనని సుభద్ర వెండియు. 101

క. అన్నా చిన్నకొమారితఁ, బన్నుగ నాసుతున కిచ్చి బహుమోదముతో
నెన్నఁడు పెండ్లి యొనర్తువొ, యెప్పుఁడు వినఁ జెప్పు మనిన వికవిక నగుచున్. 102

క. అమ్మా యెంతటిబేలవె, కమ్మనివిలుకానిసాటిఘనుఁ డల్లునకున్
కొమ్మ నొసంగెద నీవున్, నెమ్మదిగా నుండు మమ్మ నీరజనేత్రీ. 103

తే. అనిన సంతోషమంది యయ్యంబుజాక్షి, అన్న యీమాట నిజ మని హస్తమందు
హస్తమిడుమన్న బలదేవుఁ డాసుభద్ర, పాణితలమునఁ గరమిడి పలికె మఱియుం.

తే. మగువ నీప్రాణవిభుఁ డైనమఘవసుతుని, వియ్యమునకంటె మా కిఁక వేఱె కలదె
తరుణి నీ వింతగా దీనిఁ దరుచ నేల, విశదముగ నీవు పార్థుతో విన్నవింపు. 105

వ. అనిన నప్పుడు. 106

క. రేవతిపతిమాటలు విని, భావం బలరంగఁ బార్థుపత్నియు మఱియున్
దేవసుతుఁ డగ్రజుం గని, నీవచనమె పరము నాకు నిర్మలచరితా. 107

వ. అని యివ్విధంబున సుభద్రాదేవి జననీజనకులు మన్నన గావింప సహోదరులు బహూకరింపఁ బరమామోదంబున వర్తించుసమయంబునం దొక్కనాఁడు. 108

తే. దివిజరాచూలిపత్నికి దివ్యమైన, వజ్రమౌక్తికభూషణవస్త్రములను
దాసదాసీజనంబు లాతరుణి కొసఁగి, యబ్జలోచనుఁ డత్తింటికనిపెఁ జెలిని. 109

క. పరువిడువాజులఁ బూన్చిన, యరదంబున సుతుఁడు దాను నతివేగముతోఁ
గరిరాజగమన చని చని, పురుహూతసుతాదు లున్నపురముం జూచెన్. 110

సీ. ఫుల్లాబ్జనేత్రి తత్పురముచెంతకు నేఁగి నగరులోపలఁ జొచ్చి నయముతోడ
నత్త కుంతీదేవి కత్యంతభక్తితోఁ జరణాబ్జములకును సాఁగి మ్రొక్కి
పాంచాలికిని జేతు లంచితంబుగ మోడ్చి వారిచే దీవన ల్వరుసఁ గాంచి
వెండియు భీభత్సుఁ డుండుగృహముఁ జేరి పతిపాదములకుఁ దా నతు లొనర్చి
తే. ద్వారవతియందు జరుగువృత్తాంత మెల్లఁ, దెలుప విని పార్థుఁ డానందజలధిఁ దేలి
నీలవస్త్రంబుదాల్పుతో నెలఁత మనకు, వియ్యమందంగఁ జేసితే విద్రుమోష్ఠి. 111

తే. అనుచుఁ దనపత్ని బుద్ధికి నాత్మ మెచ్చి, వెలఁది తలిదండ్రులను జూచు వేడ్కఁ బోయి
మేలు చేసితి వని చాల లోలుఁడగుచు, శ్వేతవాహనుఁ డావేళఁ బ్రీతిఁ బొంది.

క. ఇంతిని దోడ్కొని ఫల్గునుఁ, డంతకసుతభీమయమళు లాత్మజు లింతుల్
కుంతియు నున్నెడకుం జని, సంతోషితహృదయుఁ డగుచుఁ జయ్యనఁ బలికెన్.

క. బలరాముఁ డతనితమ్ముఁడు, జలజాక్షుం డాత్మ నలరి సౌభద్రునకున్
గలశస్తని శశిరేఖను, సలలితముగఁ బెండ్లిసేయ సమయం బనుచున్. 114

క. బిసరుహలోచనయెదుటన్, ముసలియుఁ గోవిందుఁ డిట్లు ముద మలరంగాఁ
బసగలుగ నాడుకొన్నా, రసదృశు లగువారిమాట లనృతము లగునే. 115

క. అనిన విని వారలందఱు, ఘనవేణి సుభద్ర సేయుకార్యము నెంతో
పనివడి వినుతు లొనర్చిరి, కనుగవ లానందబాష్పకణములు దొరఁగన్. 116

వ. తదనంతరంబ. 117

క. అంతకసుతుఁ డనుజన్ములు, సంతసమున లేచి కొలువు సభ కేఁగినచోఁ
గుంతియుఁ గోడండ్రను దా, నంతఃపురి కేఁగె నవ్వు డపసీనాథా. 118

వ. ఇవ్విధంబున. 119

సీ. కౌంతేయు లేవురు సంతోషయుక్తులై బాహుబలంబుతో నాహవమున
శరచాపములఁ బట్టి పరరాజులను గొట్టి వారిచే నరిఁ గొంచు వసుధయందు
రాజసూయము చేసి రంజిల్లుకీర్తితోఁ బాకశాసనభోగపటిమ మించి
కృతయుగధర్మంబు క్షితితలంబున నిల్పి రాజ్యంబుఁ బాలించు రాజసుతుల
తే. సురుచిరంబైనవిభవంబుఁ జూడలేక, క్రోధమదయుక్తుఁ డైనదుర్యోధనుండు
కపటజూదంబునను రాజ్యమపహరించి, యడవులకుఁ బంపఁ బాండవు లడవియందు.

మత్తకోకిల. ఉన్నవారని చెప్పఁగా విని యుల్లమందునఁ జింత న
త్యున్నతం బగువాహనంబుల నొప్పు గొప్పరథంబుపైఁ
దిన్నగా వసియించి సారథి తేరుఁ దోలఁగ వేగమే
పన్నగారితురంగుఁ డేఁగెను బాండుపుత్రులఁ జూడఁగాన్. 121

వ. అట్లు దామోదరుండు ద్వైతవనసమీపంబునకుం జని తద్వనంబున ఫలంబు లాహా

రంబులుగాఁ బుత్రమిత్రసహోదరులతో వనవాసంబు సేయుచున్నయజాతశత్రుం
గని యుచితోపచారంబుల వారిమనంబు లలరఁజేయుచు ద్రుపదరాజపుత్రి యైన
ద్రౌపది నూఱార్చుచుఁ గొన్నిదినంబు లుండి యొక్కనాఁడు. 122

సీ. పరమధర్మాత్ము లౌపాండుపుత్రులఁ జూచి హరి యిట్టు లనియె మీ రాత్మయందు
వంతఁ గుందఁగ నేల వనవాసనమయంబు గడచిన రాజ్యంబు గల్గు మీకు
దైవసహాయంబు తథ్యయుఁ గల దని మఱియుఁ సుభద్రాభిమన్యు లిట్టి
యడవుల బహుకాల మిడుములఁ బడనేల పంపుము ద్వారకాపట్టణమున
తే. కనిన గోవిందుమాటల కలరి పార్థుఁ, డాసుభద్రను నభిమన్యు ననుపుటకును
సమ్మతించిన సారథి శౌరి చూచి, రథ్యములఁ బూన్చి వేగనె రథముఁ దెమ్ము 123

వ. అనిన విని దారుకుండు సైన్యసుగ్రీవమేఘపుష్పవలాహకంబులం బూన్చి రథంబుఁ
దెచ్చినం జూచి గరుడధ్వజుండు కౌంతేయాగ్రజానుమతంబు వడసి సుభద్రాభిమ
న్యుల రథంబుపై వసియింప నియోగించి తానుం గూర్చుండి ద్వారకానగరంబునకుం
జని జననీజనకు లైన దేవకీవసుదేవులకు మ్రొక్కి పాండవులు ద్వైతవనంబునం
దున్నవా రని చెప్పి మఱియును. 124

క. చెల్లెలు సుభద్రహృదయం, బుల్లాసము గలుగఁ గోర్కె లూనఁగుచుఁ గృష్ణుం
డల్లుని లాలన సేయఁగ, నుల్లము రంజిల్లఁ జెలఁగుచుండిరి యచటన్. 125

క. అన్నలు వదినెలుఁ దన్నుం, మన్నన గావింప వగపు మాని ప్రహృష్టో
త్పన్నమతి సుతయుతంబుగ, వెన్నునితోఁ బుట్టువుండె వేడుక లలరన్. 126

వ. ఇట్లున్నసమయంబున. 127

క. శశిరేఖ యొకావసరంబునఁ, బసిమికి నామోద మబ్బుపగిదిఁ జెలంగెన్
శశి నిరసించినయాస్యం, బసియాడెడుకౌను నూరు లరటులు దలఁపన్. 128

సీ. కలకంఠికృంగారజలధిమధ్యంబునఁ గుచమందరాద్రిగాఁ గుదురుపరచి
వెలఁది వెన్నునఁ దూఁగువేణికరిత్రాటిఁ గరతలంబులఁ బట్టి కాంక్ష లూరఁ
దరచఁగా నమృతంబు కలుచుగా జన్మింప నరవిందశరుఁడు తా నాక్రమించి
నందులో నగపాలు నలివ మోవిని జేర్చి నిలచినసగపాలు నేర్పు మెఱయ
తే. నంద మమరంగ తనధనువందు నిలిపి, యువనిలోఁ దీయవిలుకాఁ డనంగఁ బరగె
ననుచు మగువలు వినుతింప నాత్మయందు, సంతసిల్లుచు నొప్పె నావంతిగమన.

సీ. పగడంబు వెడ్కతో జగడంబుకొన వచ్చె శరినమై సఖియచేకట్లఁ బడియె
నింపైనరుచికెంపు నిగ్గున సరిరాక రంగుమీఱినయుంగరమున నిలిచె
పంబినప్రభ నొప్పుబింబంబుఁ బరికించి తులగాక స్రుక్కుచుఁ దోలఁగెఁ జోటు
ఖాంక మైనట్టియామంకెనకుసుమంబు జోడుఁ బూనఁగలేక వాడుఁ బూనె

తే. పల్లవంబులు సరిగాక పసరు లొందె, నన్నెలంతుక యచ్యుతాగ్రజునిపుత్త్రి
యచ్యుతస్తని శశిరేఖ యధరమునకు, నన్నియును దుల్యరహితంబు లయ్యె నార. 130

క. అక్కలికి మొలకనవ్వులు, చెక్కులజిగి సన్నుతింప శేషునివశమా
చుక్కల నేలునఖంబులు, చక్కనిశశిరేఖ సాటిసఖులుం గలరే. 131

తే. అట్టిశశిరేఖ ముదముతో నైనవులకుఁ, బసుపు కుంకుమ గంధంబు కుసుమచయము
లందముగఁ దెచ్చియిచ్చినఁ గుందరదన, లంద ఆనందహృదయారవింద లగుచు.

క. మృగనేత్రయిందురేఖకుఁ, దగుమగఁ డభిమన్యుఁ డగుట తథ్యం బనుచున్
మగువలు పాటలు పాడఁగ, నగరాట్కుచ నవ్వుకొనుచు నామోదముతోన్. 133

సీ. అంతిపురంబులో నింతులతోఁ గూడి చదరంగ మాడెడుసమయమందు
నచటికి సౌభద్రుఁ డరిగిన శశిరేఖ రెప్పవేయక వానిరీతిఁ జూచి
యాత్మలోఁ బలుమారు నతనిరూపము మెచ్చి చిత్తజుఁ బోలుమేనతకొడుకు
చిత్త మెట్లున్నదో బొత్తిగాఁ దెలియరా దెవరిఁ బెండ్లాడునో యింద్రపౌత్త్రు
తే. చక్కఁదన మెల్ల ముల్లెగా సంతరించి, అతిశయంబుగ నిర్మించినట్టియజుని
మెచ్చవలె నని మదిలోన మీననేత్ర, దర్పకాకారు సౌభద్రుఁ దలఁచి మఱియు.

క. చక్కఁదనంబున మిక్కిలి, చుక్కలగమి కాఁడు నలుఁడు సురపతిసుతుఁడున్
జక్కలకొనికుమారుఁడు, చక్కెరవిలుకాఁ డటంచు జను లన విందున్. 135

క. వినివిని కర్ణేంద్రియములు, ననుదిన మానంద మొందె నర్జునసుతునిన్
గనుఁగొని నేత్రేంద్రియములు, ఘనమోదము నొందె ననుచుఁ గౌతుకమతి యై.
తే. మఱియు నభిమన్యుశృంగార మరసియరసి, ప్రస్తుతింపుచు మోహవిభ్రాంతినొంది
తనమనంబున మగనిగాఁ దలఁచితలఁచి, యుత్తరోత్కలు గోర కాయింతి యుండె.

వ. ఇట్లున్నసమయంబున. 138

తరల. రతినిబోలినయిందురేఖను రాజసూనుఁడు చూచుచున్
మతిని దిగ్భ్రమ నొంది వింతగ మారుబారికిఁ జిక్కినన్
అతిశయం బగు మోహతాపము అంతరంగము నేఁచఁగా
హితులతోఁ బ్రతిమాటలాడక యేమి చేయఁగ నేరకన్. 139

సీ. ఇభరాజగమనుఁ డౌనభిమన్యుఁ డావేళ నూటాడుకోర్కెతో నూర్పు లిడుచుఁ
బచ్చవిల్తుఁడు తన్నుఁ బట్టి బాధింపఁగా మచ్చుఁ జల్లినరీతి మఱదుఁ డగుచు
బలరామపుత్త్రి తన్వలరాజకేళిలో నేలునో లేక తా నేలుకొనదొ
యేలకుండిన మారుఁ డేల వన్నన సేయుఁ దుంటవి ల్లెక్కిడి వెంటఁ దగుల
తే. కనుచు మోహాంబురాశిలో నతఁడుమునిఁగి, తరుణిశృంగారమాత్మలోఁదలఁచి తలఁచి
జలజలోచనమర్మంబు దెలియ దనుచు, ధీరకుమారుఁడు లేచి పూఁదోట కరిగె.

వ. మఱియు నప్పూఁదోఁటయందు మనోహరంబు లైనమల్లెలు మొల్లలు జాజులు విరవాదివిరులు గోరంటలు దేవకాంచనకుసుమంబులు గొజ్జంగులు కేతకీదళంబులు చేమంతివిరువంతు లాదిగాఁగల కుసుమామోదంబులు గొని వినోదంబుగా మకరంద పానంబు సేయుషట్పదంబులు ఝుమ్మఝుమ్మని మ్రోయఁ జలించుచుండెడు లతా కదంబంబులును, చంద్రకాంతపుమణిమయంబు లైన సోపానంబులపై మనోరంజకం బుగా విహరించుచక్రవాకబకక్రౌంచసితమరాళంబులు సుస్వరంబులతో నాదంబు లు సేయ శతపత్రసహస్రపత్రకమలంబులతో నలంకృతంబు లైనసరోవరంబులును, జంబూతరువిటపంబుల నల్లుకొనిన నేలకీలతావిశేషంబులజొంపంబుల క్రిందఁ బద్మరా గస్థగిత వేదికాస్థలంబున మనోభవసాయకంబుల కులుకుచు సౌభద్రుండు వసియించి యుండుసమయంబున. 141

క. అప్పుడు బలభద్రాత్మజ, ముప్పిరిగొను మోహ మాత్మ ముమ్మర మగుడున్
దప్పక నభిమన్యుఁడు చనె, నప్పూఁదోఁటకును జేడె లందఱుఁ గొల్వన్. 142

రగడ. చనిచని చూడఁగ సహకారంబులు, కనుఁగొనఁగా బహుఖర్జూరంబులు
కంటికిఁ బ్రియ మగుకదళీతరువులు, పంటవలంతికి బహుభూషణ మై
సలలిత మై తగుజంబీరంబులు, ఫలముల నెప్పుడు భాసిలు పనసలు
మధురఫలంబుల మాకందంబులు, మది ముదమొదవెడు మాధవితరువులు
విమలోదకముల వెలసిన సరసులు, రమణీయము లగురాజీవంబులు
నిసుకదిన్నియల కిరవగు నేఱులు, నసమబాణునకు నానందముగాఁ
బరిమళయుత మగుబహుపుష్పంబులు, పరిపరివన్నెల పారిజాతములు
గలిగినతావులఁ గాంతలు గొల్వఁగ, హరిపుత్రిక పార్థాత్మజుకొఱకై
వేడుక లలరఁగ విహరింపుచుఁ దరు, నీడలు గనుఁగొని నెలఁతలుఁ దానున్. 143

సీ. ఆసమీపంబునం దతిరమ్య మైనట్టి సైకతస్థలి కేఁగి సంభ్రమమున
కలకలంబునఁ బల్కుచిలుకల నటుడించి వేడ్కతోఁ గూర్చుండి వీణె లెలమిఁ
కుచములపైఁ జేర్చి రచనగా గానంబు సేయుచు శశిరేఖ చెలులఁ జూచి
పంచమస్వరరాగపటిమ దప్పక మీరు పాడరే యనఁ జెలుల్ పాడుచుండ
తే. నావనంబున నుండినహంసములును, శారికాకీరపికములు చాలఁ బలుకఁ
బలుకు లాలించి సఖులచే చిలుక లన్ని, బలగములఁ జూచుకోర్కెతోఁ బాఱె వనికి.

క. పాఱినకీరంబులఁ గని, కూరిమి శశిరేఖ చిలుక గొబ్బునఁ జని తా
నారామసీమలోపల, భూరితరం బైనజాజిపూఁబొద ప్రాఁకెన్. 145

క. కనుఁగొని సుభద్రసూనుఁడు, వినయంబున దానిఁ బిలువ విని యాశుకమున్
ఘనుఁ డభిమన్యుం గనుఁగొని, చను వమరఁగఁ జేతిమీఁదఁ జయ్యన వ్రాలెన్.

తే. కరముపై వ్రాలు శుకరాజుఁ గరముప్రీతి, సరవిలాలించిముదముతో శక్రపౌత్రుఁ
డోశుకీమణి యేరాచవనిత నిన్నుఁ, బ్రేమతోఁ బెంచెఁ జెప్పుమా రామచిలుక.

వ. అనిన విని. 148

క. మారునిఘోటక మిట్లనుఁ, గారుణికోత్తంస వినుము ఘనమగుమదితో
సీరితనూభవ శశిముఖి, కూరిమితో నన్నుఁ బెంచెఁ గురుకులతిలకా. 149

క. ఆరామసీమలోపల, నారామునుఁ బాసి నేను నతివేగముగా
నారామచిలుక లరయుచు, రా రాసుత నిన్నుఁ జూడ రమ్యం బయ్యెన్. 150

వ. అని. 151

క. ఈలీల శుకము పలికిన, బాలుం డభిమన్యుఁ డంత బహుమోదముతో
లోలాక్షిరాకఁ గోరుచు, నాలోకన సేయుచుండె నావనసీమన్. 152

సీ. కంజాక్షు లావేళ గానంబు చాలించి విమలసైకతముపై వీణెలుంచి
పాఱిపోయినతమకూరిమిచిలుకల నరయంగ నేఁగిన సరసిజాక్షి
బలపుత్త్రి తనముద్దుచిలుక పోయినజాడఁ బోవుచు మల్లెపూఁబొదలు చూచి
జాజిపూలతలన్ని జలజాక్షి వీక్షించి దాడిమితరువు లాతరుణి గాంచి
తే. భూరిశాఖల విలసిల్లుపొగడతరుల, గుజ్జుమామిడిభూజాలపజ్జ నరసి
కదళికాతరు లరయుచుఁ గలికి కూర్మి, చిలుకఁ గానక చింతించి చెలులఁ దలఁచి.

క. భామలు రా కిటు మసలిరి, కామునితురగంబు నరయఁ గనుపడ దోహో
యేమని చెప్పుదు నని యా, రామయుం నారామసీమ రా రాసుతుఁడున్. 154

తే. చూచె శశిరేఖసొగసువాల్చూపుదాని, కొప్పు పైనుంచుసవరంపుఁ గుప్పెబిళ్ల
లాణిముత్యాలబావలీ లందమైన, భూషణంబులు మించుపూఁబోణి నతఁడు. 155

వ. ఇట్లు శశిరేఖం జూచి సౌభద్రుండు తనమనంబున. 156

క. సుందరి శశిరేఖకుఁ గల, సందెసుతలవెండ్రుకలకు సమమగుచందం
బంద మగుమోముఁ గనుఁగొనఁ, గందర్పునిమేనమామగతి నలరారెన్. 157

ఉ. చూచితి నిర్జరాంగనల సుందరి నింద్రునిరాణిఁ జూచితిన్
చూచితి నాగకన్నియల సుందరరూపవిలాసవైఖరుల్
చూచితి రోహిణిన్ రతిని జూచితి యక్షసరోరుహాక్షులన్
చూచితిఁ గాని దీనిసరిసుందరరూపము లేదు వారికిన్. 158

మ. పురుహూతోపలకాంతులీకురులతోఁ బూర్ణేందుఁ డీమోముతో
నరజాబిల్లిమెఱుంగునెన్నుదురుతో నబ్జంబు కందోయితో
మరుచాపం బరయంగ భ్రూయుగముతో మత్తాళి దృక్పాళితో
సరి గా వీచెలిసౌకుమార్య మిలలో శక్యంబె వర్ణింపఁగాన్. 159

క. అబ్బబ్బ యీసఖీమణి, గుబ్బచనుద్వయము స్వర్ణకుంభంబులొ లే
కబ్బురమగులికుచంబులొ, యబ్బినసుమకందుకములొ యంరుజక్కవలో. 160

క. చక్కనిమౌక్తికహారం, బక్కజమగురత్నపదక మమరినయురముం
జక్కెరదిండివజీరుని, చొక్కపుసింహాసనంబు సొబగు వహించెన్. 161

క. నారీమణితొడ లనఁటులు, వారక నయశాలు లరయ వనితసుజంఘల్
వారిజముఖిపాదంబులు, సారసములు కాంతకాను సత్పథ మయ్యెన్. 162

క. శశిముఖికుచభారంబున, నసియాడును గా నటంచు నబ్జభవుండున్
విశదమతి లోహలతికన్, బొసఁగించెనొ యనఁగ నారు పొలఁతికి నొప్పెన్. 163

వ. అని సౌభద్రుండు శశిరేఖరూపాతిశయంబుఁ గొనియాడుచున్న సమయంబున. 164

సీ. చెలియ ధమ్మిల్లంబుఁ జేర్చినవిరజాజి పరిమళం బంతటఁ బ్రబ్బికొనఁగ
నళికంబుపైఁ దీర్చుతిలకంబుకస్తూరి నిస్తులం బగుతావి రస్తుగురియ
నబ్జాక్షి గుబ్బల నలఁదినగంధంబు గుప్పున నామోద ముప్పతిల్ల
సాంబ్రాణిధూపవాసన మించుచేలాంచ, లంబు కుచద్వయి లలిని జార

తే. మరునిగజ్జెలగుత్తంబు పరువువాడు, కరణి నూపురములు గల్లుగల్లు మనఁగ
సొగసుయానంబుతో వచ్చుసుదతిఁ జూచి, కలకలంబునఁ బల్కె నాకలికిచిలుక.

వ. ఇట్లు పలికిన విని. 166

తే. శుకముక్తి చూచె శుకవాణి సొగసుకాని, నోము నిరసించురుచులనెమ్మోమువాని
సోగకన్నులవాల్జూపు చూచువాని, మొలకనవ్వులు మోముపైఁ జిలుకువాని. 167

క. హానుమత్కేతుతనూజుం, గనుఁగొని ఫుల్లాబ్జనేత్రి ఘనలజ్జిత యై
చనిచని మాటున నిల్చిన, మనసిజుఁ డెదనాటెఁ బుష్పమార్గణచయముల్. 168

ఉ. అండజయానకు న్విరహ మగ్గల మై ధృతిదూలి యిత్తుకో
దండునిబాణవేదనను దద్దయుఁ మూర్ఛ మునింగి పిమ్మటన్
గొండొకవేళకుం దెలిసి కోమలి పార్థుని జూచి సిగ్గుతో
వెండియుఁ జిల్క నిమ్మనుచు వేడుక యూరకయుండె నచ్చటన్. 169

వ. ఇట్లు లజ్జానన యై యున్న శశిరేఖం జూచి సౌభద్రుం డిట్లనియె. 170

సీ. సఖియ నీమోముతో సరిగాక రేరాజు మదిఁ గుంది మిక్కిలి మలినుఁ డయ్యె,
నింతి నీకురులతో నించుకసరిగాక కువలయంబులు మూతగొనియెఁ బవలు
ఆతివ నీచెక్కుల కద్దము ల్సరిగాక రసయుక్తమై కొంత వసుధకెక్కె
కుంజరయాన నీకుచములతో సరిగాక సారంగమలగుంపు చనియె దివికి

తే. చూడ్కులకులోఁగి జింకలు సొచ్చెఁ బొదలు, యానమున కోడి సరసికి సంచలరిగె
నీవు పల్కెడిపలుకులు నేర్చుకొనుట, చిలుక నిన్నాశ్రయించునే కులుకులాడి. 171

క. లలనామణి నీకుఁగల, చెలువము గణుతింప నాదిశేషునివశమా
వలరాజు బారి కోర్వక, వలపున నీసొగసుఁ గొంత వర్ణన సేతున్. 172

సీ. నీఫాలతలముతో నెనగాక జాబిల్లి తొల్లనే వసుధలో దూష్యుఁ డయ్యె
నీకన్నుబొమలతో నెనగాక మరువిల్లు తుంటయై మిక్కిలి గంటులొందవె
నీమోవికాంతితో నెనగాక పవడంబు కాఠిన్యమై చేతికట్టుఁ బడియె
నీమేనిచాయతో నెనగాక కనకంబు కమటంబులోఁ జొచ్చి కాక నొందె
తే. తెరవ నీకుచయుగముతో దీటు గాక, పటుతరం బైనజక్కవల్ పక్షు లయ్యె
బోఁటి విను నీదుకౌనుతో సాటిగాక, గురుతరం బగుసింగము ల్గుహాలు సొచ్చె. 173

వ అని వెండియుఁ. 174

శా. బాలా నీమృదుగానమాధురిమచే భావంబు నీరయ్యె ని
న్నాలోకించిననాడుచూడ్కులకు నానందంబు వర్ధిల్లె నీ
లీలోద్యానవిహారము న్గనిన హాళిం జెందె నాచిత్త మో
లోలాక్షీ నను గాముబాణములకున్ లోఁజేయకే వేఁడెదన్. 175

క. అని సౌభద్రుఁడు పల్కిన, విని కోమలి సంతసించి విజయతనూజుం
గనుఁగొని హాసానన యై, వినయంబున నిట్టులనియె వీరాగ్రణితోన్. 176

ఉ. మేరుగిరీంద్రధైర్యజిత మేదినిఁ గామిను లెంచిచూచినన్
ధీరతఁ బాపనేర రని తెల్పి శుకంబును గాన కీవనిన్
వారిజనేత్రుల న్విడిచి వాసిగ వచ్చితిఁ జిల్క నీయవే
కారుణికాగ్రగణ్య యని కంజదళేక్షణ విన్నవించినన్. 177

చ. జలధరవేణిపల్కులకు సంతసమొంది సుభద్రసూనుఁ డా
చిలుకలకొల్కి కిట్లనియెఁ జిల్కలు నీవలెఁ బల్కనేర్చునే
కలికిరొ చిల్కపైమమత గల్గినఁ గైకొను సంశయించినన్
బలుమరు మాట లేమిటికిఁ బంకజలోచన కొంకి కేటికిన్. 178

క. ఆమాటకు బింబాధరి, మోమోటము మాని పల్కె ముదమలరంగా
సామాన్యమె పరపురుషుల, సామాన్యముఁ జేరి సఖులు సంభాషింపన్. 179

క. వలవనిసుద్దులు వల దీ, చిలుకను దయచేయుఁ డింక జేరెద సఖులన్
పలుమరు పల్కుట మాకుం, గులధర్మముగాదు దేవ కోపింపకుమీ. 180

వ. అనిన విని సౌభద్రుం డి ట్లనియె. 181

చ. పరపురుషుం డటంచు ననుఁ బల్కఁగ నో కెటు లాడె బాల్యమం
దిరువురఁ జూచి నీజనకు లిద్దఱుపల్కినపల్కు లన్నియున్

మఱచితె యౌవనం బనెడుమాంద్యము గప్పిన విఱ్ఱవీఁగుచున్
పరిపరిరీతులం బలుకఁ బాడియె నీకు సరోజలోచనా. 182

ఉత్సాహము. కోమలాంగి నిన్ను నేను కోరినందు కేమి నా
కామితంబు వ్యర్థమాయెఁ గామబాధ కోర్వ నిం
కేమిసేతు మామకూఁతు రిట్టిమాట లాడ నీ
కేమిబోధఁ గల్గెఁ జెప్పు మింతి దీని దాఁచకన్. 183

వ. అని మఱియును. 184

క. పలుమరు నాతోఁ బల్కుట, కులధర్మము గాదటంచుఁ గొంకక నీవున్
బలికినపల్కులు మదికి, న్ములుకులవలె నాటె నింక ముచ్చట లేలా. 185

వ. అనిపల్కి సౌభద్రుండు తనమనంబున ని ట్లని విచారించె. 186

క. ఈతరుణి పల్కుపల్కులు, నీతిపథం బగుచుఁ దోఁచె నే నాడినవే
నీతికి బాహిర మైనవి, నాతికి బాణంబు లగుచు నాటక యున్నే. 187

తే. ఏను బల్కినపల్కుల కింతిమనసు, నొచ్చునో దీని కేమనవచ్చు మదికి
సంశయము గల్గెనని సవ్యసాచిపుత్త్రుఁ, డేమితోఁచక తలయూఁచి మోముపంచి.

తే. విన్నవై యున్నయాతనివిధముఁ జూచి, యిందుముఖి చాల చింతించి యేను వనికి
నేల వచ్చితి నిక మేల యితనిచేతఁ, బట్టు వడె నని మదిలోన నిట్టు లనియె. 189

ఉ. చుక్కలఱేని మైతళుకుఁ జూచి హసించును వీనిమోము యా
చక్కెరధన్వు లోపుగను సారెకు నొప్పును వీనిసుందరం
బక్కజమయ్యెఁ జూడ్కులకు నంబుజనేత్రలు వీనిఁ జూడఁ దా
మక్కర గల్గి రమ్మనరె యంగజకేళికి మాటిమాటికిన్. 190

వ. అని వెండియు. 191

సీ. నోరెఱుంగక నేను నుడివితిఁగా కొన్ని యందుకు హృదయంబు కందెనేమొ
ఏ నెంత నితనికి నిందుబింబానన లముదామె వలతురు తలఁచి చూడ
నీగుణాఢ్యుఁడు నాకు నీశుఁడు గాకున్న సొగసేల చెలుకేల సొమ్ములేల
వగ కానిచిత్తంబు వగపెట్టఁగా నౌనె యనిపల్కునంతలో నతనుఁ డేసె

తే. నపుడు వనితకు మోహ మత్యధికమైన, దరువుమా టేల నని వచ్చి దద్దరిలక
దేవదత్తధరాత్మజుఁ దేరి చూచి, పడఁతి జేతులు జోడించి పలికె భక్తి. 192

క. నేను వచించినవాక్కులు, మానసమున నుండవలదు మామా యిపు డీ
దీనతఁ బొందఁగఁ బనియే, మానన మిఁక నెత్తి మాటలాడుము నాతోన్. 193

వ అదియునుం గాక. 194

క. రాజాస్యలపై మిక్కిలి, రాజులు మఱి కోపగించుట గరయంగా

గాజులగు దెకున్ రోఁకలి, రాజితముగఁ బూనినట్లు రాజతనూజా. 195

వ. అని మఱియును. 196

సీ. వాసవివరపుత్ర భాసురంబుగ నీవు దేవి గావున్న నాదేహ మేల
చెలువొంద నినుఁ బెండ్లి చేసుకోవలె నంచు ననవరతంబు నే నాత్మఁ దలఁతు
బాగుగా నాకోర్కె ఫలిత మా యెన్నఁడో వనజసంభవుఁ డెట్లు వ్రాసినాఁడొ
అవిగాక నీచిత్త మరయంగ నెట్టిదో దేవ నామది కేమి తెలియ దనుచుఁ

తే. బలుకుశశిరేఖఁ జూచి సౌభద్రుఁ డాత్మ, సంతసిల్లుచు ని ట్లను దంతిగమన
మనసుమర్మంబుఁ దెలియక మందబుద్ధి, నగుచుఁ బల్కెడి నావల్కు లాత్మ నిడకు.

సీ. కలికి నీపైఁ గోర్కె గలిగినందుకు నీవు కరుణించకుండినఁ గంతుఁ డేల
మనసిచ్చు నామీఁద మార్గణంబులు పూని మది నాట నేసె నామాట వినుము
వసుధలో క్షత్రియవరులకు గాంధర్వపరిణయం బొకటొప్పుఁ బంకజాక్షి
అదియె యోగ్యంబుగా నగుపడె నిప్పుడు జాగు సేయఁగ నేల శంబరారి

తే. కేళిలో నన్ను నేలవే బాల యనుచుఁ, బలుకుసౌభద్రువలపు భావంబు దెలిసి
వెలఁది చరణంబు లొక్కింత వెనుక కిడుచు, దిట్టతనమున నతనితో నిట్టులనియె.

క. ధారుణిలో మగవారలు, ధీరు లటం చనఁగ విందు దేవా నీ వా
ధీరగుణం బెడసేయుచు, నీరీతిం ద్వరపడంగ నీకుం దగునే. 199

క. వెడవింటివానిబాధకుఁ, దడ వోర్వఁగలే నటంచుఁ దత్తరపడుటన్
గడుఁ బరమాన్నము నార్పక, నుడుకుడుకుది జుఱ్ఱునట్టు లున్నది చూడన్. 200

క. పెద్దలు బలకృష్ణులు మన, కిద్దఱికిని బెండ్లి సేతు రింతకు లోఁగా
నిద్దఱుఁ గలసియుం ధరలోఁ, బద్దుకు రానేల వినుము పార్థతనూజా. 201

తే. మగువలకుఁ బెండ్లికిమున్ను మరునికేళిఁ, జొచ్చి పురుషులఁ గలసిన మెచ్చ రవని
జనులు నిందింతు రటమీఁద జననిజనకు, లరివిధంబునఁ జూతురా యబ్జముఖిని. 202

క. తలవంపు లేలఁ జేసెదు, కులకాంతలలోన నాకుఁ గురుకులతిలకా
చిలుక నొసంగినఁ బోయెద, వలపున హృదయంబునందు వగవకు మామా. 203

వ. అని యివ్విధంబున. 204

ఉ. సుందరిపల్కుపల్కు లొకసొంపుగ వీనుల నాలకించి యా
నందపయోధిఁ దేలి నరనందనుఁ డాచెలి డాసి వేగమే
యిందునిభాస్య నీచిలుక నిచ్చెదఁ గొమ్మని చూపి డెందముం
గొందలమందఁగా నొడిసి కోమలిహస్తముఁ బట్టి యిట్లనెన్. 205

ఉ. శంబరవైరివేదనకు శక్యముగాదు మనంబు నిల్పఁగా
నంబుజనేత్రి నీదునధరామృతపానము సేయకున్నఁ బ్రా

ణంబులు దక్కనేర వని నాహృదయంబునఁ దోఁచె నన్నుఁ బ్రే
మంబున నేలవే రమణి మాటలతో నిఁక జాగుసేయకన్. 206

చ. కులుకుమిటారి నీబటువుగుబ్బలు నాయెద నుంచి వేడ్కతో
వలపునఁ గౌఁగిటన్ దిగిచి వాతెర నొక్కుచు ముద్దు లిచ్చి చ
క్కలిగిలిబెట్టి నామదికి గిల్కన సంతసమందఁ జేసినం
జిలుకపటాణిరాతు నొకచీరికిఁ గొందువె హంసగామినీ. 207

ఉ. చిత్తజుఁ డేయుతూపులకుఁ జిత్తము తత్తరపాటుఁ జెందుచుం
గుత్తుకబంటిమోహమునఁ గ్రుంకుచుఁ దేలుచు నున్నవాఁడ నీ
చిత్తము నాదుభాగ్య మని జీరెను నర్జునపుత్రుఁ జూచి యా
మత్తగజేంద్రయాన మరుమాటవచింపక నూరకుండినన్. 208

సీ. వెండియుఁ సౌభద్రుఁ డండజయానతోఁ బలికె నాపై నింత పంతమేల
కంతునికేళి కై యింతగాఁ బ్రార్థింపఁ గరుణ యావంతైనఁ గలుగ దబల
మామకూఁతురటంచు మది నమ్మినందుకు వృథసేయకే నన్నుఁ బృథునితంబ
యేలనే యనుమాన మేల నీలాలక యేలనే భయము యింకేల సిగ్గు

తే. ముదిత విను చల్లకై వచ్చిముంత దాఁచు, చందమైతోఁచె నిఁకఁ జాలు జాటటంచుఁ
బలుకుసౌభద్రు తత్తరపాటుఁ జూచి, బిసరుహానన శశిరేఖ భీతిఁ బొంది. 209

వ. ఇవ్విధంబున నీలాంబరతనూజాత భయాకులచిత్తయై సౌభద్రునికరంబు విడిపించు
కొనుసామర్థ్యంబు లేమింజేసి తనమనంబున నొకయుపాయంబు చింతించి యిట్ల
నియె. 210

క. అదె నాసఖు లరుదెంచిరి, వదలు కరం బనుచుఁ బలుక వాసవిసూనుం
డెద చెడి కరము నీడినఁ, బదములు వడకంగ నరిగి పణఁతులఁ జేరెన్. 211

వ. ఆసమయంబున. 212

సీ. పంకజాసన తన్ను బొంకించిపోయిన దశదిశ లీక్షించి తాల్మి డించి
వెన్నెధిః గోల్పోవుపేదచందంబున విన్ననై పలుమారు వెచ్చ నూర్చి
విజయుతనూజుండు విరహతాపంబుతోఁ దనకుఁ దా నాత్మలోఁ దలఁచె నపుడు
మాయ చేసి తొల్లింగె మరల రా దాకొమ్మ యేయుపాయము తోఁచ దేమిసేతు

తే. దానిముద్దులనగు మోము దానిసొగసు, దానిచూపులు బెళుకులు దానిహొయలు
దానికులుకులు నడకలు దానినడలు, కన్నులకుఁ గట్టినట్టుగా నున్న దిపుడు 213

క. అంగజురణరంగంబున, నంగనను నాకు నాల మబ్బినయపుడే
బంగరుకుసుమంబులతో, నంగజు నర్చింతు మదికి నానందముగాన్. 214

వ. సౌభద్రుం డివ్విధంబునఁ జింతింపుచు నుద్యానంబు వెలువడి మందిరంబుఁ బ్రవేశించె నంత నక్కడ. 215

సీ. చేసితూపులవానిగాసి కోర్వఁగ లేక పరితాప మొందెను భాసురాంగి
శశిరేఖ వీక్షించి జలజాక్షు లావేళ యెలనాఁగ చింతింపవలవదమ్మ
రాచకన్నియ లిట్టు రమణుల నెడఁబాసి పోవుట నుచితమే పువ్వుఁబోఁడి
యేమిచిత్రము గంటి వింతలో నీవింత చిన్నవో నేటికి సింహమధ్య
తే. మంచుపొడివినకమలంబుమాడ్కి నీదు, మోముపైఁ జెమటబిందువు లుదిత వొడమఁ
గారణం బేమి వేగమే కలతెఱుంగు, బాల శశిఫాల చెప్పు మింకేల భయము. 216

క. అని పలికినఁ జెలికత్తెలఁ, గనుఁగొని తాలాంకపుత్రి కంపితమతితో
వినరమ్మా వివరించెద, వనజాయతనేత్రలార వారనిప్రేమన్. 217

సీ. ఈరామచిల్కకై యారామసీమలో జంట నెవ్వరు లేక యొంటి నరుగ
నాసమీపంబులో నభిమన్యుఁ డీశుకీమణిఁ జేతఁ బట్టుచు మధురమైన
వాక్కుల కానందవార్ధి మగ్నత నొంది ననుఁ జూడ గాంక్షించుచునునిఁ జూచి
నంతలో నరవదియాశుగంబులు పూని కంతుఁ డిద్దఱిమీఁదఁ గదిసె నపుడు
తే. విరహతాపాతిశయముతో విజయసూనుఁ, డంగ ముప్పొంగ ననుఁ బట్టి యతనుకేళిఁ
బ్రోవు మని చాల వేఁడఁగా బొంకుపఱచి, పిఱికితనమునఁ జనుదెంచి జేలనైతి.

వ. అని మఱియును. 219

తే. వానిరూపంబుఁ దలఁప నామానసంబు, చంచలత నొందె నిప్డు దాపంచశరుని
బారిఁ బడనీక వేగమే భూరికృపను, వాని ననుఁ గూర్చి కావరే వనితలార. 220

క. అని వివశత్వము నొందిన, కనకాంగిని జూచి సఖులు కళవళపడుచున్
మనమున భయవిహ్వలలై, వనితామణి కిట్టు లనిరి వారిజనేత్రల్. 221

క. లలనామణి నీమాటలు, విలసితముగ నాలకింప వింతగఁ దోఁచెన్
వలువగువలపు వహించుట, కలికీ మున్నెఱుఁగవేమె గాండివిసుతునిన్. 222

మ. అతఁ డేలాగునఁ బట్టె నీదుకర మాహా యుక్తమే వానికిన్
మతిలేకుగ్రత నిన్నుఁ బట్టినపుడు న్మన్నించి రావచ్చునే
పతి నీతండ్రులు మాతలు న్వినిన నీచందంబు దా మెత్తురే
యితరు ల్వల్కినమాడ్కిఁ బల్కఁ దగునే యిచ్ఛానుకూలంబుగాన్. 223

క. జడుఁడై సుభద్రసూనుఁడు, దుడుకున నినుఁ బట్టుకొనుట దూష్యము వానిన్
విడనాడి వచ్చినా వని, కడువడిఁ జింతింపఁ దగదు కలికీ నీకున్. 224

క. అని మోహ మెడలఁ బల్కిన, విని కోమలి సిగ్గువొడము విహ్వలమతితో
వనజదళాక్షులఁ గనుఁగొని, గనుఁగవ లరుణములు గాఁగఁ గామిని పలికెన్. 225

ఉ. కామినులార మీ తెఱఁగు గానక మిక్కిలి యాప్తులంచు నా
భామినులంచు నమ్మి బహుభంగులఁ జెప్పుచు మోసపోతి నా
కామము లింత చేసె నని కన్నుల నీ రిడి మాటిమాటికిన్
సామజరాజగామినులఁ జంద్రనిభానన చూచి యిట్లనెన్. 226

ఉ. కప్పురయెలుంగుపాములునుగారె మదిం దలపోసి చూచినన్
తప్పులుగావు బద్ధ మిది తామరసేక్షణలార పూర్వమం
దొప్పుగ రాచకన్నియల కొక్కకవేళల మోహ మబ్బినన్
జెప్పరె తోడిచేడెలకుఁ జేకొని వారలు కోర్కెఁ దీర్పరే. 227

క. మీపలెను బల్కుచెలు లీ, భూవలయమునందు లేరు బుద్ధులు దెలుపన్
గోవిదు లెంచుకు మీరే, భావజు మోహాబ్ధిఁ బడనిపంకజనేత్రల్. 228

వ. అని మఱియును. 229

క. అదయ లయి నన్ను నాడిన, నది సమ్మత మగును గాని యర్జునసుతునిన్
మదయుతులై యీతెఱఁగున, బదపడి నిందింప మీకుఁ బాడియె తలఁపన్. 230

వ. అని సఖీజనంబులతో రోహిణేయాత్మజ వెండియు నిట్లను. నళినిపాతఘాతంబునఁ బొరలుదానికిఁ గొరవిం జూపిన తెఱంగున పదనుగల మదనబాణంబులఁ బరితపించు చున్నన్ను ములుకులవంటిపలుకుల నులుకిపడఁ జేసితిరని గద్గదకంఠంబుతో నెలుంగెత్తి యేడ్చె నయ్యవసరంబున. 231

సీ. కలకంఠు లత్యంతకంపితహృదయలై కామపాలునిపుత్రి మోముఁ జూచి
హాస్యరసంబుగా నాడినవాక్యము ల్విరసంబుగాఁ దోఁచె వెలఁది నీకుఁ
బ్రాణపదంబైన పడఁతులపై నింత కోపంబు సేతురే కుందరదన
నీలాంబరుఁడు భామ నిన్ను సౌభద్రున కిచ్చి పెండ్లిని జేయు నేల చింత
తే. పరఁగ నాతనిసింగార మరసినంత, మరులు పుట్టుట చోద్యమే మందగమన
కుముదమిత్రుఁడు రోహిణిఁ గూడినట్లు, రతిసుఖంబున నేలవే రాజసుతుని. 232

వ. అనుచు నివ్విధంబున నచ్యుతాగ్రజునిపుత్రి నుల్లాసంబు లగుసల్లాపంబుల నూరార్చి శైత్యోపచారంబులు సేయ నొక్కింతసేపునకు సేదదేరి కలహంసగామినుల కరంబు లూఁతగొని యాస్థానంబు వెడలి నగరు ప్రవేశించి మణిమయసౌధాంతరంబునకుఁ జని శయ్యాతలంబుఁ జేరి మోహతాపంబునం బొరలుచుండ నాశశిరేఖ విధంబుఁ గనుంగొనఁ జాల కేఁగెనో యన సవిత్రుండు పశ్చిమాచలంబున కేఁగ నాసమయంబున. 233

చ. పదపడి సంధ్యకాలుఁ డను పాంథుఁడు తృష్ణ హరింపఁగోరి తాఁ
జదలున నెత్తిరేఖ లనుసాంద్రపురజ్జుల నుట్టిఁగట్టి తా

సదమలమైనస్వర్ణకలశంబును వారిధి డించెనో యనన్
ముదమున బశ్చిమాంబునిధి మున్గెను దోయజమిత్రబింబమున్. 234

క. తమ్ములు ముకుళించెను భయ, దమ్ముగఁ జలియించెఁ జక్రదంపతు లీలో
కమ్మున నుండినవల్లి, కమ్ములలోనుండి వెడలె ఘనసర్పములున్. 235

క. పగవాఁడు వార్ధిఁ బడె నా, పగపాసెను బొమ్మటంచు వడిఁ బరువిడుచున్
జగతిని జోరులు మెచ్చఁగఁ, దగ ధనికులు భీతిఁ జెందఁ దమము చెలంగెన్. 236

క. హరిపద మనుకన్యామణి, మురిపంబునఁ గాలవిటుని ముద మొనరింపన్
దిరముగఁ గొప్పున నుంచిన, విరులన నక్షత్రసమితి వెలసెం దరుచై. 237

చ. వెలయఁగ పూర్వదిక్సుదతి వేడ్కఁ జెలంగెడుమానసంబుతో
జలనిధి పెట్టెయం దిడినచారుతరం బగువజ్రరేకడిన్
మలినము వాయఁగా మెఱుఁగుమౌక్తికవారము చేతఁ బట్టి తాఁ
దల నిడుకొన్నదో యనఁగఁ దమ్ములశాత్రవుఁ డొప్పె తూర్పునన్. 238

క. కప్పురపుభరణి విప్పిన, చొప్పున బ్రహ్మాండమెల్ల సొంపువహింపన్
ఒప్పుగ వెన్నెల దోఁచెను, గుప్పున దస్కరులు భీతిఁ గుందుచు వగవన్. 239

తే. కువలయంబున నుండినకువలయములు, వృక్షచయమున వసియించుపక్షిచయము
గాన మొనరించుగంధర్వమానినులును, సంతసిల్లుచు నుండి రాసమయమునను. 240

ఉ. కంతుఁడు రం తొనర్చుచును గార్ముక మెక్కిడి నారిఁ దీడి య
య్యింతిని జేసిబాణముల నేసిన వెంటనె మందమారుతం
బంతనె వచ్చెనభ్రమున నంగజమాతులకాంతు లింతికి
న్వింతగఁ దోచిన న్విరహవేదన కోర్వక బెగ్గడిల్లుచున్. 241

ఉ. భావజుఁ గూర్చి యిట్లనియె పంకజనాభునిపుత్రుఁ డంచు సం
భావన సేసి చెప్పుదురు భావజ నీ కది యొప్ప దుర్విలో
వావి యెఱుంగ కీవిధము వారిజనేత్రల తల్లి చెల్లెల
న్భావములేక పైఁబడిన భామలు తిట్టక మాననేర్తురే. 242

క. అద్రిధరతనయ నీ వా, రుద్రునిసెగకంటిచేత రూపము చెడియున్
విద్రుమరుచిరోష్ఠులపై, నుద్రేకము చూపనీకు నుచితంబగునే. 243

క. మామా యల్లుఁడు నొకటై, మామానముఁ బాపి తమ్ము మననీయరుగా
మీమీగర్వము లరయఁగ, కామా! వివరింపఁ గొంతకాలమె చెల్లున్. 244

వ. అని పల్కి శశిరేఖ చుక్కలఱేనిం జూచి యిట్లనియె. 245

సీ. చల్లనివాఁ డంచుఁ గల్లలాడుటెగాని తాపంబు నొందించుపాపి వీవు
సత్ప్రభుం డని నిన్ను సరసు లెంచుటె కాని యాశ్రితతేజంబు లణఁతు వీవు

సన్మార్గుఁ డని బుధు ల్చాటుచుందురు గాని సతులపాలిటి నిశాచరుఁడ వీవు
మాధవుమఱఁదను మాట యొక్కటె గాని యక్కమందిరమున కహితుఁ డీవు

తే. ఇట్టివాఁ డని తెలియక నీశ్వరుండు, చేరదీసిన శిరముపైఁ జేరి తీవు
పరమదుర్మార్గుఁ డని నిన్నుఁ బలుకవలయుఁ, వసుధ సన్మార్గుఁ డందురే వారిజారి. 246

క. సర్వజ్ఞుశిరముఁ జెందితి, సర్వము నే నంచుఁ దలఁచి సంతసపడుచున్
గర్వమున సఖుల నేఁచినఁ, బర్వమునను నిన్నుఁ బట్టి పాము కరవదే. 247

క. చక్కెరదిండిసిపాయికి, దిక్కైతివి నేఁడు నీవు దిక్కెవ్వరురా
యొక్కొక్కపక్షములోనన్, చుక్కలగమికాఁడ తగదు సుదతుల నేఁచన్. 248

వ. అని మఱియును. 249

క. మలయానిల నీ వింతగ, జలజాక్షులమీఁద జలము సాధించినచో
ఫలమేమి వసుధలోఁ గల, పొలఁతులగోడేల నీకుఁ బో తెమ్మరమా. 250

వ. అని యివ్విధంబున మదనశశిసమీరుల నిందింపుచు విరహానలంబున కోర్వక దగ్గర నున్నసఖీజనంబులతో నిట్లనియె.

తే. వినుఁడు కంజాక్షులార నావిన్నపంబు, పార్థపుత్రుఁడు చెప్పినపల్కులకట!
వినక నిటు వచ్చి నే నెంత వెఱ్ఱినైతిఁ, దమ్మిబాణునిబాధకుఁ దాళలేను. 252

తే. అనిన శశిరేఖ నీక్షించి యబ్జముఖులు, పొలఁతి విజయాత్మజుని నీవు పొందినపుడు
మరుఁడు చంద్రుఁడు గాడ్పు నీమందిరమునఁ, గాచియుందురు పగ పేలకమలనేత్ర.

క. మగువలుపల్కినపల్కులు, తగ వొప్పఁగ నాలకించి తత్తరపడక
వ్వగమాని యూరకుండెను, ఖగవాహునన్నపుత్రి గాసిం బడకన్. 254

భుజంగప్రయాతము.
మురారి న్రమానాథు మోదంబుతోడ, న్పరాకించు సద్భక్తిభావంబుతో మ్రొ
క్కి రాజీవనేత్రాస్వకీయాదులం బ్రోచి రాజిల్లఁగాఁ జేయుం శ్రీకృష్ణమూర్తి. 255

గద్య. ఇది శ్రీమత్సూర్యనారాయణ కరుణాకటాక్షవీక్షణాలంకారసుస్థిరామృతవాక్య
జనిత కవిత్వ రత్నాకరవంశపయఃపారావార రాకాసుధాకర రాంజనేయాఖ్యకనూజ
అప్పప్పరాయాభిధేయప్రణీతం బైన శశిరేఖాపరిణయం బను మహాప్రబంధంబునందు
ప్రథమాశ్వాసము.

ద్వితీయాశ్వాసము.

శ్రీరుక్మిణీమనోహర
కారుణ్యసుధానదీన ఖగరాడ్గమనా
వారిజభవనుతచరణా
క్షీరాంబుధిశయన భక్తసేవాదరణా.

వ. అవధరింపుము సూతుండు శౌనకాదిమహామునులకుం జెప్పినట్లు వైశంపాయనుండు జనమేజయునకు నిట్లనియె. 2

ఉ. ఖండనపండితోత్తములఁ బాండుకుమారులఁ గాన కంపి వే
దండపురాధినాయకుఁడు ధారుణినంతయు నాక్రమించి యా
ఖండలుఁ డేలుమాడ్కి మణికాంచనవస్త్రసమృద్ధి నొందుచున్
నిండుమనంబుతోఁ బ్రజల నేలుచునుండెను భానుతేజుఁడై. 3

ఉ. కర్ణుఁడు ద్రోణుఁడుం గృపుఁడుఁ గర్ణసుతుండును ధృష్టకేతుఁడున్
నిర్ణయవర్తి భీష్ముఁ డపనీతులు సౌబలదుస్ససేనులున్
వర్ణితవిక్రముండు శ్రుతవర్ముఁడు నాతనిబంధుమిత్రులున్
దుర్ణయుఁడైన సైంధవుఁడు దుర్దముఁ డాదిగఁ గొల్చియుండఁగాన్. 4

వ. ఇవ్విధంబునఁ గౌరవేశ్వరుండు విబుధగణసేవితుం డైన మహేంద్రుండునుం బోలెఁ బ్రతిదినంబును గొలువై మహాసంతోషంబునం బొదలుచుండె నంత. 5

సీ. చివ్వరొబువ్వగా జీవించుజడదాల్పు పుండరీకాక్షునిపురముఁ జూడ
నరిగి శ్రీకృష్ణునియంతఃపురంబులోఁ బొడఁగాంచి యతనిచేఁ బూజలంది
కామపాలుఁడు తన్నుఁ బ్రేమతో లాలించి యర్చన సేయఁగా నతఁడు గొన్ని
వాసరంబులు నిల్చి వనజాక్షి శశిరేఖ యాకార మరసి తా నాత్మయందుఁ
తే. దలఁచె నీకన్య సౌభద్ర తరుణిగాఁగ, నంబుజాక్షుండు మదినెంచు నదియుఁగాక
బలుఁడు దుర్యోధనునియందుఁ బక్షపాతి, గనుక నొకవింత గావింతు ఘనముగాను.

క. కలహము గానక యిట్లున్, కలకాలము ప్రొద్దుగడపఁగా వశ మగునే.
బలరాముపుత్రికొఱకున్, కలహముఁ గావింతు ననుచు గలకల నగుచున్. 7

సీ. కనకాంగివిధము నే వినుపింప గురువరుం డతనిపుత్రునకుఁగా నడుగ వచ్చు
వచ్చిన బలుఁడు తా మచ్చిక లాలించి రమణీలలామను లక్ష్మణునకు
నిచ్చెద నని మాట యిచ్చుటొక్కటె గాని నడుమ విఘ్నము సేయ నగధరుండు
కయ్య మించుక యైనఁ గలుగకపోరాదు చయ్యనఁ జేతు నీసాహసంబు
తే. చెడుగు దుర్యోధనున కైనచేటు కేల, వగవ నని యెంచి ముదముతో వారిజాక్షుఁ
జూచి పయనంబుఁ దెల్పుచు సొంపు మిగుల,నంబుజోద్భవసుతుఁ డేగె హస్తిపురికి.

వ. నారదుం డివ్విధంబునఁ బురప్రవేశంబు సేసి సభామంటపంబునఁ గొలువున్న సుయోధనునకుఁ దనరాక నెఱింగించిన నతండు పుత్రమిత్ర సహాయుండై యెదురేగి మ్రొక్కి లోపలికిం దోడ్కొనిపోయి కనకాసనం బిడిన రాజుం జూచి నారదుం డిట్లనియె. 9

చ. కరిపురనాథ పుత్రునకుఁ గాంతలకెల్లను క్షేమలాభమే
చిరముగ నీకునున్ శుభమె తేజిలుచుందురె బంధులాప్తులున్
నిరతము ధర్మ మేమరక నీ వాచరింతువె రాజ్యభారమున్
నరవర యంచుఁ బల్కుమునినాథుని జూచి ముదంబు నొందుచున్. 10

ఉ. కౌరవనాథుఁ డిట్లనియెఁ గారుణితో తమ విన్నవింతు నీ
ధారుణిరాజ్యమంతయును ధర్మపథంబునఁ బ్రోతు నెప్పుడున్
కూరిమి నాపయి న్నిలిపి గొబ్బున మీ రిట కేగుదెంచుచోఁ
బారుఁడ నాగృహంబు బహుపావన మయ్యె నటంచు వెండియున్. 11

ఉ. ఊరక రారు మీ రిటకు నుల్లమునం గలకోర్కెఁ దెల్పవే
నారద యంచుఁ బల్కునరనాథుని జూచి మునీంద్రుఁ డిట్లనున్
ద్వారకనుండి నే నిటకుఁ దర్లితి నీ కొకవార్తఁ దెల్పఁగాఁ
గౌరవనాథ నాపలుకు కాదన కాపని సేయు మింతలోన్. 12

వ. అది యెయ్యదియనిన. 13

క. బలరాముపుత్రి గల దా, జలజాక్షికిఁ గల్గినట్టి చక్కఁదనం బీ
జలజభవాండములోపలఁ, గలరమణులయందు లేదు కౌరవనాథా. 14

ఉ. ఆచెలికొప్పును న్మఱియు నాచెలి మోమును దానిచూపులున్
ఆచెలిదంతపంక్తియును నాచెలినవ్వులు దానికంఠమున్
ఆచెలిబాహులు న్నురము నాచెలిచన్నులు దానిచిన్నెలున్
ఆచెలిమధ్యముం గటియు నాచెలియూరులు జంఘలాదిగాన్. 15

క. అంగములను వీక్షించిన, శృంగారమె గాని దానిజిగి యేమందున్
బంగారువంటిదేహము, సింగారముఁ బొగడ వేయుశిరములు గలవే. 16

క. శశిరేఖాఖ్యం జెలఁగెడు, శశిముఖి నీకోఁడ లైన సంపదలెల్లన్
పసిఁడికి బరిమళ మబ్బిన, దశ నమ్మతి కెక్కఁ గలవు ధరణీనాథా. 17

క. భూషణ లెందుకు సిరికిన్, భూషణ మై చెలఁగ ననుచు బోధింపుచు సం
తోషమున నరిగె కల్మష, శోషణుఁ డగుపోరు దిండి సురలు నుతింపన్. 18

క. మునివరుఁ డేగినపిమ్మట, జనపతి దుశ్శాసనాదిసహజన్ములఁ దాఁ
గనుఁగొని బ్రాహ్మణు లిర్వుర, ననఘుల రప్పింపుఁ డనిన నరనిమిషములోన్. 19

వ. రప్పించిన వా రరుదెంచి రాజుం గాంచి పనియేమనిన విని సుయోధనుం డిట్ల
నియె. 20

సీ. పుడమిదైవములార పుండరీకాక్షుని పురవరంబునకు మీ రరిగి మొదట
కామపాలునకు మాక్షేమలాభముఁ దెల్పి పొసఁగ లక్ష్మణునకుఁ బుత్త్రి నడిగి
రమ్మని భక్తితో లాలించి మాంగల్యవస్తుచయంబులు వారి కొసఁగి
పనిచిన బ్రాహ్మణు ల్భాసురం బైనట్టి ద్వారకాపురిఁ జొచ్చి శీరపాణి
తే. మందిరద్వారపాలుర ముందుఁ బనిచి, సెలవుఁ గైకొని విప్రులు గలసి యతని
వలన నర్చితులై తాము వచ్చుకార్య, సరణి వినుపింప సంతోషభరితుఁ డగుచు. 21

క. చెల్లెలి కొసఁగినవాక్యము, నుల్లంబునఁ దలఁప కతఁడు నుల్లాసముతో
సల్లలితుం డగుకౌరవ, వల్లభుఁ డటు పంపియున్నవసుధామరులన్. 22

క. కనుఁగొని బలుఁ డిట్లనియె, న్మనుజేంద్రునికార్యమునకు మాఱు వచింపన్
బని యేమి నాదుపుత్త్రికి, ఘనుఁ డాలక్ష్మణుఁడె మగఁడు గా కొరుఁ దగునే. 23

క అల దుర్యోధనసుతునకు, లలనామణి నొసఁగి వేడ్క లగ్న మొనర్తున్
ఇలలో శీఘ్రమె శుభ మని, పలుకుదు రిఁక జాగుసేయఁ బని యేమనుచున్. 24

క. మతిమంతులైనవారో, హితులను బిలిపించి చాల నీశశిముఖికిన్
బతి దుర్యోధనసుతునకుఁ, జతురమతిం జూడరయ్య శశితారాదుల్. 25

వ. అని పల్కినతాలాంకుని వాక్యప్రకారంబునఁ బౌరోహితు లాలోచించి చంద్ర
తారాబలంబులు నిరూపించుచు నేఁటి కెనిమిదివాసరంబులకు లగ్నం బనిచెప్పిన
విని నీలాంబరుండు పురపరిపాలకులం బిలిపించి వీడెల్ల శృంగారంబు సేయుఁ డని
తా నాజ్ఞాపించిన మంచి దని పురం బలంకారంబు సేయించి శశిరేఖకుఁ బరిణ
యం బని సాటించి రాసమయంబున. 26

సీ. రాముఁడు తనపుత్త్రి కౌరవసుతునకు మాట యిచ్చె నటంచు బోటులెల్లఁ
జెప్ప సుభద్ర తా నప్పుడె దిగులొంది చని పద్మనాభునిచరణములకుఁ
బ్రణతయై వింటివే బలరాముచిధమెల్ల రమణి యా శశిరేఖ లక్ష్మణునకు
నిచ్చెద నని చెప్పె నిదియేమి మాధవ దత్తాపహారంబు తగునె తనకు

తే. ననిన విని లేచి కృష్ణుఁడు ననుఁ జూచి
వెంట రమ్మని బలరాముఁ విడిది కేఁగి
హితులఁ బౌరోహితులఁ గూడి యింపుగులుక
మాటలాడెడుహలిఁ జూచి మాధవుండు. 27

శా. అన్నా నీ కిది ధర్మమౌనె వినుమా యబ్జాక్షి యాపుత్త్రిని
న్నన్నీ చెల్లెలిపట్టి కిత్తు ననుచున్ మోదంబుతోఁ జెప్పఁగా
విన్నా రందఱు దీనిఁ దప్ప మనల న్వైత్పన్ను లంచాడ రీ
సన్నాహంబును మాని పార్థికి వెసన్ జంద్రాస్య నర్పింపవే. 28

క. మేనల్లుఁ డుండ నొరులకు, మానిని నీరా దటంచు మహిమాధిపులున్
దాన మఱొక్కరి కొసఁగుట, మానితగుణధన్య ! నీకు మర్యాదగునే. 29

వ. అని యివ్విధంబున. 30

తే. మాధవుఁడు పల్కువాక్యము లొప్పదపడక, కామపాలుఁడు హరిఁజూచి కమలనాథ
పాండవులయందు మిక్కిలిపక్షపాతి, కౌరవులపేరు సెప్పఁగాఁ గాదు నీకు. 31

తే. కాంచనాంబర విను పెక్కు గాథ లేల, నరునిపుత్త్రున కే నీను తిరముగాను
పాండవులు మనకు నత్యంతబంధులైన, గౌరవులు నట్టిచుట్టాలు గారె తలఁప. 32

తే. పంచభక్ష్యాన్నములు మాని పద్మనేత్ర, కుమతు లెవరైనఁ గసుగాయఁ గోరఁగలరె
రాజ్యవైభవమున నుండు రాజరాజు, సుతున కగుఁగాక అర్జునసుతున కేల 33

క. అని పల్కిన బలరామునిఁ, గనుఁగొని కను లెఱ్ఱఁజేసి కలితమదితో
వనజదళాక్షుం డిట్లను, వినఁ జవిగానట్టిపల్కు విహితమె పలుకన్. 34

తే. కుంతితనయునిపై నీకుఁ గోప మున్న, సుదతి నీకిష్టమైనట్టివానికిమ్ము
కవ్వడియు భీముఁ డిర్వురుఁ గదిసినపుడుఁ, గౌరవులు నీవుఁబను పాటుఁ గందుగాక.

వ. ఇవ్విధంబునఁ గృష్ణుండు రోహిణీతనయుని హేతుగర్భంబుగాఁ బలికి నిజసహోదరిం
జూచి సుభద్రా తాలాంకుఁడు పలికినపల్కుల స్వారస్యంబు తెలిసెఁగదా నీకు ది
క్కుగలచోటి కరుగుమని డిగ్గన లేచి రథాంగపాణి తనమందిరంబున కేఁగె; నాస
మయంబున. 36

సీ. తరుణి సుభద్ర యాతాళాంకు నీక్షించి అన్న నావిన్నపం బాలకింపు
వేడ్క నీతోఁ జాల వియ్య మొందెద నంచు నెమ్మదిలో నేను నమ్మియుంటిఁ
బలిబావమఱఁదులు ఫలము లన్నముగాఁగ వనవిహారము సల్ప వారిఁ దలఁచి
చింతించుచామది చింతలెల్లను బాసి మీమన్ననలచేత మెలఁగుచుండు
తే. మగువ నిచ్చెద నని చెప్పి మఱచి నేఁడు, పరుల కిచ్చెద నని పల్క భవ్య మగునె
సిరియుఁ లేమియుఁ వెన్నెల చీఁకటులయ, నీరసాధన కరుణించి చూడ నిమ్ము. 37

ప. అది యట్లుండఁగాక. 38

ఉ. అన్నలుఁ దమ్ములుం జెలు లనాదరణంబుగ జేయుచుండిన
న్విన్న నవంబు జెందు టొకవింతయె మీ రిపు డాదరింపకన్
నన్ను నవజ్ఞ చేసినను నాకు నగౌరవ మత్తయింటిలో
సన్నుతిపాత్ర నీకిపుడు సాగిలి మ్రొక్కెద నాదరింపవే. 39

క. బలవైరిపుత్త్రుఁ డాత్మలో, పలుమరు నీవియ్యమునకుఁ బ్రార్థన సేయన్
గలకాల మిదియె కోరికి, సలలితముగఁ బ్రోవుమయ్య సద్గుణవర్యా. 40

ప. అని మఱియు నిట్లనియె. 41

క. వనములఁ ద్రిమ్మరుచుండిన, జనకుల నెడబాసినట్టి సౌభద్రునకున్
వనజాక్షి నొసఁగకుండిన, జనసుత యపకీర్తి గాదె చయ్యన మీకున్. 42

క. అన్నా బలరాముఁడ నీ, కన్నను గతి లేదు మాకుఁ గనుకను మగువన్
విన్నాణంబగుపార్థికిఁ, జెన్నలరఁగఁ బెండ్లిసేసి చెలఁగుము తండ్రీ. 43

క. సిరి గలవారికిఁ జేడెల, నరయుచు నెవరైన నిత్తు రది ఘన మగునే
నిరుపేద కిచ్చి చేసిన, సరసాగ్రణి కిహముఁ బరము సౌఖ్యము లబ్బున్. 44

తే. పద్మలోచన శశిరేఖ భాసురాంగి, బాలుఁ డభిమన్యుసొమ్మని పలికి తీవు
మాధవాగ్రజ నమ్మించి మ్రానిమీఁద, చేయివిడిపించుచందానఁ జేసి తన్న. 45

ప. అని బహుభంగులఁ బ్రార్థించుసహోదరిం జూచి హలాయుధుం డిట్లనియె. 46

క. నవ్వుల కాడినమాటలు, జవ్వని నిశ్చయము సేయుఁ జనునే నీకున్
బువ్వకు లేకిటుచిక్కియు, నవ్వా పెత్తనము సేయ నగునే నీకున్. 47

తే. పాలు చక్కెర జున్నుతో నోలలాడు, సతుల వేపాకుఁ దినిపించు చందమునను
గారవంబునఁ బెరిగినకమలముఖిని, నీకుమారున కనుగుట నీతి యగునె. 48

క. కూడను గోకయుం లేకన్, చేడియ నీసుతుఁడు నీవుఁ జేరితి రిటకున్
సూడు నొకించుక లేకన్, కోడలు కావలయు నంచుఁ గోరెద వీవున్. 49

క. కోడలు లేకుండిన నీ, పోఁడిమి సంపదలు కొల్లపోయెడి నేమో
నేఁడు వచించెద విను మా, చేఁడియ నీసుతున కొసఁగుచెముగులు గలరే. 50

సీ. ఉన్నవా రడవుల ఖిన్నులై యుండఁగాఁ గన్నియ నిమ్మంచుఁ గలువరించి
పలికిన ఫలమేమి భాగ్యహీనుల కిత్తురే మగువ నిల నెవ్వరైన
ముం దేమొనర్చినబంధుత్వములు చాలు వెలఁది నీ కెందు కీవెఱ్ఱి మాను
పరఁగ దుర్యోధనుబంధుత్వ మబ్బె మా కొరులేల నీవేల సరసిజాక్షి
తే. యేల ధర్మాత్మజుఁడు భీముఁ డేల వినుము, పార్థుఁ డెందుకు కవ లేల భాసురాంగి
ద్రుపదేయాదు లిఁక నేల తలఁచి చూడ, నెందఱుండినఁ గురురాజు క్రిందు గారె. 51

వ. అని సీరాయుధుండు సుభద్రతో వెండియు నిట్లనియె. 52

క. పడఁతీ నీనందనునకుఁ, బడఁతుక నర్పింపఁ జాలఁ బలుమరు నన్నున్
దడవినఁ గోపము మదికిం, బొడమెడు నని పల్కెఁ దోడబుట్టుతో మఱియున్.

క. కురురాజు కెందలైనను, సరిగా రీవసుధలోన సంపదలందున్
పురుహూతుఁ డెంచి చూడఁగఁ, గరిపురమే స్వర్గపురము ఘనభోగములన్. 51

క. అలదుర్యోధనసుతునకు, లలనామణి నిత్తు రాజ్యరహితుల కొసఁగన్
జలజాక్షి పెక్కు గాథల, ఫల మేమిఁక లేచిపొమ్ము పని యే మిచటన్. 55

వ. అని యివ్విధంబున. 56

ఉ. తాల్మి యొకింత లేక బహుతామసుఁడై బలుఁ డాడువాక్యముల్
గాలములై మదిం దగుల గాండివిపత్ని మఱేమి తోఁచకన్
జాలినవంతఁ గుంది వివశత్వము నొందినఁ జూచి గ్రక్కునన్
బాలిక నెత్తి వెండ్రుకలు పాపుచుఁ గొప్పిడి సేదదేర్పఁగాన్. 57

వ. ఆసమయంబున దేవకీవసుదేవు లాబలభద్రుం జూచి రామా నీసహోదరి కొసంగిన
వరంబుఁ బాలించి సౌభద్రునకుఁ గన్యాదానంబు సేయు మనినవచనంబు లనాద
రణంబు సేసి పెడచెవులం బెట్టి యూరకుండె నంత సేదఁ దేరి సుభద్ర రోషం
బున హలాయుధుం జూచి యిట్లనియె. 58

చ. తరుణి నొసంగవే యనుచుఁ దద్దయు భక్తితో వేఁడుకొన్నచోఁ
గరుణ యొకింత లేక ననుఁ గారులు జీరుచు మాటిమాటికిన్
సిరిగలవారి నెన్నుచును సింధుగభీరుల నింద సేయుచున్
బోరిఁబోరిఁ బొంగు పొంగితివి పొంగినపాపము నీకుఁ దప్పునే. 59

క. విరివిగఁ జెలి నిచ్చెద నని, మరు లించుకఁ గలుగఁ జేసి మాటలు దప్పెన్
నరునకు నరకమెగాకే, సిరి వెన్నెల చీఁక టనుచుఁ జెప్పుదు రార్యుల్. 60

తే. సింహవిక్రముఁ డగుపాండుసింహమునకుఁ, బత్నినై నేను నడవులఁ బతిని బాసి
నీవె గతి యని బ్రతిమాలి నీగృహంబు, పంచఁ జేరినఁ గద యింతపలుచనైతి. 61

తే. కడుపుకూటికి నీకొంపఁ గాచియున్న, నీతిమాలినమాటలు నీవు పలుకఁ
జెల్లెలను గాన బలరామ చెల్లెఁ గాక, పాండవులు విన్న నాయాన బ్రదుకనీరు. 62

వ. అని వెండియు నిట్లనియె. 63

సీ. కొడుకు లెన్నైరయున్నఁ గోడ లెందుకు రాదు నీపుత్త్రి నీకున్న నిలువఁబోదు
గంతకుఁదగినట్టి బొంత లోకమునందుఁ గల్పించె మొదటనే కమలభవుఁడు
నుదుట వ్రాసినవ్రాలు పదపడి తప్పింప నీవెవరు నేనెవరు నీతిరహిత
సదయాత్ముఁ డని నిన్ను మదిలోన నమ్మితి కఠినహృదయుఁ డనుచుఁ గానలైతిఁ

తే. గలిమి కాంక్షించి యనృతంబుఁ బలికి నీవుఁ, గౌరవులు నేకమై మమ్ముఁ గాన కనిపి
రామరాజ్యంబుగా మీరె రాజ్య మేలుఁ, డనుచు నేడ్చుచు నరిగె నయ్యంబుజాక్షి.

క. ఆసమయంబున సాత్యకి, రోషముతో బలునిఁ జూచి రొప్పుచుఁ బలికెన్
వాసవిసుతునకుఁ బుత్త్రిని, వాసిగ నీవియ్యకున్న వారికిఁ గొదవే. 65

క. ధర్మజభీమార్జునులను, దుర్మదమున నిందచేసి దుర్యోధను దు
ష్కర్ముని వినుతించుట నీ, కర్మమొ బలరామ లేక గర్వమొ తలఁపన్. 66

క. సమయాబ్దంబులు గడచిన, విమలాత్మకు లైన పాండవేయులు వరుసన్
సమరములోఁ గౌరవులను, సమవర్తిపురంబుఁ జేర్చి సంపద గొనుటన్. 67

క. తప్పదు సంకర్షణ నీ, కొప్పదు దూష్యంబు సేయ నుర్వీశుల వా
రెప్పుడు ధర్మపథంబును, దప్పక పాలింతు రఖిలధరణీతలమున్. 68

వ. కావున సత్యాత్ముల దూషింపుచు దుష్టాత్ముల భూషించు నీజిహ్వ పెక్కుపఱియలై పోకుండుట విచిత్రం బని పలుకుశినివరునివాక్యంబులు వినక నతనికిఁ బ్రత్యుత్తరం బీయక దుర్యోధనుం డనిపినక్ష్మాసురులతో నిట్లనియె. 69

చ. వినఁ జవిగానిపల్కు లవి వీనుల విందురె విప్రవార యా
శినివరుఁ డార్యసన్నుతుఁడు శ్రీధరుఁ డిర్వురు సారెసారెకున్
వనముల నున్న పాండవుల వర్ణన చేయుచు కౌరవేంద్రుఁ డా
మనవరతంబుఁ దిట్టుటకు నాడియు నంత్యము లేదు చూడఁగాన్. 70

మ. అలదుర్యోధనుసాటిరాజు లిలలో నందంద వీక్షించినన్
గలరా రాజమృగేంద్రునందనునకుం గంజాక్షి నర్పించెదన్
దలబ్రాల్వేళకు బంధువర్గములతో దామందఱున్ మిత్త్రులున్
బలువేగంబునఁ దోడితెం డనుచు నాబ్రాహ్మణ్యులం బంపినన్. 71

వ. తదనంతరంబ సుభద్ర హలాయుధుండు పలికినపల్కులు ములుకులై మనంబు వ్రణంబుఁగావింపం దద్వేదనచే శయ్యాతలంబుఁ జేరి చింతించుచున్నసమయంబున సూర్యాస్తమయం బగుటయుం మందిరంబునకుం జని చింతాకులచిత్తయై యున్న జననిన్ సంకర్షణుండు పల్కినచందంబును లక్ష్మణునకు శశిరేఖ నొసంగినవిధంబు నెఱుంగక మాతం జూచియిట్లనియె. 72

క. ఘనమగుచింత వహించితి, వనముల మాతండ్రి గారివార్తలు చెవికిన్
వినఁబడిన దాఁచవల దో, జననీ వినుపింపు మమ్మ చయ్యన నాకున్. 73

వ. అనిన సౌభద్రునకు సుభద్ర యిట్లనియె. 74

క. అబ్బ నే నెఱుఁగను నీ, యబ్బలజో లేల వినుము హలసాధనుఁడున్
డబ్బుల కాసవహింపుచుఁ, దబ్బిబ్బులు సేసెఁ బలుకు దత్తము నేఁడున్. 75

వ. అది యె ట్లనిన. 76

సీ. రారాజుసుతునకై రోహిణేయాత్మజ నడుగుటకై యుద్ధ అగ్రజన్ము
లరుదెంచి వేఁడఁగా నందుకు బలరాముఁ డానందభరితుఁడై మీనవేత్ర
నిచ్చెద నని మాట యిచ్చినఁ దగ దంచు నచ్యుతుం డాడిన నతనిపలుకు
వినఁ డాయె నంతలో వేఁడుకతో నేను ప్రార్థన సేయఁగా బలుఁడు నన్నుఁ
తే. గూటిపేదవు విను నీకుఁ గోడ లేల, నడవిజోగుల కరయంగఁ బడఁతు లేల
పోనఁగ దిటువంటిసుద్దులు పొమ్మటంచుఁ, బలికి వెండియు నొకకొన్ని పలికె వినుము.

తే. అవనిఁ బదివేలపాండవు లైనఁగాని, ఘనుఁడు దుర్యోధనునిసాటి గా రటంచుఁ
బలికి కురురాజు పంపినబ్రాహ్మణులను, నెట్టకేలకు వీక్షించి యిట్టులనియె. 78

వ. నేఁటి కెనిమిదివాసరంబులకు లగ్నంబు నిశ్చయం బని యుగ్గడించి క్ష్మాసురులం
బంపె నని చెప్పి మఱియును. 79

క. పెన్మేటికిఁ దనయుండ నీ, యయ్యలు వనవాసు లగుట నది మది నిడకన్
వియ్యము గలదని వచ్చిన, నెయ్యము చెడ నాడె నన్ను నీలాంబరుఁడున్. 80

మ. గ్రహచారంబును జాలనప్పు డెవరుం గార్పణ్యులై యుందు రీ
మహనీయుం డగురోహిణేయుఁ డిటుల న్మర్యాదహీనంబుగా
బహువాక్యంబుల నన్నుఁ బల్కెఁ దనయా భాగ్యంబు లేకున్నచో
విహితుల్ శత్రువు లంచుఁ బల్కుపలుకు ల్విన్నావా లేవో గదా. 81

క. కలిమి గలవారిపక్షమె, పలుకుదు రెవ రైనఁ గాని భావింపంగా
నిలలోఁ బేదలపక్షము, కలలోనం బలుక రనుచు ఘను లన విందుర్. 82

క. కావునఁ గౌరవరాజును, వేవిధముల వినుతిఁజేసి వేదిజపతినిన్
పావని మొదలగుపాండవు, లేవుర నిందించి సుదతి నీలే దనియెన్. 83

వ. అనిన విని సౌభద్రుండు కోపోద్దీపితమానసుం డగుచు కటకటంబు లదర నిటలం
బునఁ జెమటకణంబులు పొడమ నేత్రంబు లరుణంబులు గావించి పటపట పండ్లు
గీటుకొని రోమకూపంబుల ధూమంబు వ్యాపింప భ్రూయుగంబు ముడిబడంజేసి
సుభద్రం జూచి యిట్లనియె. 84

తే. జనని హాలినిన్నుఁ బల్కినచెనఁటిపల్కు, లేల చదువఁగ వినఁగ నా కింపుగాదు
కర్ణములు రెండుతూటులు గట్టె వినుము, తల్లి నావంటిసుతుఁ డుండఁ దగునె వగవ.

క. అది గాక రణగరిష్ఠుఁడు, పదిపేరులు గలిగినట్టిఫల్గునుఁ డరయన్
మదమునఁ బతి యైయుండియుఁ, బదపడి చింతింప నీకుఁ బాడియె తల్లీ. 86

చ. కుటిలకరప్రచండరిపుకోటులఁ ద్రుంచి వనాంతరంబులోఁ
బటుతరవిక్రమాఢ్యు లగుపాండవులేవురు సంతసంబుతో

దిటముగ నున్నవా రనుచు దివ్యమునీంద్రులు చెప్ప విందు నీ
కటకట లెందు కీబలుఁడు కన్నె నొసంగక యున్న మేలగున్. 87

వ. అని మఱియును. 88

చ. పడఁతి నొసంగలే దనుచుఁ బల్కినపల్కులు చెల్లుఁ గాక యా
చెనుగులఁ గౌరవాధముల సీరి నుతింపుచుఁ బాండుపుత్రులం
గడుపడి నిందసేయుటకుఁ గారణ మేమని పల్కి యల్కతో
నొడలున ఘర్మబిందువులు పుట్టఁగ నిట్లని పల్కె వెండియున్. 89

క. సదయుఁడు హరి సాత్యకియున్, ముదమొదవఁగఁ జూచుచుండ ముసలాయుధునిన్
పద నగుశరములచేతన్, మద మడఁచెద నన్నుఁ జూడు మాతా యిపుడున్. 90

క. అని ధను వొకచేఁ గైకొని, ఘనశరముల నొక్కచేత గ్రక్కునఁ గొనుచున్
దినకరతేజస్ఫురణన్, గను లెఱ్ఱఁగఁ జేసి లేచె కవ్వడిసుతుఁడున్. 91

పంచచామరము. కిరీటిసూనుఁ డట్లు లేచి కిన్కతో వచించె హా
విరోధి యాసుయోధనుండు వీరు నేకమే కదా
విరోధు లైరి యాదవు ల్వివేకహీను లందఱిన్
పరేతరాట్పురంబుఁ జేర్చి పాపుకొందుఁ గోపమున్. 92

వ. అని వెండియు. 93

క. పార్థుఁ డొసంగినవిద్య కృతార్థత నొందింపనున్న ధరణీస్థలిలో
సార్థకమే విను తల్లీ, ప్రార్థించెద సెల వొసంగు పనియే మిచటన్. 94

క. తఱియైనవేళ శత్రులఁ, బరిమార్పకయున్న ధనువుబాణము లకటా
పారిఁబోరిఁ గాల్పనె నేఁ డీ, హరి సాత్యకిఁ దప్ప నితరులందఱిఁ గూల్తున్. 95

వ. అని యివ్విధంబున. 96

క. రుద్రునివలె వెడలిన సౌభద్రుని వీక్షించి జనని భయమానసయై
భద్రగజవైరివిక్రమ, యుద్రేకము నేయ నేల నుడుగుము తండ్రీ. 97

వ. అదియునుంగాక. 98

సీ. బలుఁడు త న్నాడినపల్కులు విని పోయి కలవి లేనివి కొన్ని కారులరచి
పుత్రున కత్యంతశత్రుత్వ మెగఁబోసి చయ్యన బలునిపై కయ్యమునకుఁ
బంపె గయ్యాళని పలుకుదు రవనిలో నీయపవాదం బదేల మనకుఁ
గామపాలుఁడు నన్నుఁ గతినోక్తు లాడుట కాలవిశేషంబు గాక వినుము
తే. చిత్తజానితండ్రి యన్నపైఁ గత్తికట్టఁ, దగదు రమ్మనిపలికినఁ దల్లిపలుకు
హస్తి కంకుశమును జూపినట్లు లగుట, మరలి యిట్లనిపలికె నమ్మానధనుఁడు. 99

క. ఇప్పని నీహృదయమునకు, మెప్పొదవక యుండెనేని మీయన్నాఁడే
తప్పడుకూఁతల కోర్చుచు, నిప్పురమున నుండవమ్మ యీసును లేకన్. 100

తే. జనని మాతండ్రిగా రున్నవనికి నేను, బోదు నని లేచి వెడలినపుత్త్రుఁ జూచి
నిన్ను నెడఁబాసి క్షణమైన నిలువఁజాలఁ, దండ్రి ననుఁబాసిపో నీకు ధర్మమగునె.

క. అని మఱియు నిట్టులనియెన్, వనములలోఁ బతినిఁబాసి వగ నెడఁ దగులన్
నినుఁ జూచి వగవ కుండుదు, ననుఁ దోడ్కొనిపో కుమార నగసమధీరా. 102

వ. అనిన విని సౌభద్రుండు సుభద్రాగమనంబున కొడంబడి జనంబులు నిద్రింప నర్ధరా
త్రంబునఁ దల్లిం దోడ్కొని ధనుర్బాణపాణి యై వెడలి మహారణ్యంబుఁ జొచ్చి
గిరిగహ్వరంబు లాలోకింపుచు నరుగుసమయంబున. 103

క. జననాథాగ్రణి వినుమా, ఘనవేణి సుభద్ర రోషగతి యేమందున్
వనభూమి నరుగువేళన్, దనతల్లిని దండ్రినైనఁ దలఁపదు మదిలోన్. 104

సీ. కలకలధ్వను లిచ్చె ఖగసమూహంబులు చక్రవాకంబులు సంతసించెఁ
దమము దిక్కుల కేఁగెఁ దమ్ములు వికసించెఁ దొలికొండశిఖరిపైఁ దోఁచె రవియు
నభిమన్యుఁ డావేళ నతిరమణీయమౌ కమలాకరముఁ జేరి కాలవిధులు
సల్పినతరువాత సంకర్షణుం డాడువాక్యము ల్పలుమారు వగచి వగచి
తే. విల్లు శరములు తోడుగా విపినభూమి, జననిఁ దోడ్కొనిపోవుచు జనకు లున్న
వనము దెలియక ఘోరకాననముఁ జొచ్చి, పొదల దూరుచు భయదమానదులు కడచి.

ఉ. రెండుదినంబు లీవగిది రేయిపగల్లను బోయినంతలోఁ
గొండొకసేపు నిల్చి మృగకుంజరగర్జన లాలకించి కో
దండము నెక్కువెట్టి తనతల్లినిఁ దోడ్కొని ధీరవృత్తితో
వెండియుఁ నేఁగె నాఘనునివీరపరాక్రమ మేమి చెప్పుదున్. 106

వ. ఇవ్విధంబునం జని చని మూఁడవనాఁటిసాయంకాలమునకు ఘటోత్కచువనంబు
జేరం జనిరి. ఆవనంబునం దౌదుంబరవటాశ్వత్థజంబూజంబీరనారికేళకదళీఖర్జూర
మాకందపున్నాగకదంబచాంపేయ కురంటకపనసరసాలాదిభూజంబులును, శరభ
సింహశార్దూల చమరీ భల్లూకమదేభవృకఖడ్గజంబుక మార్జాలాదిమృగంబులును, గల
హంసమయూరశారికాకీరక్రౌంచచక్రవాకకపోతకాకోలూకభరద్వాజటిట్టిభాది
పక్షిసమూహంబులుం గల కాననంబుఁ బ్రవేశించి రాసమయంబున సుభద్ర
సౌభద్రుంజూచి "తండ్రీ మార్గాయాసంబున దాహం బొదవె శిలాకంటకంబులు
దాఁకి చరణంబులు దెమలింప రా దయ్యెఁ గావున గొంతసేపు నిద్రించెద ననిన
జననిం జూచి సౌభద్రుండు చింతింపుచు సమీపంబున నున్నజలంబుల దాహంబుఁ
బాపి సికతాతలంబున నిద్రింపం జేసి తనమనంబున నిట్లని వితర్కించె. 107

క. కురుకులవార్ధిసుధాకరుఁ, డరిగజకంఠీరవునకు నాత్మజుఁ డగుచున్
వారికి న్నేనల్లుఁడ నై, సిరికి న్వ్రేలి నుండఁ జేయఁ జెల్లునె విధికిన్. 108

క. సుదతి హలాయుధపుత్త్రిని, ముద మొదవఁగఁ బెండ్లియాడి మురిసెద ననుచున్
మది నే నొకటి దలంచినఁ, దుద దైవం బొకటి తలఁప దుర్దశగాదే. 109

క. విరివింటివానికేళికిఁ, బరిపరిమార్గముల నేను బ్రార్థించినచోఁ
ద్వరపడవల దని చెప్పిన, యురుకుచఁ బెండ్లాడుభాగ్య మున్నదొ లేదో. 110

వ. కావున. 111

క. సతి నన్నొకటిగఁ జేసె, హితు లెవ రున్నా రటంచు నెంచుచు మరలన్
మతి నేఁ గోరినకోరిక, గతజలబంధనముగాక కాఁగలపనియే. 112

సీ. అనుచు వెండియు నతఁ డాత్మలో నిట్లను బలరాముఁ డాడినభాషణములు
తల్లిచే విని చాల తామసంబున నేను జననిఁ దోడ్కొని ఘోరవనముఁ జొరఁగ
బహుళమార్గాయాసభరమున రాలేక నిచ్చట శయనించె నింక రేపు
నెటువలె నడుచు నేనేమి సేయుదుఁ బాండుతనయులు విహరించువన మెఱుంగ
తే. నని తలంచుచు మరల ధైర్యంబుఁ బెంచి, తల్లి రక్షించుకొఱకునై ధనువుఁ బట్టి
గుణము దీర్చినఁ దద్ధ్వని కొండగుహలఁ, బదులుధ్వను లిచ్చెఁ బక్షులు చెదరఁబఱచె.

క. ఆరవము విని ఘటోత్కచుఁ, డీరసమున వినియు లేని యీవనసీమం
జేరినవిలుకాఁ డెంతటి, శూరుఁడొ చని వాని నేను జూచెద ననుచున్. 114

వ. అని మఱియును. 115

క. సురయక్షసిద్ధసాధ్యులు, చొరఁ జాలరు నావనంబుఁ జొచ్చినమీఁదన్
మరణము సిద్ధం బనుచున్, శరములు చాపంబుఁ దాల్చి చయ్యన వెడలెన్. 116

వ. ఆసమయంబున. 117

క. పదఘట్టనమున వరుసన్, పెదపెదభూజంబు లన్ని బెట్టుగ ధరపై
నదరుచుఁ బడుగుం బేకఁగఁ, దుదమొద లని తోఁపనీక దొడఁగెను దఱుచై. 118

వ. ఇవ్విధంబునం జని. 119

చ. చటులతరోగ్రరోషమునఁ జక్షుల నిప్పులు కుప్పలై పడన్
మటమట మండుపావకునిమాడ్కి ముఖద్యుతు లుప్పతిల్లఁగా
నిట మగుదంతఘట్టనకు దిగ్గజయూథము బెగ్గడిల్లఁ దా
నటునిటుఁ జూచుచుం జనఁగ నర్జునసూనుఁడు చూచి యాత్మలోన్. 120

ఉ. కాటుకకొండకైవడినిఁ గాంతులు గ్రక్కెడు వీనిదేహముం
దూఁటులు గట్టఁగాఁ గఱకుతూఁపుల నేసెద నంచుఁ గార్ముకం

చేటుకుఁ బాటుగా గుణము నెక్కిడి యోచన సేసి బుద్ధికిన్
దీటగు బాణము ల్దొడిగి ధీరత నుండఁగ నంతలోపలన్. 121

సీ. హైడింబుఁ డత్యుగ్రయాగ్రహంబున వచ్చి యర్జునసుతుఁ జూచి యోష్ఠుఁ గరచి
యెవ్వఁడురా నీవు యివ్వనభూమికి నర్ధరాత్రంబున నరుగుదెంచు
టరయ దైవంబు నా కాహారమునకు నై తిన్నగాఁ బంపిన ట్లున్న దిపుడు
కోమరొప్ప వంటయి లుక్కుందేలు సొచ్చిన చందమాయె నటంచు మందలించి
తే. సింహ మవలీల నిద్రింపఁ జేరి గోలఁ, గొట్టువిధమునఁ గోపంబు పుట్టె వాడు
బారిఁ జొచ్చితివిఁక నీవు బ్రతుకఁగలవె, మిడుకమిడుకంగ మ్రింగెదఁ గసాపునిండ.

క. కయ్యము సేయక మానవుఁ, డియ్యెడకు న్వచ్చి మరల నేఁగం గలఁడే
వెయ్యేల నాదుశరములు, చయ్యన భక్షించు నని సౌభద్రుండున్. 123

తే. పటలు పెటిలినసింగంబుచందమునను, గనుబొమలురెండు నుదుటిపైఁగంటువడఁగఁ
బుచ్ఛమును ద్రొక్క భుజగంబుఁబోలెనుండి, చురుకుచూపుల హైడింబుఁ జూచి పలికె.

సీ. రాక్షసాధమ నన్ను భక్షింతు నని పల్కు జల్లికూఁతలు మాని విల్లుఁబూని
కయ్య మొనర్పు నీదయ్యంబు మాన్పెద నని పల్కె వెండియు నతనిఁ జూచి
భద్రగజం బెంత పంచాననం బెంత వరపర్వతం బెంత వజ్ర మెంత
గొప్ప కొంచెము లెన్నకొనసేల నిను మ్రింగుశరములు గణింపఁ జాలఁ గలవు
తే. కాలయాపన మిఁక నేల కయ్య మొసఁగు, మనిన హైడింబుఁ డుగ్రుఁడై యోష్ఠుఁ గరచి
చాప మెక్కిడి పొదినున్న శరము లంది, దాఁకె నభిమన్యుపై యాతుధానుఁ డపుడు.

వ. అని చెప్పి వైశంపాయనుండు వెండియు నిట్లనియె. 126

ఉ. అద్దమరేయి వాఁడరుపు రన్నయుఁ దమ్ముఁ డటంచుఁ దోఁచకన్
దద్దయుఁ గోపము న్బొడమఁ దార్కొని విక్రమ మొక్కతీరుగాఁ
బెద్దయుఁ బ్రొద్దు పోరుసెడ భీమతనూజుఁడు పార్థపుత్త్రుతో
నద్దిర నీపరాక్రమము నద్భుత మంచుఁ దలంచి చాపమున్. 127

క. దీటుచుఁ గడువేగంబుల, మూఁడును మఱి నాల్గు నైదు ముప్పదిరెండున్
వాఁడిశరంబుల నేసిన, వాఁ డొకబాణంబుఁ బఱపి వడిఁ ద్రుంచుటయున్. 128

క. దాన నోర్పం బొదవఁగ, దానవుఁ డభిమన్యుమీఁద దశమార్గణముఁ
త్తేనం దూరఁగ నేసిన, దానవుపై నేసె నతఁడు దశవిశిఖములన్. 129

వ. ఇ ట్లేసిన. 130

క. వడముడిసూనుఁడు కన్బొమ, ముడివడఁగోపంబు మదిని ముప్పిరిగొనఁగా
నెడనెడ సౌభద్రునిపైఁ, గడుపడిఁ బదియాఱునూరుకాండము లేసెన్. 131

సీ. విజయతనూజుండు వింశతిదశకంబు దానవేశ్వరునిపైఁ దగుల నేసె
భీమునిపుత్త్రుఁ డాభీభత్సుసూనుపై నారాశుగంబులు నాల్గు చొనిపె
సౌభద్రుఁ డంతలో సప్తాంబకంబులు బకవైరిసుతునిపైఁ బఱపె నపుడు
నరభోజనుం డాలునారాచముల నేసె నని త్రుంచి సౌభద్రుఁ డతనిధనువుఁ
తే. దునిమి వెండియుఁ బదియాఱు తూపులేయఁ, గినిసి రాక్షసుఁ డింకొక్క ధనువుఁ దాల్చి
పదియుఁ నేఁబదివిశిఖముల్ పార్థసుతుని, వక్షమునఁ గలఁగ నేసిన వాఁడు గినిసి, 13

తే. భుజగనారాచములు రెండు భుజయుగంబుఁ, దగుల నేసిన నభిమన్యుధనువు ద్రెడి
నారి వదలించి పదిరెండునారసములఁ, బార్థతనయుని ఫాలంబుఁ బరగ నేసె. 13

వ. ఇట్లేసిన 13

క. కన్నులు కెంపొదవఁగ నై, కన్నులదొరపౌత్త్రుఁ డదరి ఘనకార్ముకమున్
మిన్నగ నెక్కిడి గుణమునఁ, బన్నగశర మొకటిఁ గూర్చి పటుకోపముతోన్. 13

వ. ఘటోత్కచుం జూచి యిట్లనియె. 13

క. అమరారి యీశరంబున, సమరావని నిన్నుఁ గూల్చి శౌర్యం బమరన్
అమరులు ప్రస్తుతి సేయఁగ, సమవర్తిపురంబుఁ జేర్చి చనియెద ననుచున్. 13

క. ఉరగాస్త్రం బేసినఁ గని, సురవైరియుఁ బరకుఁగొనక శూరత్వముతోఁ
దిరముగఁ బొదిలో నుంచిన, గరుడాస్త్రముచేత దాని గ్రక్కునఁ దునిమెన్. 13

తే. దునిమి సౌభద్రు నీక్షించి దనుజవిభుఁడు, మానవాధమ యింక నీవు మనఁగలేవు
యాతుధానాస్త్రమున నిన్ను యమపురంబుఁ, జేర్తునని వింటఁ శరమిడి చెప్పె మఱియుఁ

క. బాలుఁడ నాతోఁ బోరఁగఁ, జాలవు నీ కేల సమరసాహసవిధముల్
గాలునిదండముతో సరి, పోలిన యీశరముతోన బొలిసెద వనుచున్. 14

క. ఏసినఁ గని వేగంబున, భాసిత మగు వైష్ణవాఖ్యబాణముతో న
య్యాసురవిశిఖముఁ దుండ్లుగ, వాసవిసుతుఁ డేసె నమరవరులు నుతింపన్. 14

వ. ఆసమయంబున. 14

క. ఇరువురిపోరుఁ గనుంగొనఁ, గరి కరి గిరి గిరియుఁ గంధి గంధియుఁ బోలెన్
సురవరుల కనిమిషత్వం, బరయఁగ సార్థక్య మయ్యె హాస్తిపురీశా. 14

వ. ఇవ్విధంబున సుభద్రకుమారుం డగు సౌభద్రుండును హిడింబీతనూజుం డగు హైడింబుండును బోరునెడ నిరువురశరీరంబులఁ దొరఁగు రుధిరంబు మడుగులు గట్టి ప్రవాహంబులు పాఱె నప్పుడు దివినున్న దేవసమూహంబులు కుసుమవర్షంబులు గురిపించి రాసమయంబున శతానందసూనుం డగు నారదుండు సరిగమపదంబుల నాట్యంబు సేసె నపుడు వారిరువురిశస్త్రాస్త్రద్యుతు లంధకారంబు నణంచి దివసంబుగాఁ దోఁపించె నాసమయంబున. 14

ఉ. ఇద్దఱికార్ముకధ్వనికి నింద్రతనూజునిరాణి దిగ్గునన్
నిద్దుర లేచి చూచి తననెమ్మది నిట్లని యెంచె నౌర నా
ముద్దులపట్టిపై ధనువు మోపిడి రాక్షసుఁ డుగ్రమూర్తియై
తద్దయుఁ బోరఁ జొచ్చెనిది తప్పను పాయము నేమిసేయుదున్. 145

సీ. మాధవాగ్రజుఁ డాడుమాటల కలిగి నే నిట వచ్చుటను గదా యింతపుట్టెఁ
దామసం బెవరికిఁ దగ దంచుఁ బెద్దలు చెప్పెడువాక్యముల్ సిద్ధమయ్యె
వాలిపుత్త్రి నాపట్టి కర్పింతు నన నేల నిభపురేంద్రునిపట్టి కివ్వ నేల
పలుమారు నతని నేఁ బ్రార్థింపఁగా నేల నందుకుఁ బలుమాట లాడ నేల
తే. చేరి సౌభద్రుతో నేను జెప్ప నేల, వీఁడు ననుఁ బిల్చుకొని రాత్రి వెడల నేల
ఘోరవనమున నీబాధ నంద నేల, నెట్టు లున్నదో తలఁపఁగా నీశ్వరాజ్ఞ. 146

వ. అని మఱియును. 147

క. కొఱమాలినరక్కసుతోఁ, దురమునఁ బోరాడఁ గలఁడె దురితాటవిలోఁ
నరయఁగ నెవ్వరు లేరీ, సురవైరిని సంహరించి సుతు రక్షింపన్. 148

క. పాపాత్మునిశరముల నా,పాపఁడు మృతి నొందకుండ భయదాటవులన్
గాపాడువార లెవ్వరు, కాపాలియతక్క దిక్కు గలరే మాకున్. 149

వ. ఇట్లు సుభద్ర చింతించుచున్నసమయంబున హిడింబియుం జనుదెంచి వారిరువురు గయ్యంబు సేయం జూచి తనమనంబున నిట్లను శస్త్రాస్త్రవిద్యాధురీణుం డగు రాకుమారునితోఁ నాకుమారునకుఁ గయ్యంబు సేయుసామర్థ్యంబు గలదే యని వితర్కించుచుండె నప్పుడు. 150

సీ. హైడింబుఁ డనలాస్త్ర మడరింప సౌభద్రుఁ డైంద్రబాణంబున నదియుఁ ద్రుంచెఁ
గుంతిమధ్యమపుత్త్రుకొడుకు యామ్యాస్త్రంబుఁ బరపిన వీక్షించి పార్థసుతుఁడు
పర్జన్యశరమున భస్మంబు గావించి తొమ్మిదివిశిఖముల్ ఱొమ్ముఁ దూర
నాటినఁ గోపించి నరభోజనుం డాఱు విశిఖంబు లేసిన విజయసుతుఁడుఁ
తే. గనలి వింశతిశరముల దనుజు నేసె, మరల రాక్షసుఁ డొకనూఱుమార్గణములు
తనువుఁజొర నేయఁ బార్థునితనయుఁ డాఱు, నూఱుశరములదనుజుమైఁ దూర నేసె.

క. ఖండనమున వారిరువురు, నొండొరుల జయింపలేక నొకరీతిగ వే
దండారియుగముపోలిక, దండధరద్వయముమాడ్కి దర్పోజ్జ్వలులై. 152

వ. పలలంబునకై పెనఁగుసాళువంబుల తెఱంగున బెబ్బులులపగిదిం బోరిపోరి హైడింబుం డబ్జభవాస్త్రంబుఁ దొడిగినం జూచి సౌభద్రుఁడు నదియె సంధించె నాసమయంబునఁ గులాచలంబులు చలించె రవిచంద్రులు మార్గంబులు దప్పి రమరులు

భయాకులితచిత్తులై రపుడుఁ ద్రికాలవేది యగు వేదవ్యాసుం డరుగుదెంచి పురమధ్యంబున నిలిచి యిట్లనియె.

సీ. ఓభీమనందన యోఫల్గునాత్మజ యిట్టిసాహసకృత్య మేల మీకుఁ
తెలియక కయ్యంబు సలిపితి రిరువురు నన్నదమ్ము లటంచు నతఁడు దెలిపి
వారిమాతలఁ గాంచి మీ రిరువురుఁ దోడి కోడండ్రు గాదుకులఁ జూడ
నని చెప్పి మునీంద్రుఁ డాసుభద్రాదుల నీక్షించి వెండియు నిట్టులనియె

తే. మీకు నిఁక మీఁద నాపద లేక పరమ, సుఖము చేకూఱుఁ బతులకు శుభః
గమలనాభుండు ప్రాపు గాఁగలఁ డటంచుఁ, దెలిపి మునీంద్రుఁ డుత్తరదిశ

క. మునివరుఁ డేగినపిమ్మట, దనుజుఁడు నభిమన్యుఁ జూచి తమ్ముఁడ ని న్నే
నని రానిమాట లాడితిఁ, గనలకు మని కౌఁగలించి కన్నీ రిడుచున్.

క. తనువున రక్తం బెడలఁగ, సునిశితబాణంబు లేసి స్రుక్కించితి నే
ననుజా యీవిధ మంతయుం, మనజనకులు విన్న నన్ను మన్నించెదరే.

క. సిరిఁ బాసి విపినభూముల, కరుదెంచినమీవిధంబు నడుగక వత్సా
కరుణను రమ్మని పిలువక, దుర మొనరింపంగ నెంతదురితాత్ముఁడనో.

క. తమ్ముఁడ నాశరములు నీ, ఱొమ్మున నాటించినపుడు రుధిరాంగముతో
సొమ్మసిలి నేల వ్రాలిన, నిమ్మహి నాజన్మ మరయ నెందుకు దండ్రీ!

వ. అని యివ్విధంబున ఘటోత్కచుం డభిమన్యుం గౌఁగలించుకొని చింతిం
బున హిడింబి సుభద్రం జూచి చెల్లెలా నీ వేలచింతించెద వని యూరార్చి
నిట్లను భగవంతుఁ డొనరించుకార్యంబునకుఁ బ్రతిసేయం గలరే? పర
డెరింగింపకుండెనేని మీరిరువురు గయ్యంబున సమయుందు రమ్మహాముని
బున జీవించితి రదియునుం గాక నాసుతుఁ డొనరించినదుష్కార్యంబు తః
పల్కుపల్కి లాలించి ఘటోత్కచుండు సుభద్రపాదంబులపై వ్రాలి యి

క. జననీ! చిరకాలమునకుఁ, జనుదెంచినమిమ్ముఁ, జూచి సంతోషముతో
ననుజుని లాలనసేయక, తనువున విశిఖంబు లేయఁ దప్పని మఱియున్.

క. ఎఱుఁగక చేసిన కార్యము, మఱిమఱి మది నుంచవలదు మాతా నన్నుం
గరుణించి బ్రోవవే యని, కరములు ముకుళించి మ్రొక్కె గాండివిసలికి!

వ. ఇట్లు మ్రొక్కినఘటోత్కచుం జూచి సుభద్ర యిట్లనియె.

క. అన్నా! నీ వీలాగున, ఖిన్నుఁడవై దీనవృత్తిఁ గేడ్వఁదనేలా
ము న్నెఱుఁగని మోసంబున, నిన్నియు సమకూడె మనకు నీవనభూమిన్

క. బలియుఁడ నీ విట నుండుట, తెలియదు మా కించుకైనఁ దేకువచెడి
ఫలనట నిట కేతెంచుట, నలఘుమతీ నీవెఱుంగ వది యట్లుండెన్.

అన్నయుఁ దమ్ముఁ డీపగిది నాహవరంగమునందుఁ బోరుటల్
సన్నుతపాత్రుఁ డై పరఁగు స్వామికృతం బని చెప్పవచ్చు లే
కున్న దయావిశాలురకు నుగ్రపుకృత్యము లేల గల్గు నో
చిన్నికుమార యింకొకటి సెప్పెదఁ జేకొని యాదరింపవే. 165

నీ పీలాగున వగచుట, పావనిసుత నిన్నుఁ జూచి పార్థాత్మజుఁడు
స్త్రీవలె వగచుచు నున్నాఁ, డీవిధమునఁ జింతసేయ నెందుకు వత్సా! 166

యటివరుఁ డన్నదమ్ములని యెంతయు వేడ్కతొ వచ్చి చెప్పఁగా
బ్రతికితి రింత చాలు గ్రహబాధవిశేషము లింత జేసెఁ గా
కితరము లేదు భీమసుత యింకఁ బదంపడి చింత సేయఁగా
గతజలసేతుబంధనము గాదె మదిం దలపోసి చూడఁగన్. 167

ఇవ్విధమునఁ బల్కిన యా, శవ్వడిసతివాక్యములకుఁ గడుమోదముతో
నవ్వుచు భీమతనూజుఁడు, పువ్విలుతుని బోలు పార్థపుత్రుని వేడ్కన్. 168

తే. కౌఁగిటను జేర్చి సంతోషకలితుఁ డగుచు, విశద మైనట్టి శశిశిలావేదియందుఁ
దల్లులును దాను గూర్చుండి యుల్లమలర, నూరుపులయందుఁ దమ్ముని నుంచుకొనియె.

సీ. ఇవ్విధంబున నుండి శవ్వడిపల్కితోఁ బలికె హైడింబుండు పరమభక్తిఁ
గరములు ముకుళించి ఘనులు మజ్జనకులు వనవాసు లైనట్టివార్త దెలిసి
హరి మిమ్ము ద్వారకాపురికిఁ దోడ్కొనిపోవఁ బోయితి రిప్పు డీపుత్రుతోడ
నర్ధరాత్రంబున నరుదెంచుటకు నేమి హేతువు దెల్పవే మాత యనిన
తే. దనుజు నీక్షించి పార్థునిదార పలికె, వినుము చెప్పెద దనుజేంద్ర విశదముగను
పాండవులయొద్ద మే మున్నఁ బద్మనాభుఁ, డచటి కేతెంచి ధర్మజు నతఁడు గాంచి.

వ. కుశలసమాచారంబు లడిగి షణ్మిర్త్వరం దోడ్కొనిపోయి ద్వారకానగరంబునకుం జని
సుఖంబున్నసమయంబున. 171

సీ. నీలాంబరునిపుత్రి నెలరేక యనుకన్య నభిమన్యునకు నిత్తు ననుచుఁ బలుక
నాఁడాదిగా మేము నమ్మి ద్వారక నుంటి మంతలోఁ గురువిభుం డవనిసురులఁ
బంప వారలు వేడ్కఁ బరతెంచి హలిఁ గాంచి రారాజుపుత్రుఁ డౌ లక్ష్మణునకుఁ
దనపుత్రి నడిగినఁ దద్బ్రాహ్మణులఁ జూచి బలరాముఁ డానందభరితుఁ డగుచుఁ
తే. బలికె నేఁటికి నెనిమిదివాసరములఁ, దశమిలగ్నంబు గల దింకఁ దడవు వలదు
తద్దినం బని పల్కుచుఁ దక్షణంబ, పరిణయంబును బ్రకటింపఁ బనిచె భటుల. 172

వ. ఇవ్విధంబునఁ బనిచిన వా రేఁగి శశిరేఖాపరిణయోత్సవంబుఁ బురంబునఁ జాటించి
రాసమయంబున. 173

క. జలజాక్షుఁ డరిగి హలితోఁ, బల దని వాదింప సతనివాక్యము వినకన్

బలరాముఁ డనియెఁ గృష్ణ!, తలఁపఁగ నీ తెరఁగు పాండుతనయులయందున్. 174

తే. పక్షపాతంబుతో నిట్లు పలుక నేల, యనిన గోవిందుఁ డలిగి తా నరిగె నపుడు
ముసలిచరణాబ్జముల కేను మ్రొక్కి వేఁడ, గన్నులరుణంబుగావించి నన్నుఁ గాంచి.

క. అడవులఁ గాయలు నములెదు, బడుగులతోఁ జేతురమ్మ బంధుత్వములన్
జడమతివై పుత్త్రునకున్, వడఁతుక నిమ్మనుచుఁ బలుకఁ బాడియె నీకున్. 176

క. పోఁడిమి చెడి రా మీకున్, గూడొసఁగుట చాలు ననక కోడ లటంచున్
వేఁడెదవు సిగ్గులేకన్, చేడియ నీ కిట్టికోర్కె చెల్లునె తలఁపన్. 177

తే. ధార్తరాష్ట్రుఁడు మిక్కిలి ధైర్యశాలి, కీర్తికాముఁడు విభవనాకేశతుల్యుఁ
డతనిసుతునకుఁ బుత్త్రి నర్పింతుననుచుఁ, బల్కుపల్కులు చెవులకు ముల్కులగుచు.

క. నాటినఁ గనలుచు నే న, చ్చోటును నెడఁబాసి వచ్చి సుతునకుఁ జెప్పన్
గాటపుఁ జేఁకటియన కీ, పాటున నన్నుఁ దోడుకొనుచు భయదాటవికిన్. 179

క. వచ్చిన నే కెటువంటిదొ, యిచ్చటఁ గయ్యంబు గల్గె మీయిరువురకుం
జెచ్చెర మునివరుఁ డడ్డము, చొచ్చుట దనుజేంద్ర పరమశోభన మయ్యెన్. 180

ఉ. నీ విట నుండు టే మెఱుఁగనైతి మెఱింగిన నట్టు లౌనె యీ
పావనిపుత్త్ర నాసుతుఁడు పాండుతనూజులఁ బాసి చింతలన్
భావమునందు సత్కరుణ మాని హలాయుధుఁ డింత చేసినాఁ
డీవనరాశిమధ్యమున నెచ్చట నుందురొ పాండునందనుల్. 181

క. వా రున్నజాడ లరయుచు, ధీరమతి న్నడువ నాల్గుదినములు సనె మ
మ్మేరీతి నైన వారలఁ, జేరిచి రక్షింపు దనుజశేఖర యనినన్. 182

వ. అని యిట్లు సుభద్ర చెప్పినమాటలు చెవింబడిన ఘటోత్కచునకు. 183

సీ. బలుఁడు దుర్యోధనుపక్షమై యాతని గొప్పచేసె నటంచుఁ జెప్ప నపుడు
మదిలోన నిప్పులు కుదురుగా నిడినట్లు లుండె వెండియుఁ బుత్త్రి నొసఁగ ననిన
నంగాంగమునఁ బొగ ల్నింగికి వ్యాపించె బెట్టుగా జనకులఁ దిట్టె ననిన
వెంటనె నోటిలో మంటలు ప్రబలించె వీరరోషావేశవివశుఁ డగుచుఁ

తే. ప్రళయకాలార్కబింబంబుపగిది నొప్పి, చురుకుచూపుల రోషము ల్పుంజరింపఁ
కనుల నిప్పులు రాలంగఁ గటము లదరఁ, బండ్లు పటపటఁ దీడుచుఁ బలికె నతఁడు.

ఉ. వింతలు పుట్టె యాదవులవీట హలాయుధుఁ డేను గల్గ నా
క్రాంతభయంబు లేక యిటుల కిల్బిషకృత్య మొనర్చె వెండియుం
గుంతితనూజు లేపురను గొంకక నిందలు సల్పుటా రయన్
దంతిపురాధినాయకునిఁ దద్బలము న్మది నమ్మినాఁడొకో. 185

వ. అని మఱియు నిట్లనియె. 186

క. హాలపాణి పల్కు పల్కులఁ, ఫల మతనికిఁ గుడిపి పార్థపట్టికి మఱలన్
జలజాక్షి నొసఁగుతెఱఁగే, సలిపెదఁ జింతింపవలదు జననీ నీకున్. 187

క. బలునకు మనకు న్భేదముఁ, గలిగించిన ధార్తరాష్ట్రుఁ గయ్యములోనన్
బొలియించి యతనితమ్ములఁ, బెలుచన్ ధరఁ గూలవైచి పీచమడంతున్. 188

వ. అని పలికి మఱియును. 189

సీ. సింధురాజును బట్టి బంధించి కానీను ముక్కుకర్ణంబులు మోటు చేసి
శకునికండలు చెక్కి వికలంబు గావించి భూరిశ్రవుని నాజి. బొడవడంచి
దుర్ముఖాదులనెల్లఁ దునుమాడి ధృతరాష్ట్రు నెంచక వార్ధిలో ముంచిముంచి
వెండియుఁ గురుపక్షవీరుల వరుసఁగా ద్రుంగిద వారికై మేలొనర్ప
తే. వలసి యాదవు లందఱు వచ్చిరేని, వారివారిని బంధించి వార్ధివైచి
నపుడు హాలి నిన్నుఁబల్కిన యట్టిపలుకు, తప్పిదం బని మదిలోనఁ దలఁచుఁగాక.

క. మాజనకు లడవిలోపల, భోజనరహితాత్ము లగుచుఁ బొక్కుచు నుండన్
రా జగుదుర్యోధను నే, నాజిని బరిమార్పకున్న నది సాహసమే. 191

వ. అని మఱియు నిట్లనియె. 192

తే. కొండలను బట్టి పెకలించి కుతలమెల్లఁ, గ్రిందుమీఁ దగునట్లుగాఁ బొందుపఱచి
జలధులన్నియుఁ బొచ్చ్యగాఁ గలఁచిపొందు, సుతులకోపంబుమాన్పెదఁ జూడు నన్ను.

క. శశిరేఖఁ దెచ్చి యిచ్చట, దశమీలగ్నంబుఁ జేసి తద్దంపతులన్
శశికుల లగుకొంతేయులు, వసియించెడితావుఁ జేర్తు వగవకు మమ్మా. 194

క. జననీ నీదుఃఖమునకు, ఘన మగునుపశాంతి గాఁగఁ గయ్యములోనం
దునిమెద యదుకులవీరుల, నన విని భీభత్సుకత్తె యసురేంద్రు నితోన్. 195

వ. వెండియు ని ట్లనియె 196

క. అలదుర్యోధనసుతునకు, లలనామణి నిత్తు ననుచు రాముఁడు పలికెన్
నిలిచిన యదుపుంగవులకుఁ, దలఁపఁగ నిష్టంబు లేదు దానవనాథా. 197

క. యాదవు లందఱు వరుసన్, గాదిలి బాంధవులు గాక కడవారలె దా
మోదరునకు మనకున్ మఱి, భేదము లే దెంచి చూడ భీమతనూజా. 198

వ. అదియునుంగాక. 199

క. ధృతరాష్ట్రసుతుల్గఁ జంపను, ప్రతినలు మీతండ్రిగారు పల్కుట వినియున్
మది కొంచ కీవు ద్రుంచినఁ, గుతుకము చెడి పాండుసుతులు గుందుదు రన్నా.

తే. కాన పారలమది నున్నగర్వ మణఁచి, భంగపాటును బొందింపు సంగరమునఁ
బొడ వడంచుట దక్క నీబుద్ధి కెటులఁ, దోఁచు నంతయుఁ జేసి రా దోషరహిత

క. మూఁడుదినంబులు గల దా, చేడియలగ్నం బటంచుఁ జెప్పుచు మఱియుం

బోఁడిమితో నీతమ్ముని, వేడుక లలరంగఁ జేయు వేగము గాఁగన్.

క. అని పల్కు పార్థురాణిం, గనుఁగొని దనుజేంద్రుఁ డనియెఁ గ్రక్కునఁ దల్లీ
మనమున నీ కటుఁ దోఁచినఁ, దనుమాడక గర్వ మణఁతు దుష్టాత్మకులన్. 2

తే. ధార్తరాష్ట్రులఁ గనుఁగొన్నఁ దగినమాడ్కిఁ, బొగరుమాన్పక యున్న నాభూరిరోష
పటిమ వదలదు విను పెక్కుపల్కు లేల, పొలఁతి పెండిలివేళ కేఁబోదు ననుచు

క. తల్లులఁ దమ్ముని దోడ్కొని, మెల్లఁగఁ దనగుహకు నేఁగి మేలోగిరముల్
ఉల్లము రంజిల నొసఁగుచు, సల్లలితము లైనమధురసంభాషణలన్. 2

వ. సుభద్రాభిమన్యులకు సంతోషంబు జేయుచు శశిరేఖావివాహమహోత్సవకాలఁ
నిరీక్షించుచుండె ననుచు. 2

క. మునివరుఁ డెఱిఁగించిన విని, జనమేజయధరణివిభుఁడు సంతోషితుఁ డై
అనఘాత్మ వారిచందనము, వినుటకు నామదికిఁ జాల వేడుకవొడమెన్. 2

కలహంసోత్సాహవృత్తము.

సరసిజాక్ష దనుజశిక్ష సకలలోకనాయకా
శరధితల్ప నగముదాల్ప శమదమాదిసద్గుణా
వారినరాంగ భవవిభంగ అమరమానివందితా
కరుణశీల కనకచేల కమలప్రాణనాయకా. 2

గద్య. ఇది శ్రీమత్సూర్యనారాయణకరుణాకటాక్షవీక్షణాలంకార సుస్థిరామృతవా
జనితకవిత్వరత్నాకరవంశ పయఃపారావార రాకాసుధాకర రాంజ నయాఖ్యతనూ
అప్పప్పనామధేయప్రణీతం బైనశశిరేఖాపరిణయం బనుమహాప్రబంధంబునం
ద్వితీయాశ్వాసము.

తృతీయాశ్వాసము.

శ్రీలలనాహృత్పుష్కర
లోలస్ఫుటచంచరీక లోకస్తుత్యా
పాలితసురమునిగోత్రా
నీలాంబుదరుచిరగాత్ర నీరజనేత్రా. 1

వ. అవధరింపుము సూతుండు శౌనకాదిమహామునులకుం జెప్పెనట్లు వైశంపాయనుండు
జనమేజయున కిట్లనియె. 2

చ. రమణి నొసంగలే దనుచు రాముఁడు పల్క సుభద్ర దీనత
న్గుములుచుఁ బుత్త్రిఁ దోడుకొని ఘోరవనాంతరసీమ కేగుట
న్గుమిగొని ద్వారకాంగనలు కొందఱమంది వచించి రయ్యయో
అమవసమ బ్బటంచనక నద్దమరేయిని బోవు టెట్లొకో. 3

క. అని కృష్ణునికాంతలకు, న్వినిపించిన లేచి వారు విస్మయమతులై
కనలుచు రామునిపత్నిం, గని యిట్లనిపల్కి రాత్మగతి తెలియఁటకై. 4

సీ. పెనిమిటి సెసకొల్పి పేదరాలి సుభద్రఁ బురివెళ్లఁగొట్టితే సరసిజాక్షి
ఆటప్రాయమునాఁడె యభిమన్యునకుఁ బుత్త్రి నిచ్చెద నని మాతో నుచ్చరించి
యది మాని కురురాజుననుఁగుఁబుత్త్రుని కిచ్చుచింత దాఁ బొడమెనే దంతిగమన
కల్మిపై నాకాంక్ష గల్గెనా నీకును పంత మీడేరనే భానురాంగి
తే. అనుచుఁ గృష్ణునిభార్యలు మొనసి పలుకఁ, జింతచేఁ గుంది బలరాము కాంత వారిఁ
గాంచి నిర్దోషి నగునన్నుఁ గానలేక, నిట్టు లాడంగ మీకు నో రెట్టులాడె. 5

వ. అని మఱియు నిట్లనియె. 6

సీ. జలజాక్షి శశిరేఖ సంభవం బాదిగా నభిమన్యుఁ డల్లుఁ డౌననుచుఁ దలఁతుఁ
గూఁతురు గాండీవికోడ లాయెనటంచు మోద మందుదుఁ గాని భేద మెఱుఁగ
నక్కటా! నాకోర్కె కనుకూలముగ వచ్చునె మెఱుఁగరే మీబావ తెఱుఁగు మీరు
ఎఱిఁగి యెఱింగి యి ట్లేల దూఱెద రమ్మ యని బాష్పజలపూరితాక్షి యగుచు

తే. వివశతను జెందు రేవతివిధముఁ గాంచి, వారిజాక్షునిమగువలు వనటఁబొంది
గుములు గట్టుకయుండిరాసమయమునను, జలజలోచన లరుదెంచి బలునిఁ గాంచి. 7

తే. వినుము నీమీఁద నలుకచే విసివి రాత్రి, మనసు భద్రంబు గావించి మనసుభద్ర
పుత్త్రు నభిమన్యుఁ దోడ్కొని ఘోరభయద, విపినభూమికిఁ జనె నని విన్నవింప. 8

వ. వినియుం నీలాంబరుండు వినని తెఱంగున నవ్వాక్యంబులు పెడచెవులం బెట్టి చెల్లెలి
పైఁ గరుణ లేకయుండె నని చెప్పి వైశంపాయనుండు జనమేజయున కిట్లనియె. 9

ఉ. క్రోధము గల్గి చెల్లెలును గొబ్బున బుత్త్రుని వెంటఁబెట్టుక
న్బాధలు వొందుచు న్నగపుఁ బాసి ఘటోత్కచుఁ జేరియుండుట
న్నాథపుఁ డాత్మలోఁ దెలిసి మర్మము రాముని కీక దుష్టదు
ర్యోధను త్రుళ్లడంచుటకు యోచన సేయుచునుండె మానియై. 10

వ. ఆసమయంబున. 11

సీ. చెలికత్తె లావేళ బలుపుత్త్రికడ కేగి వినవమ్మ నీతండ్రి వెఱ్ఱితనము
అలసుయోధనుపక్ష మై సుభద్రను గొన్ని యపమానవాక్యంబు లతఁడు వలుక
నర్ధరాత్త్రంబున నభిమన్యుఁ దోడ్కొని వనభూములకు నేఁగె వారిజాక్షి
నిను లక్ష్మణునకిచ్చునియమంబుఁ గావించె నని చెప్పినంతలో నాత్మఁ గుంది
తే. పరవశత్వంబు నొందుచు భాసురాంగి, పైఁటకొంగును దనదుకన్నీటఁ దడిపి
మాటిమాటికి జనకునిమతముఁ దలఁచి, గుట్టుతనమునఁ దనకుఁ దా నిట్టు లనియె. 12

చ. జనకుఁడు బంధువర్గములసమ్మతి నుత్తముఁ డైనవానికిం
దనుజ నొసంగుటల్ పరమధర్మపథం బని పల్కువాక్యముల్
వినియు సుయోధనాత్మజుని వేమరు రాముఁడు గోరు టారయన్
బనివడి యేనొనర్చుఘనపాపఫలం బని యెంచఁగాఁ దగున్. 13

వ. అని వెండియుం. 14

క. ఎక్కడిదుర్యోధనుఁడో, యెక్కడి లక్ష్మణుఁడొ వానికే నెక్కడనో
అక్కర గల్గనివరునకు, నక్కట! ననుఁ బెండ్లిసేయ నగునే తనకున్. 15

వ. అదియునుంగాక. 16

క. కంతుజయంతులరూపును, బంతంబునఁ గెల్వఁజాలుపార్థుని బతిగాఁ
జింతింతుఁగాని యితరులఁ, జింతించుట యుచిత మగునె చిత్తములోనన్. 17

క. ఆయభిమన్యున కీయక, యీయపలక్షణున కొసఁగి యిచ్ఛామతియై
న్యాయముఁ దప్పి నటించిన, నాయనమం బతఁడు నాకుఁ దండ్రనఁదగునా. 18

క. సుందరమూర్తి సుభద్రా, నందనుతోఁ గలసి మెలసి నవ్వెడుభాగ్యం
బెందెందఁ దలఁచి చూడఁగ, నందనిఫల మాయె నంచు నాత్మలో నెంచున్. 19

క. మేనత్తకొడుకుకొఱకై, మే నెత్తితి నతనిరతుల మెప్పొదవంగా
మే నత్తు సేయకుండిన, మేనెత్తియుఁ నిష్ఫలంబు మేదినిమీఁదన్. 20

వ. అని వగచి. 21

సీ. మఘవపౌత్రుని దొల్త మగనిగా మది నెంచి పరుని వివాహమై బ్రదికి యేమి
ఫల మని నవరత్నభవనంబుఁ జొచ్చి నీటితోఁ దాటితో నేఁటితోను
దనువుఁ బాసెద నంచుఁ దాలాంకవరపుత్త్రి యత్నించునంతలో యతివరుండు
దిగ్గున నటకురాఁ దెఱఁగొప్ప వీక్షించి నారదుం డని యెంచి భూరిభక్తి
తే. మ్రొక్కి నిలిచిన శశిరేఖ మోముఁ జూచి, బాల యిటువంటిసాహసం బేలనమ్ము
పార్థతనయుని నిన్ను దంపతులుగాఁగ, తామరసచూలి నిర్మించెఁ దలిరుఁబోణి. 22

క. కోమరొప్ప నీదుకోరికె, సమకూడెడు దీని కింతసాహస మేలా
కమలాక్షి వినుము తెల్పెద, సుముహూర్తము వేళ కతనిఁ జూచెద వీవున్. 23

వ. అని యిట్లు నారదుం డెఱింగించి చనినయనంతరంబ శశిరేఖ సంతోషసాగరంబునం దేలుచు సఖీజనంబులతో నాడుచుండె నాసమయంబున. 24

తే. కన్యకార్థంబు బలరాముకడకుఁ జనిన, వసుధగీర్వాణు లేతెంచి వారణేంద్ర
పురము సొత్తెంచి కొలువున్నకురునరేంద్రుఁ, గాంచి యిట్లని రత్యంతకౌతుకమున.

క. మీ రనుప నరిగి మే మా, ద్వారకనగరంబుఁ జొచ్చి తాలాంకునకున్
మారాకఁ దెలుప నాతఁడు, సారెకు మీక్షేమ మడిగె సంతోషముతోన్. 26

వ. ఇట్లు క్షేమసమాచారంబులు విచారించి మదాగమనంబునకుఁ గారణం బడిగె నాసమయంబున మంగళద్రవ్యంబు లొసంగి భవత్సూనునకు శశిరేఖ నొసంగు మని వేఁడిన నతం డొడంబడి దశమిముహూర్తంబు నిశ్చయంబు చేసిన విని కృష్ణుండు సుభద్రం దోడ్కొని వచ్చి సౌభద్రునకుఁ గన్యాదానంబు సేయుం మని వేఁడిన నతండు ప్రతికూలంబుగాఁ బలికిన విని దామోదరుం డలిగిపోవుటయుఁ సుభద్ర బలభద్రుం బ్రార్థించినఁ గోపించి కర్ణశూలంబు లైనవాక్యంబులు పల్కిన విని సుభద్ర యచ్చోటువాసి పోవుటయుం శినివరుం డన్నపైఁ గోపించి నిష్ఠూరంబు లాడిన విని సంకర్షణుం డనుజునివాక్యంబులు వినలొల్లక మమ్మిరువురం జూచి దశమిలగ్నంబునకు ధార్తరాష్ట్రుం దోడ్కొనిర మ్మనినవిధం బంతయు సవిస్తరంబుగా నెఱింగించి వెండియు నిట్లనిరి. 27

క. సీరాయుధుతో వియ్యము, గారవమునఁ జేయఁ గోర్కె గలిగిన రేపే
భూరితరవైభవంబున, ద్వారకపయనంబు సేయుఁ ధరణీనాథా! 28

క. అని యిట్లు నేలవేల్పులు, వినిపించినఁ గురువిభుండు వికవికనగుచు

న్ననుజుఁ డగుదుస్ససేనుం, గనుఁగొని ముదమంది పలికె ఘనవాక్పటిమన్. 29

క. హాలపాణితోడ బాంధవ, మెలమిన్ సమకూడె నింక మేదినిమీఁదన్
బలు రగుశత్రులఁ జంపను, జాలకన గద దీనికంటె శుభముం గలదే. 30

వ. అని మఱియు నిట్లనియె. 31

సీ. బలుఁడు మనయతఁడయి పాండునందనులను నిందించి పార్థునినందనునకు
నబ్జరేఖ నొసంగ నని పల్కె గోవిందుఁ డన్ననొం డనలేక నరుగువిధము
నరయంగ మైత్రికి నరుదెంచుఁ గావునఁ దడవు సేయక వేగఁ దర్లవలయు
మనము నా రేకమై వనవాసు లగుపాండురాజపుత్రులఁ జంపి రాజ్యమెల్ల
తే. శాశ్వతంబుగ నేలెదుసమయ మబ్బె, భటవితతి నెల్ల రప్పించి పట్టణమున
సకలగృహములు వీథులు సౌధములును, బరమశృంగార మొనరింపఁ బంపు మనుజ.

చ. తొలుతను బంధువర్గములఁ దోడ్కొని రమ్మనిచెప్పి పిమ్మటన్
జలజభవాననోద్భవుల శాస్త్రవిధిజ్ఞుల వైశ్యశూద్రులన్
పలువురఁ బుష్పవిక్రయులఁ బాటల నీటులఁ గుల్కువేశ్యలం
బిలువఁగఁ బంపు వేగమునఁ బెండ్లికి రాఁదగువారి నందఱిన్. 33

తే. కావలసినట్టిద్రవ్యము ల్కూరిమురంగ, శకటవృషభోష్ట్రముల కెత్తి పరఁగ వీటఁ
గలుగుప్రజలకుపయనము తెలిపి యన్నిపనులు నెఱవేర్చు మిఁక పెక్కుపల్కులేల.

క. అని సెలవిచ్చిన దుర్యోధనునాజ్ఞ శిరంబునందుఁ దాలిచి దుశ్శా
సనుఁ డాలాగునఁ జేసిన, పనులకు ముదమందె రాజు పార్థివనాథా. 35

వ. అనిన విని జనమేజయుండు వైశంపాయనున కిట్లనియె. 36

క. రాముఁడు తమాత్మజునకుఁ, గోమలి నర్పించు టెఱిఁగి గోవిందుఁడు తా
నేమియుఁ బలుకక చనె నని, భూమిసురాగ్రణులు తెల్ప భూపతి మదికిన్. 37

క. తెలియక లగ్నము కొఱకై, బొలుపుగ యత్నించురాజపుంగవుఁ గని యా
తులువా నీ కిది తగ దని, పలుకరుగా ద్రోణభీష్మబాహ్లికు లైనన్. 38

వ. అని యి ట్లడిగినపారిక్షితునకు వైశంపాయనుం డిట్లనియె. 39

చ. కురుపతిఁ గాంచి భీష్ముఁడును గుంభజముఖ్యులు కార్యభంగమా
తెఱఁగు నెఱింగి యిట్లనుచుఁ దెల్పిరి భూవర నీ వొనర్చు నీ
పరిణయయుత్సవం బిపుడు బాగుగ నుండ దటెట్లులన్న నా
కరివరయాన రామునకుఁ గల్గినయప్పుడె పార్థుపట్టికిన్. 40

ఉ. దారయటంచుఁ బల్కె రది తప్పదు కృష్ణుఁడు సవ్యసాచిపైఁ
గూరిమి గల్గి యెల్లపుడుఁ గోర్కెలొసంగుచు నుండు నిప్పు డా

26836
26.3.73

సీరియు సీహితుం డగుచుఁ జేడె నొసంగెద నంచుఁ బల్కిన
న్వారము ముట్టనేర దది పంకజనాభుఁడు సమ్మతింపమిన్. 41

వ. అదియునుంగాక. 42

క. భూధరముల్ చలియించిన, నాధారము దప్పి భానుఁ డవనిం బడిన
న్పాథోధు లింకిపోయిన, మాధవుఁ డాపార్థు విడిచి మనవశ మగునే. 43

ఉ. ఎక్కువమాట లేమిటికి నిందుకులోద్భవ నీదుపట్టికిన్
దక్కఁడు యిందురేఖ హరి ధర్మవిధిజ్ఞుఁడు ఒప్పుకున్న నీ
వెక్కడిబంధువర్గములనెల్లను దోడ్కొని పెండ్లి కేఁగినన్
వక్కన నవ్వరే జనులు బాంధవులందఱు నింద సేయరే. 44

క. బలరాము నమ్మిపోయినఁ, బలుచనయగు టింతె దీనిభావములోనన్
దలఁపకు మన లక్ష్మణునకు, గలుగుదు రెచ్చోటనైనఁ గమలదళాక్షుల్. 45

క. ఇప్పుగిది ద్రోణభీష్ములు, చెప్పిన విని కురువిభుండు సింహాసనమున్
గుప్పునఁ దట్టుచుఁ గోపం, బుప్పతిలం బలికె సకలయోధులు వినఁగాన్. 46

సీ. ఎఱుఁగుదు నేను మీయిరువురతెఱఁగెల్లఁ బరగఁ బాండవపక్షపాతు లగుట
దిగ్విజయంబుగా దీవించు టొవంక దూషించు టీవంక దుష్ట లనుచు
భావించి చూడఁగా జీవించు టీవంక యోపంక విశ్వాస మతిశయిల్లు
దివ్యతరం బైనదేహంబు లీవంక యావంకఁ జిత్తంబు లఱరుచుండు
తే. నెట్టికార్యంబుఁ దలఁచిన నెదురవచ్చి, చెడును జెడు నంచు విఘ్నముల్ సేతురెపుడు
వెడలిపొమ్మన్నఁ బాండవు లడవి కేఁగి, రిట్లు పట్టంగఁబడరు వారెంచిచూడ. 47

ఉ. ఎక్కువ యైనకార్యమున కేము ప్రయత్నము చేసినప్పుడున్
గ్రక్కున వచ్చి పల్కుదురు కాదని మావెనువెంట వత్తు రిం
కెక్కఁడఁ జొత్తు మేదితెఱు పీముదిపోరును మాన్ప శక్యమా
బొక్కను దూరిన న్విడరు పూర్వము నే నొనరించుపాపమో. 84

క. మాటలు నేర్చినకతమున, మేటిధనుర్ధరుల మైన మిక్కిలిభయమా
మాటలు సెప్పుచు దబ్బున, కోటలు దాఁటుదురు పనికిఁ గొఱ దా రగుచున్. 49

వ. అని మఱియును. 50

క. యాదవు లే మొకటగుటన్, భేదము గావింపఁ దలఁచి భీతి జనింపన్
వాదింతురు భీష్మేమన, రా దని నేనూరకున్న లక్ష్యము లేకన్. 51

వ. అని వెండియు నిట్లనియె. 52

క. నేమాధిపు లని మిమ్మున్, బ్రేమాతిశయంబు నేయ బేలత్వముతో
మీ మీహృదయము లరయఁగ, గోమున వ్యాఘ్రంబు లనుచుఁ గరుపలి మఱియున్.

ఉ. అర్జునుఁ డైననేమి హరుఁ డైన మురాంతకుఁ డైననేమి యు
త్యూర్జితశస్త్రసంపదల నొప్పినసౌబలసైంధవాదులున్
నిర్జరనాథసన్నిభుఁడు నీరజబాంధవపుత్త్రుఁ డుండ నీ
కర్జము లేల చెప్పెదరు గాంగతనూభవ కుంభసంభవా! 54

క. పని సాగనిండుమా కిదె, కనకస్నానంబు మీరు గావించు క్రియన్
మనమున నెంచెద భుక్తికిఁ, గానుఁ డిచ్చెదఁ గొఱఁతపడిన గొబ్బున మీకున్. 55

వ. అని పల్కి సుయోధనుండు వెండియు నిట్లనియె. 56

క. ఉసికూత లింకఁ గూసినఁ, బశుపతిపాదంబు లాన ప్రాణంబులతోఁ
గుశలముగ బ్రతుక లే రిఁక, వసియింపక లేచిపొండు వదరకుఁ డిచటన్. 57

సీ. బలరాముఁ డొకఁడు మాకర మైన కార్యముల్ సఫలంబు లగుగాక విఫలమగునె
పెండ్లిఁ జూడఁగ మీకుఁ బ్రీతి గల్గిన రండు కల్గకుండిన నిండ్లకడకుఁ బొండు
మీరు రాకుండిన మిక్కిలిక్షేమంబు విఘ్న మించుక లేక లగ్న మగును
మావెంట మీరు రా మర్కటశతకంబు గుంపుగా యక జతఁ గూడినట్లు
తే. లనుచు బహునిష్ఠురోక్తుల నాడుచున్న, యధిపుఁ డైనట్టికురుపతియాననంబుఁ
గాంచి సిగ్గును గోపంబుఁ గదలుకొనఁగఁ, బలికి రప్పుడు భీష్ముండు బాణగురుఁడు.

క. కాలుఁడు ప్రేరేపఁగ నీ, వీలాగునఁ బెద్దపిన్న లెఱుఁగక పల్కి
తేలా దుర్యోధన నీ, కాలము సమకూడినట్లు గనఁబడె మాకున్. 59

ఉ. భానుతనూజుఁడున్ శకుని పల్కినపల్కులు పథ్య మంచు నీ
వీనులఁ జేర్చి యెల్లపుడు వీరిఁడికార్యము లాచరించుచో
మానవనాథ నీ కిదియు మంచిది గా దని బుద్ధి చెప్పినన్
మానసమందు నిప్పు లిడుమాడ్కిఁ గనంబడె నీకు దుర్మతీ. 60

క. నాగారిగమనుఁ డొప్పమి, సాగదు లగ్నం బటంచుఁ జయ్యనఁ దెలుపన్
రోగికిఁ బథ్యాన్నం బిడు, లాగున నీమదికిఁ దోఁచెరా పాపాత్మా. 61

ఉ. పెక్కులు పల్క నేమిటికిఁ బెండ్లిని జూడఁగ మేము రాము నీ
కక్కఱగల్గుబంధువుల నందఱఁ దోడ్కొనిపొమ్ము కార్యమున్
జక్కఁగఁ జేసుకొ మ్మనుచు సభ్యులు చుట్టలు చూచుచుండ వా
రక్కడ నుండక న్వెడలి రాగ్రహరోషకషాయితాత్ములై. 62

వ. అట్టిసమయంబున. 63

క. గురుఁడును శంతనుపుత్త్రుం, డిరువురు దక్కంగ భూసురేంద్రులు నృపులున్
పురజను లందఱు లక్ష్మణ, పరిణయవీక్షోత్సుకు లగుచు బహువేడుకతోన్. 64

వ. అత్యంతముదంబునం బొదలుచుండి రాసమయంబున. 65

సీ. పాండ్యపౌండ్రవిదర్భబంగాళనృపతులు గజతురగాందోళికముల నెక్కి
వచ్చిరి వేగమె వంగకళింగాంగరాజు లేతెంచి రాలగ్నమునకు
మాళవ మలయాళ మగధ నేపాళాధిపతులు దంపతులతో భద్రదంతి
యూథంబు లెక్కి రాయోధులతోఁ గూడఁ బరతెంచెఁ గాశ్మీరధరణివిభుఁడు
తే. మఱియు గాంధారకోసలమనుజపతులు, ద్రవిడకొంకణకొంకణధరణివిభులు
వత్సమత్స్యకరూశాంధ్రవసుమతీశు, లవని గంపింప వచ్చి రాహాస్తిపురికి. 66

వ. ఆసమయంబున. 67

తే. సర్వశేతనుఁ డత్యంతసంతసమునఁ, బప్పు కలమాన్న మొబ్బట్లు పాయసంబు
లాజ్యధారాప్రవాహ మై భోజ్య మమర, ధరణిసురులకుఁ జేసె సంతర్పణంబు. 68

వ. ఇట్లు సంతర్పణంబు గావించి భోజనానంతరంబునఁ దాంబూల గంధమాల్య వస్త్రభూషణంబులఁ దృప్తులంజేసి ప్రయాణోత్సవంబు సాటించి రాసమయంబున భానునందన బృహద్బలవృషసేనవివింశత్యగ్నికోప సుశర్మశకునిజయద్రథభూరిశ్రవకృపాచార్యద్రోణ సోమదత్తాది రథికవరులు పుత్రమిత్రకళత్రంబులతో రథాశ్వాదివాహనంబు లారోహించి రాసమయంబున ధార్తరాష్ట్రుం డొక్కరథంబుపైఁ గూర్చుండె నప్పు డంతఃపురకాంత లందలంబుల వసియించి యేతేర లక్ష్మణుం డొక్కమహాగజంబుపైఁ గూర్చుండె నివ్విధంబున దుర్యోధనుండు బంధువర్గంబులం గలిసి బ్రాహ్మణవైశ్యశూద్రవైతాళికవారాంగనాదినివహంబుతోఁ బృథివి కంపింపఁ బురంబు వెడలె నప్పుడు. 69

సీ. శ్రీరస్తు తే యంచు క్షితిసురశ్రేష్ఠులు చెలఁగి పల్మారు నాశీర్వదింప
ధృతరాష్ట్రగర్భవిస్తృతవార్ధి చంద్రమ యని వందిమాగధు ల్వినుతి సేయ
హాస్తిపురాధీశ యమరేంద్రసంకాశ యనుచు వైతాళికుల్ ఘనతఁ బొగడ
ఫణిహారు లోకలకు బంగారుబెత్తముబట్టి ముందఱ బరాబరులు సేయ
తే. తుడుము తప్పెట ఢక్కి తుత్తుంభికలును, ఝర్ఝరీభేరిమర్దలఝల్లరులు
మొదలయినవాద్యనాదముల్ మ్రోయుచుండ, ద్వారవతిఁ జేరె నవమిళా ధరణివిభుఁడు.

వ. ఇవ్విధంబున. 71

మ. కురురాజేంద్రుఁడు వచ్చుర్ధాక బలుఁ డాగోవిందుతోఁ దెల్పక
స్వరమామోదముఁ బొంది బ్రాహ్మణులతో బాహూద్భవశ్రేణితో
సరసాగ్రేసరు లైనబాంధవులతో సామంతయూథంబుతోఁ
దరుణీబృందముతో రథాశ్వములతో దంతావళశ్రేణితోన్. 72

వ. ఎదుర్కొని ధార్తరాష్ట్రుం గాంచి కుశలసమాచారంబు లడిగి తదనంతరంబ భూరి భేరీరవంబులు చెలంగ వందిమాగధులు కైవారంబులు సేయ వారాంగనలు నాట్యం

బులు గావింప పరశుపట్టిసభిండివాలాదియాయుధంబులు ధరించి వీరభటులు నడువ
సంకర్షణుండు దుర్యోధనుం దోడ్కొనివచ్చుసమయంబున. 73

క. ద్వారకనగరంబునఁగల, నారీమణు లాత్మ నలరి నవరత్నములన్
దీరిన సౌధాంతరములఁ, జేరి తదాలోకనంబు చేయుచుఁ దమలోన్. 74

మ. చెలియా కన్గొను హస్తికక్ష్యసిదమం జెన్నొందునాతేరుపై
గలవాఁ డంబుజమిత్రదత్తవరసత్కారంబుచేఁ గుంతికిన్
దొలుచూ లీతఁడు సూతపుత్త్రుఁ డనఁగా దుర్యోధనుం జేరి యా
బలభిత్సూనుని నాజి గెల్తు ననుచు న్భాసిల్లుఁ గర్ణాఖ్యతోన్. 75

క. అతిరమ్యం బగురథమున, సతియుతుఁడై వచ్చువాఁడు సభలోఁ గృష్ణ
న్సతిఁ గ్రొవ్వి చీర లొలిచినఁ, బతితుఁడు దుశ్శాసనుండు పద్మదళాక్షీ. 76

మ. తురగారూఢులు చుట్టునుం గొలువ ఖద్యోతప్రభాతుల్య మా
నరదం బందు వసించి వచ్చుకతనిం డబ్జాక్షి వీఁడే కదా
కరుణాసాగరు లైనపాండుసుతులం గాపట్యవృత్తంబుతో
సిరికిం బాసినదుష్టచిత్తు శకునిన్ శీఘ్రంబె వీక్షింపుమా. 77

తే. సింహలాంగూలభూషితసిడము కలుగు
రథమునం దభ్రమణిమాడ్కి రహి నహించి
చూడ్కులకు వేడ్క మిఱుమిట్లు చొనుపు నతఁడు
ద్రోణసుతుఁ డశ్వత్థామ తోయజాక్షి. 78

ఉ. బంగరుగోవృషధ్వజము భాసిలుదివ్యరథంబుమీఁద సా
రంగధరుండు నాఁ బరగి రాజిత మాఘనబాణశస్త్రపా
రంగతుఁ డై మహిం గలుగురాజులకెల్లను శిక్ష సెప్పువాఁ
డంగన చూచితే కృపుఁ డహస్కరతేజుఁ డరాతిరాత్రికిన్. 79

మ. ఉరగేంద్రధ్వజ మొప్పియున్నరథమం దుల్లాసియై సారెకున్
దరహాసద్యుతు లుప్పతిల్ల మమతం దాలాంక వీక్షించుచుం
బరమానందము నొంది బాంధవులతో భద్రేభయూథంబుతోఁ
దురగశ్రేణితొ వచ్చుదుష్టుఁ డతఁడే దుర్యోధనుం డంగనా. 80

వ. నవరత్నస్థగితం బైనరథంబున నర్కుపగిదిం దోఁచు నతని. 81

క. మేరునగధైర్యధుర్యుని, సారసరిపువంశవార్ధిచంద్రోదయునిన్
వారిజముఖి వీక్షించితె, భూరిభుజాటోపబలుని భూరిశ్రవునిన్. 82

చ. కనకమణీమయాభరణకాంతులు దిక్కులు నిండ సారెకు
న్నిరరుచి నడ్డగించుమదమేనుఁగుమీఁద వసించునాతఁడే

మనశశిరేఖకు న్మగఁడు మన్మథసుందరతుల్యు లక్ష్మణుఁ
గనుఁగొను మంబుజాక్షి యనఁగా విని యొక్కలతాంగి యిట్లనుఁ. 83

సీ. కలకంఠి యభిమన్యుఘనపరాక్రమశక్తిమహిమ యెన్నఁగ నొక్కమాస మగును
భూరిసంగరరంగధీరోద్భవస్ఫూర్తి రోష మెన్నఁగ నొక్కబుతువుపట్టు
శస్త్రవిద్యాభ్యాసచాతుర్య మనుదాని జాడ యెన్నఁగ నొక్కయేడుపట్టు
అంగాంగసౌష్ఠవశృంగార మనియెడు గరిమ యెన్నఁగ నొక్కకల్ప మగును
తే. అట్టిసౌభద్రునకు లక్ష్మణాహ్వయునకు, జలధితోఁ గాల్వ పులితోన జంబుకంబు
దంతితో దోమ భానుతో దర్పణంబు, పాటలాధరి గణుతింప సాటియగునె. 84

వ. అని యిట్లు పురంధ్రీజనంబు లనేకవిధంబులఁ బలుకుచున్నసమయంబున నీలాంబరుండు దుర్యోధనుం దోడ్కొని వచ్చి కాంచనమణిమయం బగుమందిరంబున విడియించి భక్ష్యపాయసపదార్థంబులఁ దృప్తులం గావించి తాంబూలంబు లిప్పించు సమయంబున. 85

క. కలహంసనువాక్యంబులు, జలజానన యిందురేఖ సఖిబృందముతోఁ
చెలువగ వస్త్రాభరణంబులు దాల్చక పాన్పుమీఁదఁ బొరలుచు నుండెన్. 86

వ. ఆసమయంబున. 87

తే. పడఁతు లరుదెంచి శశిరేఖపజ్జఁ జేరి, మజ్జనము సేయ రమ్మని బుజ్జగింప
మానివచనంబు లూఁతగా మగువ లేచి, విమలమణిపీఠిపై నుండుసమయమునను. 88

క. లలనలు సంపఁగినూనెన్, తలయంటుచుఁ బాటపాడి దరహాసముతో
కలశము లిడి పన్నీటన్, జలకము గావించి సఖులు సంతోషముతోన్. 89

సీ. తడియొత్తె నొకచెలి తరుచైనజలతారుపూలచీర యొకర్తు పొందుపరచె
వనిత యొకతె మంచి వజ్రాలకాంతుల రహిమించు చంద్రపూరవికెఁ దొడిగె
జడవేసె నొకబోటి కటిచొక్కమపరంజి కుప్పెరేకడి యొక్కకొమ్మ పెట్టె
పద్మరాగప్రభాభాసితం బైమించు పాపటబొట్టొకపడఁతి గట్టె
తే. మణులుదాపినకమ్మలు మౌక్తికముల, నొప్పుబొగడలు బావలీ లొకతె పెట్టె
సరిగెముక్కరయును బన్నసరము తీఁగె, మొదలుగాఁగలసొమ్మొకముదిత దాల్చె.

క. విరిసరు లొకసతి దురిమెన్, పరిమళగంధంబు నొక్కపణఁతియె పూసెన్
తరుణియొక తైణఘ్నదమున, తెరవగుఫాలంబుమీఁదఁ దిలకము దీర్చెన్. 91

క. పాటలగంధికిఁ గన్నులఁ, గాటుక వెసఁ దీర్చె నొకతె గండస్థలులన్
నీటుగ మకరికరేఖలు, బోఁటి యొకతె వ్రాసె నచటిపొలఁతులు మెచ్చన్. 92

వ. ఇట్లు సఖీజనంబు లచ్యుతాగ్రజపుత్త్రిక కలంకారంబు గావించుతఱి లగ్నకాలం బరుదెంచె నని బాంధవు లత్యంతసంతసంబునం జేలుచుఁ బరిమళద్రవ్యంబులు

కాంచనరజితపాత్రలం దిడుకొని పరతెంచువారిం గని శశిరేఖ తనమనంబున నిట్లని వితర్కించె. 93

క. అనిమిషమునివాక్యంబులు, విని నమ్మితి నెదురుకోలువేళిదె వచ్చెన్
జనపతులందఱు గుముల్లై, చనుదెంచిరి విఘ్న మింక జరుగునె తలఁపన్. 94

క. మనసిజమూర్తి సుభద్రా, తనయుని వీక్షింతు ననుచుఁ దక్కులు పలుకన్
మునికేమివిషముఁ బోసితి, నని వెండియు నాత్మయందు ననుకొనసాఁగెన్. 95

తే. విపినభూములఁ ద్రిమ్మరువిజయసూనుఁ, డిచటి కేతెంచుటకు హేతు వెద్దికలదు
మేనితోఁ బొత్తు విడువనిదాన నగుట, నొరుల నననేల నేనేయుంమరితమునకు. 96

క. ఈలక్ష్మణునకు సతినై, యేలాగునఁ గాపురంబు నే నొనరింతు
న్నీలాంబరుఁ డవివేకుం, డీలాగునఁ జేసె ముందు నేలా గగునో. 97

క. గళమున వరకాంచనమం, గళసూత్రము లక్ష్మణుండు గట్టక మును పే
నలకూబరతుల్యుం డగు, బలభిత్సుతసుతునిఁ జూపు పరములు గలరే. 98

క. అని యీలాగున వగచుచు, ఘన మగుతాపంబుచేతఁ గళవళపడుచుం
జని నవరత్నస్థగితపు, పనిగలమంచంబుమీఁదఁ బవళించెఁ దగన్. 99

వ. అంత నక్కడ ఘటోత్కచుండు. 100

సీ. వనజాక్షి శశిరేఖ వైవాహికదినంబు సనుదెంచె నని లేచి సంభ్రమమునఁ
బినతల్లితోఁ జెప్పి తనతల్లి కెఱిఁగించి యభిమన్యునకుఁ జెప్పి యంతరిక్ష
వీథికి నెగసి ము న్వినతాతనూజుండు నమృతసంహరణార్థ మమరపురికిఁ
జనుదెంచువిధమునఁ జని ద్వారవతిచుట్టు విడిచినగజవాయువితతు లరసి
తే. మణిమయం బగురథముల మనుజపతుల, వెంటఁ జనుదెంచు సేనల వీరభటుల
వసుధగీర్వాణకోటుల వైశ్యశూద్ర, జనులవీక్షించి నవ్వుచు దనుజవిభుఁడు. 101

వ. సాయంకాలంబునకుఁ బురసమీపంబునకుం జని యదృశ్యత్వంబున నంతఃపురంబుఁ జొచ్చి బలభద్రునగరు ప్రవేశించి పరిణయవస్తువు లొకరికొక రందిచ్చుసందడిగొను వారిజాక్షుల వీక్షించుచుం జని మఱికొంద ఱైదువలు పన్నీరుకలశంబులం దిడుకొని నానారత్నస్థగితంబు లైనభూషణంబులు దాల్చి పువ్వుహారంబులు దుఱిమి పట్టుపైఠిణీచెంగావిచేలంబులుఁగట్టి దీపికాకళికలచెంత నిలువంబడి యొకరిసింగారం బొకరు వర్ణించువారలం గడచిపోవ మఱికొంద ఱంగనలు పెండ్లికొడుకువా రరుదెంచిరి పొండుపొండని మూఁపులుపట్టి ద్రోచువారలఁ జూచుచు ఘటోత్కచుండు లోపలికిం బోవ నొకమందిరంబున దివ్యమణిమయం బగుమంచంబుపైఁ బవళించియున్న శశిరేఖం జూచి సుభద్ర చెప్పినప్రకారంబున రూపలక్షణంబు లగుపడుట నెఱింగి శశిరేఖగా నిశ్చయించి తనమాయచే నిద్రింపంజేసి తనతమ్మునికిఁ దగినకన్యయని

సంతోషించి మఱిందలి స్మృతుట దోషం బని యెంచి మంచంబు శిరంబునం దిడు
కొని మాయాబలంబున నొరుల కగుపడకుండ సురసమూహంబు లారా యని విను
తింప గగనమార్గంబునం బఱతెంచి తనవనంబున శశిరేఖం డించి సుభద్రాకుమారు
నితో హిడింబానందనుం డిట్లనియె. 102

క. ఏమనిచెప్పుదు నే నీ, రామామణికొఱకుఁ జనిన రారా జటకున్
సామజరథహయసైన్య, స్తోమముతోఁ బుత్రమిత్రసోదరయుతుఁ డై. 103

క. చనుదెంచినాఁడు మఱలం, జని రాజును సూతసుతుని సైంధవదుశ్శా
సనులమదం బణఁగించెద, ననుజా నీ విచట నుండుమని పల్కుటయున్. 104

క. విని సౌభద్రుఁడు వడముడి, తనయుని వీక్షించి పలికెఁ దగునా నీకున్
నను డించిపోవ దుర్యో, ధనునామము విన్న నెట్లు దాళుదు నన్నా. 105

క. నిర్జరపతినందనుఁ డగు, నర్జునునకు నుద్భవించి యని మొనలోనన్
దుర్జను లగుకౌరవులను, నిర్జింపకయున్న బ్రతుకు నిష్ఫల మరయన్. 106

క. ఇలలోఁ దండ్రికిఁ దనయుఁడు, గలిగినఁ దనతండ్రికంటె ఘనవిక్రముఁ డై
విలసిల్లినఁ గాదు కనఁదగు, బలహీనునిఁ గాదు కటంచుఁ బలుకం దగునే. 107

క. పోటబ్బినసమయంబున, బోఁటివలె న్నణఁగియున్న భుజబలశౌర్యం
బేటికి శస్త్రాస్త్రము లిం, కేటికి నీకార్ముకంబు నింకేమిటికిన్. 108

క. జనకులఋణంబుఁ దీర్పఁగ, మన కిది సమయంబు గనుక మఱి యిచ్చోటన్
పనియేమి నాకు నీతోఁ, జనుదెంచెద నంచుఁ బల్కెసౌభద్రునితోన్. 109

చ. వడముడిపుత్త్రుఁ డిట్లనియె వాసరవల్లభురశ్మి లేనియి
య్యడవిని ముగ్ధ లిచ్చడిచి యాజికిఁ బోయిన నిందురేఖయున్
దడబడుచుండు వెండియును దల్లిమనంబునఁ దల్లడించుచున్
గుడిగొనుచింత లేబగలు గుందుచు నుండరె నీవు వచ్చినన్. 110

సీ. ఎఱుఁగుదు నాకంటె నెక్కువో విలువిద్యఁ బారంగతుఁడ వీవు పార్థపుత్ర!
ధృతరాష్ట్రపుత్త్రుల త్రుళ్లణంచుటకుఁగా నిరువురు చన నేల నేనచాలు
నదిగాక మేనల్లుఁ డై మేనమామపై ధనువు బూనుట నీకు ధర్మ మగునె
నిలువు మిచ్చట నీవు నే నేగి క్షణములో గంతులువేయింతుఁ గౌరవులను

తే. యదుకుమారులఁ గొందఱిమదమణంతు, ననుచు మీసము లాకచేత పట్టి తీడి
భీకరాకారమున లేచి కేక వేసి, శమగమనంబుతో నేఁగె భీమసుతుఁడు. 111

వ. అట్టిసమయంబున. 112

తే. ఆఘటోత్కచుమాయచే హాయిఁ జెంది, నిద్రబోయెడుశశిరేఖనేత్రయుగముఁ
దెఱచి మిన్నందుభూజము దేరి చూచి, కలవరింపుచు దిగ్గన నులికి లేచి. 113

తే. కట్టెదుట నున్నసౌభద్రుఁ గాంచి మఱియు, ఫల్గుణునిభార్యఁ వీక్షించి పాదములకు

మ్రొక్కి సిగ్గున శశిరేఖ మోము వంచి, గుట్టుతనమునఁ దనకుఁ దా నిట్టులనియె.

క. ఎక్కడ ద్వారకనగరం, బెక్కడ యీవిపినభూమి యేకూర్కిడుటల్
యెక్కడ మేల్కొను టెక్కడ, నిక్కము యిది చిత్రమంచు నెమ్మది నెంచున్.

వ. ఇట్లు తలంచి మఱియును. 116

సీ. ఎవ్వరు నను దెచ్చి రివ్వనభూమికి నెంతపుణ్యాత్ములో యెంచిచూడ
మునినారదునిమాట ముంగొంగుమూటగాఁ దలఁచి యాతనికేను దండమిడుదు
నతఁడు చెప్పినమాడ్కి నభిమన్యుఁ గనుఁగొంటి నానోము ఫలియించె నలినగర్భు
వ్రాఁత ధారుణియందు వ్యర్థంబు గా దనుపలుకులు దప్పవనే తలఁచి చూడ
తే. నద్దమునఁ దోఁచులిబ్బి చెయ్యబ్బినట్లు, విపినభూముల కేఁగినవిజయసూను
సురుచిరంబైనరూపంబుఁ జూడఁగలిగె, బుడమి నేఁజేయుసుకృతంబుఁబొగడవలదె.

వ. అని యిట్లు తలంచుచు ముసిముసినగవుతో లజ్జానన యై యూరకున్నకోడలిం జూచి సుభద్ర యిట్లనియె. 118

క. ఇలుఁ బాసి వచ్చినా నని, తలఁపకు నీబావ భీమతనయుం డుండే
నిలయము మనయిల్లనుకో, బలభద్రతనూజ వలదు పలుసంశయముల్. 119

వ. అని సుభద్ర వెండియు నిట్లనియె. 120

క. ఇంచుక శంకింపక రా,త్రించరుఁ డట కేగుదెంచి ధీరాత్ముఁ డై
మాంచముతో నిటు దెచ్చెను, పంచాననమధ్య నిన్ను ఫాల్గునికోడలా. 121

వ. అని చెప్పి మఱియును. 122

క. కూరిమి గలతలిదండ్రులు, లేరని చింతింపవలదు లేమా యెల్లుం
డూరికిఁ బోదము నీకున్, గోరికగలవిధముఁ దెల్పు కొంకక నాతోన్. 123

క. అని యివ్విధమునఁ బల్కిన, ఘనవేణి సుభద్ర మోముఁ గని ముద మలరన్
వనజారిరేఖ యెంతో, వినయంబున నిట్టు లనియె వ్రీడానన యై. 124

క. బొత్తిగ బాల్యంబున నా, చిత్తము నీసుతునియందుఁ జేర్చినదానన్
జిత్తము లే దెవ్వరిపై, నత్తా యిది నిశ్చయంబు హరితో డనినన్. 125

తే. వినియు ముదమంది యావేళ విజయుపత్ని, కోడలిగుణంబు లగ్గించి కొడుకుఁ గాంచి
రాత్రిరాజుకు రోహిణి రతికి మదనుఁ, డొప్పినటువలె వీనికి నొప్పె ననుచు. 126

వ. సుభద్ర తనకొడుకు కోడలికిం గలశృంగారంబు మనంబున నెన్నుచుండె నని వైశంపాయనుండు జనమేజయునితో మఱియు నిట్లనియె. 127

తే. ఇందురేఖకు నభిమన్యునందుఁ గలుగు, మోహ మేమని చెప్ప దాముద్దుగుమ్మ
జనకజనకులఁ దమ్ముల సఖుల నైనఁ, దలఁప దించుక మదిలోన ధరణినాథ. 128

వ. అట్టిసమయంబున ఘటోత్కచుం డక్కడ. 129

ఉ. ద్వారక కేఁగి చిత్తమునఁ దా నొకయోచనఁ బన్ని వేగమే
సీరి గృహంబులోపలికి శీఘ్రమె పోయి ముదంబు నొందుచున్
నీరజనేత్రి యుండు శయనించిన చిత్రరుచవికెలోపలన్ (?)
జేరి శశాంకరేఖవలె చేడియ యయ్యె నరేంద్రచంద్రమా. 130

వ. అని వైశంపాయనుండు జనమేజయున కిట్లనియె. 131

ఉ. మోమును గన్నులు న్నొసలు ముక్కును జెక్కులు చౌలు దంతము
లొక్కమల మైనవెంట్రుకలు గొప్పకుచంబులు కౌను పాదముల్
సామజయాన మవ్వగలు చక్కనిపల్కులు కుల్కు లన్నిటన్
రామునిపుత్రిగా మెలఁగె రాక్షసమాయల నేమి సెప్పుదున్. 132

వ. ఇట్లు శశిరేఖయాకారంబు ధరించి ఘటోత్కచుండు. 133

ఉ. నిక్కము పెండ్లికూఁతు రని నిర్మలరత్నపుగద్దెఁ జేరి తా
దిక్కులు చూడ కాసుదతి దివ్యతరం బగు నాణిముత్తెపున్
ముక్కరమీఁద జాఱ్కలిడి ముగ్ధతెఱంగున మోము నెత్తకన్
యెక్కడలేనిసిగ్గు తలకెక్కినమాడ్కి శిరంబు వంచుచున్. 134

వ. ఇట్లున్నసమయంబున. 135

సీ. బలభద్రుఁ డరుదెంచి బంధుజనాళితోఁ జనుదెంచె వైవాహసమయ మనుచు
వినుపింప నెఱిఁగి యామనుజేంత్రునకుఁ దెల్పఁ గురురాజు తమ్ముల దొరలఁ జూచి
యెదురుకో న్వేళయ్యె నెందుకు తడవింక నని చెప్పి యాదవాంగనలఁ బిలిచి
మనలక్ష్మణునిఁ బెండ్లితనయునిఁ గావింపుఁ డని పల్కఁగా విని యబ్జముఖులు
తే. శిరము మజ్జన మొనరించి కురులు చలువ, చేలమున నొత్తి తడియార్చి చిక్కుఁబాపి
వెంటనే సాంకువము నంటి గంటువేసి, పనుల దీరిన బంగారుపాగఁ జుట్టి. 136

తే. బంగరుపుతీఁగెపనిగల్గు సంగరేకఁ, దొడిగి కెంబట్టుజిగి మించుదుప్పటంబు
వల్లెవాటందముగ వేసి మల్లెపూల, సరము లొకకొన్ని శిరమునఁ దుఱిమి మఱియు.

సీ. గోధిపై కస్తూరి గొప్పతిలక మిడి యాణిముత్తెంబులహార మేసి
పద్మరాగంబుల భాసిల్లుకడియము ల్కరముల ధరియించి కనకరత్న
ములచేత విలసిల్లుమొలత్రాడు కటిఁ జుట్టి వెలగల్గు నుంగరాల్ వ్రేళ్లఁ దొడిగి
యింద్రనీలద్యుతు ల్లింపొందుపోఁగులజత లంద మమరఁగా శ్రుతులఁ జేర్చి
తే. తరుణులందఱు బంగారుతట్టలందుఁ, జారుకలశంబు లిడి మహాసంతసమున
నెదురుకోల్వేళఁ జనుదెంచె నేఁగుఁడంచు, లక్ష్మణునివెంట వెడలిరా రాజముఖులు.

వ. అట్టియెడ సుయోధనుండు తనకుమారుం డయినలక్ష్మణుని సామజేంద్రంబుపై వసింప
నియోగించి గంధతైలంబునఁ బ్రకాశించు కరదీపికాసహస్రంబులు వెలుంగఁ బరి

చారికజనంబులు మౌక్తికతోరణంబుల నొప్పుగొడుగు లనేకంబులు పట్టి నడువ నేలవేల్పులు క్రమోచితంబుగా స్వస్తివాచనంబులు చదువ వందిమాగధబృందంబు లప్పటప్పటికిఁ గైవారంబు లొనరింప వేత్రహస్తులు మహారజితరత్నమయంబులైన బెత్తంబులు పట్టి బరాబరులు గావింప వేశ్యాంగనలు మృదంగతాళాదివాద్యంబులు మ్రోయ సూచీముఖకటకాముఖతామ్రచూడపతాకాత్రిముఖాది హస్తభావంబుల నాట్యంబులు సలుప నానాదేశంబులనుండి వచ్చినధారుణీపతులు పుత్త్రకళత్రంబులతో నడువఁ గర్ణాదిరథికవరులు బాణబాణాసనులై పెండ్లికుమారునిదంతి కిరుపార్శ్వంబుల రా దుశ్శాసనాదిసోదరులతో దంపతీసమేతంబుగా మహేంద్రుండునుంబోలె చనుదెంచు రారాజునకు నీలాంబరుండు సారణకృతవర్మోద్ధవాదియదుకుమారులతో వారివారికళత్రంబులతో నెదుర్కొనియె నాసమయంబున నుభయపార్శ్వంబులవా రొండొరులక్షేమలాభంబు లడుగుచు గంధకలపంబులఁ బూయుచు వారివారికిం దగినయుపచారంబులు గావించుచుండె సంకర్షణుపత్ని యగురేవతీదేవి తనపుత్త్రిని లక్ష్మణున కొసంగుట మనంబున కసమాధానంబుగా నుండుటం జేసి పతియాజ్ఞానుసారంబున దుర్యోధనుపత్నికి గంధపుష్పతాంబూలంబు లొసంగి పదిలోఁ బదునొకండుమాడ్కిఁ గుశలంబు లడుగుసమయంబునఁ బౌరజనంబు లొండొరులమొగంబు వీక్షించుచు నిట్లనిరి. 139

క. దానవభంజనువాక్యము, మానసమున నిడక బలుఁడు మతిహీనుండై
మానిని సోదరితోడన్, మేనల్లుని నడవి కనిచి మిక్కిలిసిరికిన్. 140

క. ఆసించి దురాత్ములతోఁ, జేసెను బాంధవము ముందుచే టెఱుఁగక తాఁ
జేసినయవివేకమునకు, గాసిల్లును నితఁడు ముందు గాండివిచేతన్. 141

క. బలశౌర్యశస్త్రకుశలత, కలిమిన్ బ్రఖ్యాతి నొందుకొంతేయులకున్
చెలి నొసఁగక తాలాంకుఁడు, తులువలకున్ బుత్త్రి నొసఁగె దురితాత్ముఁడై.

క. అని యివ్విధమునఁ బౌరులు, ననుకొనఁగా వారువారు నతివేడుకతోఁ
జని పచ్చనితోరణములు, గనుపట్టెడు మందిరంబుఁ గని యచ్చోటన్. 143

క. పులుఁగిండిప్రస్తరంబుల, విలసిల్లెడుభిత్తు లమరి విద్రుమలతలన్
చెలువొందెడుదూలంబులు, తళతళ మనుస్వర్ణరత్నస్తంభంబులతోన్. 144

తే. తులరహితమైనముత్తెంపుతోరణములఁ, జాల రాజిల్లుపరిణయశాలఁ జొచ్చి
కళలు దేరెడుచిత్రకంబళులమీఁదఁ, జేరి వసియించి రానందచిత్తు లగుచు. 145

వ. అట్టిసమయంబున. 146

సీ. తొలుత హైడింబుఁడు తొయ్యలిఁ గొనిపోయి తనవనంబున డించి తత్క్షణంబ
చనుదెంచి శశిరేఖయాకారమును దాల్చి మందిరంబున నుండుమార్గ మెఱిఁగి

క. వనితా సౌభద్రునిపై, మనసుంచకు లక్ష్మణుండు మగఁ డని సుదుటన్
వనజభవుఁ డిడినలిఖితముఁ, బనివడి తప్పింప మఱియు భవునకు వశమే. 158

క. సిరిఁ బాసి విపినభూములఁ, బరదేసులమాడ్కిఁ దిరుగు పార్థాత్మజుని
న్వరియింప నీకుఁ జెల్లునె, సరసీరుహనేత్రి వినుము సంతోషమునన్. 159

క. విపులముగ నీవు చేసిన, తప మేమని చెప్పవచ్చు ధనపతిసుతులో
నుపమింపఁదగినలక్ష్మణుఁ, డపురూపపుమగఁడు దొరకెనమ్మా నీకున్. 160

క. పురుహూతసన్నిభుం డగు, కురురాజున కరయ ముద్దుగోడల వైతో
కరిరాజగమన మమ్మున్, మరువకు మామీఁదఁ గూర్మి మానకు మమ్మా. 161

క. అబ్బుర మగుభాగ్యము నీ, కబ్బెను అత్తింటి కీవు వరిగినతఱి నీ
యబ్బలు చూడఁగ వత్తురు, నిబ్బర మగుబుద్ధి గలిగి యేలుము మగనిన్. 162

వ. అని యివ్విధంబున లతాంగులు కాలోచితానులాపంబు లాడిన విని మాయాశశిరేఖ
యిట్లనియె. 163

క. ధృతరాష్ట్రసుతుఁడు మామై, యతనిసుతుం డీశుఁ డైన నాహా నేఁడీ
యతిశయ మెన్నఁగ మీకున్, మతి చాలదు సుదతులార మఱి యేమందున్. 164

తే. పతియు నన్నుఁగూడి భూమిపై బ్రతికె నేని, మదనసౌఖ్యంబుతో మిమ్ము మదిఁ దలంపఁ
జూడవచ్చినఁ గన్నెత్తి చూడ నేను, ముసలిపాదంబులాన యో ముగుదలార. 165

తే. తాలధరుఁడైన హరుఁడైన ధాతయైనఁ, దొడరి నాయింటివాకిలి ద్రొక్కఁగలరె
నేఁడుమొదలుగ నాకు మాటాడిరేని, అత్తమామల ధరణిపై నట్టె రాతు. 166

వ. అని పల్కి మఱియును. 167

క. మీకందఱకున్ బుద్ధులు, జోకతో నేఁ జెప్పఁగలను సుందరులారా
నాకడ వదరితిరేనిన్, జీకొట్టెద నంచుఁ బల్కెఁ జెలి కఠినోక్తుల్. 168

క. చెలులందఱు విని భీతిన్, పలుతెఱఁగులఁ జింత నొంది పల్కిరి తల్లీ
అలుకవహించుట నీకున్, వల దిఁక కల్యాణవేళ వచ్చెను లెమ్మా. 169

తే. బలుఁడు తడవైనఁ గోపించు జలజగంధి, యనిన విని మాయశశిరేఖ యాత్మఁ గనలి
బలుఁడు కోపింప నాకేమిభయ మటంచు, వెడలెఁ గలకంఠులందఱు వెంటనడువ.

వ. ఇట్లరుగుసమయంబున. 171

సీ. ఎన్నఁడు మగవారి నెఱుఁగ దన్నట్లుగా ముక్కు నేలను జూడ మోము వాంచి
పెనుకొండ తలమీఁదఁ బెట్టినచందాన శిర మెత్తనేర దాసరసిజాక్షి
చరణనూపురములు చప్పుడు గాకుండ గట్టిగాఁ గాళులు పట్టి నడుచుఁ
దిలమాత్రమైనను దేహంబు గానక కనకాంబరము మేనఁ గప్పుకొనుచు
తే. మందయానంబుతో వచ్చు సుందరాంగి, కరయుగంబులు పట్టుచుఁ గంజముఖులు

మెల్లమెల్లనఁ దోడ్తెచ్చి యుల్లమలరు, బలునిచెంగటఁ గైశవపణఁతి నునిచి. 172

వ. అవ్విద్రుమాధర లత్యంతముదంబునఁ గల్యాణంబులు పాడ ననేకవాద్యంబులు మ్రోయ బ్రాహ్మణోత్తములు స్వస్తివాచనంబులు చదువుచు నన్వయగోత్రనామంబు లుగ్గడింప శకునికృతవర్మసైంధవాదిబాంధవు లిరుగడల నిలువంబడి వధూవరులమధ్యంబునఁ దెరఁబట్టి రాసమయంబున నీలాంబరుండు లక్ష్మణునకుఁ గన్యాదానంబుఁ గావించె నప్పుడు. 173

క. అప్పద్మనయనరూపముఁ, జెప్పఁగ విని లక్ష్మణుండు చెలఁగుచు మదిలో
నెప్పుడు తీతురొ తెర యిం,కెప్పుడు శశిరేఖమోము నేఁ జూచెదనో. 174

క. అని లక్ష్మణుఁ డివ్విధమున, మనమునఁ జింతించినపుడు మహిగీర్వాణుల్
మును బట్టినతెర వంచుచుఁ, గనుఁగొను డొండొరు లటంచు గ్రక్కునఁ దెలుపన్.

వ. ఆసమయంబున. 176

సీ. చూడ లక్ష్మణున కాసుదతి కుందేలుగా గంతులువైచుచుఁ గానఁబడియె
వెంబడి నతఁ డాత్మ వెఱగంది చూడఁగా పిండి బొక్కుచు గండుపిల్లియయ్యె
వగచుచుఁ దెరవంచి వాఁడు వీక్షింపఁగాఁ గొక్కరింపుచు పందుక్రోఁతియయ్యె
నిది చిత్ర మని యెంచి పదిలంబుగాఁ జూడ రోమముల్ పెరిగి భల్లూకమయ్యె
తే. మదిని భ్రమచెందితినొయంచు మఱియుఁ జూడ, మినుకుకొఱలసర్పమైమీఁదికెగసె
నపుడు భయమున రెప్పలల్లార్చుకొనుచుఁ, బండ్లుసిగిలించి విలపించెఁ బెండ్లికొడుకు.

వ. ఆసమయంబున. 178

క. ధరణీసురులును రాజులు, సరసిజముఖు లొకరి కొకరు సరసోక్తులతో
సురవైరిమాయ నెఱుఁగక, పరిపరిమార్గముల వారు పలుకుచు నగుచున్. 179

వ. వీక్షించుచుండి రని చెప్పి వైశంపాయనుండు వెండియు నిట్లనియె. 180

సీ. పెండ్లికొడుకుమాడ్కి బెక్కురూపంబులై కనిపించుఁ దక్కినజనులకెల్ల
ముద్దుమొగంబుతో మఁసిమఁసినగవుతోఁ గాటుకద్యుతులొప్పు కనులతోడఁ
బవడంపుమోవితో ఫాలంబుపై మించు కస్తూరితిలకంపుఁ గాంతితోడఁ
బొదలుముంగురులతో నెదమీఁద రాణించు బిగువుపాలిండ్లతో వగలతోడ
తే. వజ్రమణిమయభూషణావళులతోడఁ, జాల రుచు లీనుబంగారుచేలతోడ
సిగ్గు తలకెక్కి వంచినశిరముతోడ, మరునిరాచిల్కవిధముగా మగువ తోఁచె. 181

వ. ఆసమయంబున. 182

సీ. లలనామణులు నవ్వ లక్ష్మణుం డొక్కింత ధీరత్వమున మోముఁ ద్రిప్పిచూడ
మును బెక్కురూపులై గనిపించు హైడింబుఁ డత్యుగ్రశార్దూల మగుచుఁ దోఁచెఁ

దోఁచినభీతిన్ని రాచవారలఁ జూచి 'పెద్దయెలుంగుతోఁ బెండ్లికొడుకు
అబ్బబ్బ యిది గండుబెబ్బులి యగుఁగాని పిన్నదికాదు నాకన్నులాన
తే. యింటిమఱుఁగునఁ బెంచి వా రిటకుఁ దెచ్చి, దీనివాతికి ననుఁద్రోయఁ బూనినారు
పెండ్లికూఁతురు గా దిది పెద్దమెకము, కన్నులకుఁ దోఁచుచున్నదో యన్నలార. 183
క. పులివాతఁ దప్పిపోయినఁ, దలిదండ్రుల నోళ్లు బంధుతతి నే నోళ్లన్
వాలపాణిపుత్త్రి నోళ్లన్, బలుసాకొకయింత మెక్కి బ్రతికెద ననుచున్. 184
వ. అని మఱియు నిట్లనియె. 185

సీ. తలఁచి చూడఁగఁ బెండ్లి తలమీఁద నున్నది యీసారి తప్పింపుఁ డింత చాలు
మీభాగ్య మిఁక పెండ్లిమేరకు రా నింక యెక్కడిశశిరేఖ యేటిపెండ్లి
త్రొక్కిచంపును గాని తొలఁగ దీబెబ్బులి నవ్వుచు నున్నారు క్రొవ్వుబట్టి
నామాట మీకును నవ్వునుగాఁ దోఁచె మాయబ్బసాక్షిగా మగువగాదు
తే. పెక్కురూపంబులై తోఁచెఁ బెండ్లికూఁతు, రిచట లే దని తలఁచెద నిపుడు నాకు
అంతకులగుంపు గూడితి రైన నేమి, యింకనైనను దొలఁగిపోనిండు నన్ను. 186
వ. అని పలికిన లక్ష్మణునకు రాచకుమారు లిట్లనిరి. 187
క. నగుచు మోముఁ గనుంగొని, దిగు లొందుచు నోరుఁ దెఱచి దీనోక్తులతో
మృగ మని పల్కుచు సారెకు, నిగిలించుట రాజుకొడుక యిది మగతనమే. 188
వ. అని మఱియు నిట్లనిరి. 189

క. చక్కనిబంగరుబొమ్మని, దక్కెనె యపలక్షణునకుఁ దననిర్భాగ్యం
బిక్కరణి నున్న దనుచున్, పక్కున నగి రొకరొకరు బాంధవులెల్లన్. 190
వ. అట్టిసమయంబున. 191
ఉ. భానుమతుండు సొబగుఁడు పల్కిరి లక్ష్మణ ముద్దుచేడియన్
గానక నిందచేసెదవు గాదిలిబాంధవు లాప్తు లార్యులున్
మానిని గాదు వ్యాఘ్ర మని మాటికిఁ బల్కెద వేమి చేటు రా
ఢి నినుఁ గూడి మాకుఁ గడుసిగ్గును గల్గెను బంధురాజిలోన్. 192
క. మామకుఁ దలవంపులుగా, మామదికిన్ సిగ్గువోడకు మగువలు నవ్వం
గోమలిఁ గాదని పలుకుట, సామజపురనాథపుత్త్ర సహజమె నీకున్. 193
తే. పలువురము మేము నీచుట్టునిలచియుండ, మిన్నుఁదూఁటుగ నొవరించి నిన్నుమ్రింగఁ
బెద్దపులి యెట్లు వచ్చెరా పెండ్లికొడుక, కలవరించెదు నిద్దురకన్ను లగుట. 194
వ. కావున. 195

సీ ఇంకొక్కసారి నీ వీక్షింపు మని వానికన్నులు నీటితోఁ దిన్నగాను
దుడిచి లక్ష్మణుఁ బట్టి పడఁతివంకకుఁ ద్రిప్ప నంధునివిధముగా నాతఁ డున్న

బంధువులెల్ల నిర్బంధంబు సేయఁగాఁ గడుభీతి మూసినకనులు దెఱచి
గడగడవడఁకుచుఁ గ్రక్కునఁ జూడఁగా దనుజనాథుఁడు ఘోరదంష్ట్రలొప్ప
తే. జడలు దాల్చుచుఁ గనుబొమల్ ముడిగొనంగ, వదనగహ్వరమున నిప్పులు విరివడఁగ
శూల మొకచేతఁ బూని యాభీలమైన, భూతమై తోఁచెఁ గురుపతిపుత్త్రునకును.

క. ఆసమయంబున లక్ష్మణు, గా నేమని విన్నవింతుఁ గరిపురనాథా
మూసినకన్నులు దెఱవక, గోసియుఁ దలచీర పీడ గొబ్బున వ్రాలెన్. 197

వ. ఇట్లు వ్రాలి. 198

క. సొలసి తెలివంది యచ్చటఁ, గలవారలఁ జూచి మీకుఁ గరుణింతైనం
గలుగదు ఎక్కుడిమూర్ఛలొ, తొలఁగరు రవ్వంతయైనఁ ద్రోవాసఁగ రయో. 199

క. పద నగు శూలముఁ గైకొని, యదె భూతం బెదురువచ్చె నని భయపడుచుం
బెదవులు దడవుచుఁ గాళ్లున్, గుదివడఁ దనవారిఁ జూచి గొబ్బునఁ బలికెన్. 200

సీ. మది భయంకర మైనవదనగహ్వర మొప్ప దంష్ట్రాద్వయంబుతో దయ్య మిపుడు
నేతెంచె మీ మొగ మేమిచూచెదరింక మాటు కేఁగెద నన్న మార్గమిడరు
ఇంకెన్నటికిఁ బెండ్లి నే నొల్ల మీమాన యీగండ మొకటి యీడేర్చరయ్య
నీలాంబరుఁడు మిమ్ము నెరనమ్మి నిలువగాఁ దరమె దయ్యము వెంటఁ దగిలినపుడు
తే. పదపదం డని మూపులు పట్టి త్రోచి, బెబ్బరింపుచు జనులెల్ల భీతిఁ బొందఁ
దండ్రులందఱు దిగులొంది తత్తరింప, లలనబృందంబులో దూరె లక్ష్మణుండు. 201

క. దూరినలక్ష్మణువెంబడి, నారాక్షసభూత మరుగ నరచుచు పాఁడున్
సారెకు నయ్యలఁ జేరొక్కను, సీరిని బలుమారు దిట్టు శిర మెదఁ దట్టున్. 202

ఉ. ఆకఱి భీమనందనుఁడు నాసురమాయ సృజింప సర్పముల్
మూతులు జాపుచు న్వెడలి మూరెఁడుమూరెఁడు జిహ్వ లార్చుచున్
భూతలనిర్జరోత్తములబృందములన్ పెసఁ జొచ్చి వారికిన్
భీతి జనింపఁగా నపుడు భీషణ మైనఫణంబు లెత్తుచున్. 203

క. బుసకొట్టుచు వెంబడిరా, వసుధామరు లవనిమీఁదఁ వ్రాలుచు భీతిన్
వెస లేచి గోఁచు లూడఁగఁ, బసిబాలుర నీడ్చుకొనుచుఁ బరువిడి రంతన్. 204

క. పరువెత్త లేక కొందఱు, ధరణీసురవరులు లేచి తత్తరపడుచున్
శిరమునఁ జుట్టినశాల్వలు, నరుదెంచెడుసర్పములకు నడ్డం బిడుచున్. 205

క. జరుగుచునుండఁగ మీఁదికిఁ, బరతెంచిన భీతిఁ బొంది బ్రాహ్మణు లని రో
కురుపతి! నీవెంబడిరా, నురగంబులబారిఁ ద్రోయ నుచితమె నీకున్. 206

క. పరిణయముఁ జూచువేడుక, నరుదెంచితి మింతె కాని యహికాటులతోఁ
బోరిఁబోరిఁ జచ్చెద మని మే, మెఱిఁగిన నిట కేలవత్తు మిభపురనాథా. 207

క. అని వాపోవుచు నుండఁగ, ఘనవృశ్చికసముదయములు కాకోదరముల్
దనుజునిమాయన్ బొడమినఁ, గనుఁగొని భీతాత్ము లగుచు గంతులుగొనుచున్. 208

క. పరువిడినఁ బెక్కుమృగములు, కురుసేనల సంచరింపఁ గురుపతికర్ణుల్
వెఱఁగందుచుండఁ గైతవ, పరిణయపుంబుత్త్రి గానఁబడ దెవ్వరికిన్. 209

వ. ఇవ్విధంబున మాయాశశిరేఖ మాయమైపోయిన. 210

సీ. మఱియును ఘటోత్కచుమాయచే సింగముల్ పులులు సాళువములు భూతములును
గరులు భల్లూకముల్ కాలసర్పంబులు కోటిసంఖ్యలు కూడి గుంపు లగుచుఁ
గలిసిన నచ్చోటఁ గలవారలందఱు దిగులొంది వెడలిపోఁ దెరువు లేక
వాపోవుచుండఁగా పరపన్నగంబులు గట్టిగాఁ గాళ్లకుఁ జుట్టుకొనిన

తే. వాటి విడిపించుకొనలేక నోటితాళ, వాద్యములచేత వసుధపై వ్రాలిలేచి
యార్భటింపుచు వనటతో నవనిసురులు, కొండ తమమీఁదఁ బడినట్టు లుండిరపుడు.

సీ. వేండ్రమా తేళ్లను మండ్రగబ్బలు కొన్ని గుట్టిన నెదనెద గొట్టువారు
విలపించి పాదముల్ విదలించుకొనువారు ఇండ్లలోపలఁ గంతులేయువారు
బెబ్బులుల్ గలసిన బొబ్బలు వెట్టుచు గొబ్బున నొండొరుల్ ద్రొబ్బువారు
ఎదురైన కౌరవయింతుల కడ్డమై మెడఁ బట్టుకొని చాల మిడుకువారు

తే. ఎలుఁగుసింగంబులనుజూచి యేడ్చుచున్న, పడుచుమగువలఁగని మీఁదఁబడెడువారు
దుప్పులనుజూచి కన్నులు గప్పుకొనుచు,నొండుదెసఁ బోక యూరకయుండిరపుడు.

సీ. గాటంపుమృగములఁ గని భీతినొందుచుః దమవారలను డించి తర్లువారు
మోటుమొద్దులభంగి మొలచీర లూడిన వారిజాక్షులలోన దూరువారు
తత్తరింపఁగఁ జూచి దారపుత్త్రాదుల గోడచాటునఁ జేర్చి గొణుగువారు
ఇండ్లలో నుండక పెండ్లిఁ జూడఁగవచ్చి యెలులపా శైతిమం చేడ్చువారు

తే. కడిఁదిమెకములఁ గనుఁగొని కంప మొందు, వనితలకు భీతిమాన్పుచు వగచువారు
పెద్దభూతంబులను గాంచి దద్దరిల్లు, పుత్త్రులను జూచి యాత్మలో బొగులువారు.

వ. ఇట్లున్న సమయంబున. 214

ఉ. కోరలుగల్గుభూతములు గొప్ప మెకంబులు పన్నగంబులున్
కౌరవకాంతలం గదిసి గర్జనచేసిన బొబ్బరింపుచున్
పౌరులఁ జేరి మీ రయినఁ బాముల గాములఁ బోలి మమ్ములన్
గారవమొప్ప బ్రోవుఁ డని కాళ్లకు మ్రొక్కుచు విన్నవింపఁగాన్. 215

చ. పెదపెదమండ్రగబ్బలును బేరులుపేరులు వృశ్చికంబులున్
బుదబుదమంచుఁ దాఁ బొడమి బోఁటులకాళ్లకుఁ బ్రాక నవ్వుడా
సుదతులు చీరలుం బెఱికి నూడు తెఱుంగక గంతు లేయుచున్
ఎదురగువారిఁ బట్టుకొని యేడ్చుచు నుండి రదేమిచెప్పుదున్. 216

సీ. మఱికొంద ఱంగనల్ మంద్రగబ్బులఁ జూచి యబ్బబ్బ యని ద్రొబ్బులాడువారు
ఇంటికంబంబుల కెగఁ బ్రాకి భూమిపై దెబ్బునఁ బడి నోరుఁ దెఱచువారు
అమ్మక్క యిదియేమి యన్యాయ మని వచ్చి దుప్పి మెకముఁ గాంచి తొలఁగువారు
ఎదురగుసేలాటిపీనజాతుల సైన వేగఁ బ్రోవుమటంచు వేఁడువారు
తే. అట్టిమగువల వీక్షించి యవనిపతులు, చేతులును గాళ్లుఁ దెమలింపఁ జేష్ట లుడిగి
చిత్రముననుండుప్రతిమలచెలువు దోఁప, మేను తెలియఁగక నుండిరి దీనులగుచు.

వ. ఆసమయంబున. 218

చ. అనుజసమేతుఁడై చెలఁగునంబుజనాభుని వారివారిఁ బె
ల్చనవిడి రాక్షసేశ్వరుఁడు సౌబలకర్ణసుయోధనాదులన్
మునుమిడి వారివారలను మూలలదూరినయాదవాదులన్
పనివడి ధారుణీపతుల బ్రాహ్మణకోటుల వైశ్యశూద్రులన్. 219

వ. నానావిధంబుల బాధించుచుఁటఁ గ్కచునిమాయల నివారించుసామర్థ్యంబు గోవిందు
నకుఁ గలిగియుఁ నర్జునుపైఁ బక్షపాతంబునను గారవులకు గర్వభంగంబు గావలయుఁ
ననుతలంపునం జేసి మౌనియై యుండె నప్పుడు కర్ణశకునిదుశ్శాసనజయద్రథ కృపా
శ్వత్థామ మొదలగురథికులం జూచి దుర్యోధనుం డిట్లనియె. 220

సీ. మీ రివ్విధంబున ధీరత్వ మెడఁబాసి వెలవెలఁ బోవఁగా విహిత మగునె
యిది పాండుసుతులకు హితులైనవారలు గావించుకార్య మై కానఁబడియె
నిండ్లలోపల నున్న నిది పనిగా దింక బాణబాణాసనపాణు లగుచు
తెరిపికేఁగిన మనతెరువు రా రెవ్వరు సదపదమని చెప్పి భటులఁ జూచి
తే. కాల్బలంబుల రథములఁ గరిహయాది, పరికరముతోడ రండని పనిచి తాను
రవితనూజుండుఁ దక్కునరథికవరులుఁ, బరిణయపుశాల వెలువడి బయలుదేరి. 221

వ. ఉండి రని వైశంపాయనుండు చెప్పిన. 222

క. పురుహూతసన్నిభుం డగు, కురుపురపరిపాలకుండు కలకల నగుచున్
వరమునిఁ గనుఁగొని యవ్వలి, చరితము వినిపింపు తపసిచంద్రమ నాకున్. 223

పంచచామరము. సరోజనాభ చక్రహస్త సన్మునీంద్రసన్నుతా
ధరాతనూజ బాహుపద్మ తామరేంద్రయాదవా
పురారిమిత్ర నీరజాంగ పుండరీకలోచనా
ధరాధరుండు నిన్నుఁ గొల్చి ధన్యుఁ డయ్యె మాధవా. 224

గద్య. ఇది శ్రీమత్సూర్యనారాయణ కరుణాకటాక్షవీక్షణాలంకార సుస్థిరామృతవాక్య
జనితకవిత్వరత్నాకరవంశపయఃపారావార రాకాసుధాకర రాంజనేయాఖ్యతనూజ
అప్పప్పనామధేయప్రణీతం బైనశశిరేఖాపరిణయం బనుమహాప్రబంధంబునందు
తృతీయాశ్వాసము.

చతుర్థాశ్వాసము.

శ్రీలలితమిత్రవిందా
బాలామణిలక్షణాదిమానితవనితా
లోల జనార్దన మునిజన
పాలా కారుణ్యశీల ధర్మసుచేలా. 1

వ. అవధరింపుము సూతుండు శౌనకాదిమహామునులకుం జెప్పినట్లు వైశంపాయనుండు
జనమేజయున కిట్లనియె. 2

చ. కురుపతి కర్ణుఁడున్ శకుని కుంభజసంభవుఁ డాదివీరు లా
పరిణయమందిరం బెడలి బాణశరాసనశూలపాణులై
పురబహిరంగణంబునను భూరిపరాక్రమ మొప్ప నిల్చినన్
గెరలి ఘటోత్కచుం డరిగె ఘీంకృతి సేయుచు నభ్రవీథికిన్. 3

వ. అని చెప్పి వైశంపాయనుండు మఱియు నిట్లనియె. 4

చ. సురపథవర్తియై దనుజసోముఁడు మాయ సృజింప నంతలో
నరిమురి నీలమేఘములు నంబరమెల్లను గప్పెఁ గప్పినం
దెరిప యొకింత లేక నలుదిక్కులు చూచినఁ గన్నుమూసినన్
బొఱఁబొరి నొక్కలై పరఁగె భూరితమం బది యేమి చెప్పుదున్. 5

క. జమపువాడ మఱుము మించులు, పిడుగులు పడగండ్లు నీళ్లు పెనపెన శిలలున్
గడువడి దొరఁగించుచు న, వ్వడముశిసుతుఁ డార్చె దనుజవైరులు బెదరన్. 6

సీ. పార్థివేశ్వర విను పదినూఱుకోటులు గూబలు గుంపులై కూసినట్లు
చెఱువు నిండిననాఁడు చెలరేఁగి కప్పలు పరిపరిధ్వనులతోఁ బిలికినట్లు
పైకి మోరలు సాచి భైరవాశ్వంబులు మొఱపెట్టి మొఱపెట్టి మొఱగునట్లు
నాఁటిపెల్లున నతిభీషణంబుగా రోషించి బెబ్బులు లార్పినట్లు

తే. ఎలుఁలు బోరింపలోఁ జిక్కి యేడ్చినట్లు, కొదమసింగంబు లందంద కూసినట్లు
డాసి యాఁబోతులును ఱంకె వేసినట్లు, నదరి మార్జాలశతము గాట్లాడినట్లు. 7

క. మారుతిసుతుఁ డీలాగున, భూరితరధ్వనుల నభము పూరటిలంగా
వైరులు కంపము నొందఁగ, సిరియుఁ భయమంద సకలసేనలు చెదరన్. 8

సీ. ఒకచోట జావాన లుర్విపై వర్షించు వర్షించి దుందుభివాద్య మొసఁగు
నొకచోటఁ బిడుగుల నుగ్రుఁడై యడరించు నడరించి భేరివాద్యంబు సేయు
నొకచోటఁ జలితేల్లు ప్రకటంబుగా రాల్చు రాల్చి భీషణశంఖరవ మొసంగు
నొకచోట మిక్కిలి యంరగములో దొరగించుఁ దొరగించి మేఘుంబుకరణి నార్చు
తే. దనుజనాథునిసాహసధైర్యములకు, సమరభూజనుఁ డాత్మలో సంతసించి
గాసిపడి తాను జేసినకార్యమునకు, నధికతర మైనఫలకాల మనుచుఁ దలఁచి. 9

క. సరిగమపదములు పాడుచు, తరికిటతైతై యటంచుఁ దాళము లిడుచున్
పదిపరివిధముల నాడుచు, నరుదుగ నాట్యంబు చేసె నమరులు పొగడన్. 10

క. ఆసమయంబునఁ గౌరవు, లాసురమాయాప్రభావ మారా యని వా
రీసున బాణపరంపర, వేసిరి నలుదిక్కులందు నిభపురనాథా. 11

క. అనిరెల్లం గని దనుజుఁడు, రదనంబులు బెట్టు గీటి రౌద్రోద్రేకం
బొదవఁగఁ గార్ముక మెక్కిడి, ప్రదరంబులు నారిఁ గూర్చి పౌరుషమతియై. 12

సీ. దుర్యోధనుని నూఱుతూపుల నొప్పించి యువరాజు నాల్గింటఁ జవ మణంచి
శకుని షడ్వింశతిసాయకంబుల నొంచి సైంధవు నారింట సాధుఁ జేసి
నలినాప్తసుతు నూఱునారసంబుల నొంచి దుర్ముఖు నైదింటఁ దూల నేసి
కృపునిఁ బదేనింటఁ గృపిపుత్త్రు నారింట భూరిశ్రవుని రెంటఁ బొంక మణఁచి
తే. పరిణయముఁ జూచువేడుక నరుగుదెంచు, రాజపుత్త్రులఁ దక్కినరథికవరుల
నూఱునిన్నూఱుమున్నూఱునారసంబు, లేదు వెరిగినవిధముగా నేసె నతఁడు. 13

క. తురగంబులపైఁ దురగము, లరదంబులమీఁద రథము లతిచిత్రముగాఁ
గరిఘటలమీఁదఁ గరులన్, బోరిఁబోరిఁ దొరఁగించి వానిఁ బొలియం జేసెన్. 14

శా. ఆరక్షోవిభుమాయలం బొడముపంచాస్యమ్ము లొక్కుమ్మడిన్
రారాజద్విరదేంద్రపఙ్క్తి చెదరన్ రౌద్రంబుగా రొప్పుచున్
గ్రూరాభీలనఖంబులన్ జిదిపిన న్కుంభంబులున్ భగ్నమై
వీరవ్రాతము తల్లడిల్లఁ గరులున్ విశ్వంభరన్ గూలినన్. 15

వ. మఱికొన్నిమృగంబులు కాల్బలంబులం గదిసి శిరంబులం బగులింపుచుఁ గంఠంబుల నొక్కుచు నరంబులఁ ద్రెంచుచుఁ గరంబుల నములుచు నురంబులఁ జీల్చుచు నుదరంబుల వ్రచ్చుచు నూరువుల ఖండించుచునటి హైడింబుం డనేకశరపరంపరలఁ బరగించిన మొగ్గుగజంబులును జేడ్పడతురంగంబులును దుత్తుమురైనరథంబులును ధరంబొరలు సైన్యంబులునై గొడుగులు పుండరీకంబులు చామరంబులు శైవాల

తతులు దుందుభులు మకరంబులు బాణంబులు మీనంబులు గజంబులు శైలంబులు బాణాసనంబు లురగంబులు రుధిరంబు ప్రవాహంబు లై సముద్రంబునకు సామ్యం బుగా నుండె నప్పుడు. 16

క. జనకులవనవాసస్థితిఁ దనమది నిడి దానవుండు తద్దయుఁ గోపం
బినుమడిఁ బొడమిన వాఁడుం, గను లెఱ్ఱఁగఁ జేసి ప్రళయకాలునిమాడ్కిన్. 17

చ. అగణితసాయకప్రతతు లాకురుసైన్యముఁ దాఁక నేసినన్
జగడము మాని కాల్బలము సందుల గొందులఁ దూరి మిక్కిలిన్
దగఁగొనఁ బాఱువారు శరతాపము నొందుచు మూల్గువారు ప
న్నగములు కాళ్లకు న్బెనఁగ నాట్యముఁ ద్రొక్కుచు నేడ్చువారు నై. 18

వ. అట్టిసమయంబున. 19

సీ. శరము లుఱముఁ దూరఁ గరములు ముకుళించి హా సురయోధన ప్రోవు మనెడువారు
పులికాటులకు నొచ్చి భూమిపైఁ బొగలుచుఁ గొనప్రాణములఁ దన్నుకొనెడువారు
భల్లూకనఖఘాతబాధ కోర్వఁగలేక బిట్టు రారాజును దిట్టువారు
చలితేళ్లు మీటిన సలుపుల కళుకుచు నివి యేటిపెండ్లి యం చేడ్చువారు
తే. పరువులిడువారిఁ గని భీతిఁ బరచువారు, నెలుఁ గనుఁగొని మాటున కేఁగువారు
నరదముల క్రింద దూరుచు నణఁగువారు, దిక్కు దెలియక యందంద తిరుగువారు.

సీ. శిరములు తెగిపడ్డ ధరణిపైఁ బడువారు చరణముల్ దునిసిన నొరుగువారు
నూరువుల్ విఱిగిన నుర్విఁ బ్రాఁకెడువారు నడుములు రెండైన మడియువారు
నుఱములు పగిలిన గోరగోర మనువారు భుజములు తుండ్లైనఁ బొగలువారు
డొక్కలు చీలినఁ బక్కవోయినవారుఁ బిక్కలు తునియలై బెగడువారుఁ
తే. జాల నెత్తురు నదులలోఁ దేలువారు, మొనసి మాంసపురొంపిలో మునుఁగువారు
బడియపోటులఁ బ్రాణముల్ విడుచువారు,నొండొరులఁ బట్టి యేడ్చుచు నుండువారు.

వ. అట్టిసమయంబున. 22

క. ఆకురుసేన న్గొందఱు, రాకొమరులు భూరిరోషరసమానసులై
భీకర మగుమృగములపైఁ, దాఁకిరి రారాజుమదికి ధైర్యము వొడమన్. 23

క. కొన్నిఁటి యూరలు చెక్కుచుఁ, గొన్నిఁటి శీర్షములు వ్రచ్చి కూరాస్త్రములం
గొన్నిఁటి గళములు ద్రుంచిన, నన్నిఁటి వీక్షించి రాక్షసాధిపుఁ డలుకన్. 24

క. ఆకురుసైన్యముమీఁదన్, మలమూత్రముతోడ మఱియు మాంసాస్థులతో
మొలపొడుగు గురిసె నప్పుడు, కలహాశనుఁ డాడె మింటఁ గలకల నగుచున్. 25

వ. అని వైశంపాయనుండు మఱియు నిట్లనియె. 26

క. శరముల మృగములతోడన్, కరివ్రాతముతోడ మంద్రగబ్బలతోడన్

ధరపైఁ బొరలుచు నుండిరి, గురిసెను మలమూత్రమంచుఁ గ్రుంకుచు సేనల్. 27

వ. ఆసమయంబునందు. 28

క. ధృతరాష్ట్రసుతులు రథికులు, ధృతి శరములు బాఱవైచి దుర్వాసనతన్
మతిరోసి పరువు లెత్తిరి, క్షితితలపరిపాల యేమిచెప్పుదు నేనున్. 29

వ. ఇట్లు తనసైన్యంబు పలాయితం బగుట గని సుయోధనుండు కర్ణశకునిదుశ్శాసనాది రథికులం గూర్చుకొని యోచించుచున్నరాజుం జూచి ఘటోత్కచుం డిట్లనియె.

చ. ఇనతనయాదివాక్యములె యింగితమంచుఁ దలంచి పాండురా
ట్తనయుల సింహవిక్రముల దైవతనాథసమానమూర్తులన్
గెనకఁగలేక జూదమునఁ జేకొని సంపద వారలేవురన్
వనులకుఁ బంపి నీవిపుడు వాసవిపుత్త్రున కిచ్చుచేడియున్. 31

చ. కొడుకుకుఁ బెండ్లిచేసికొనుకోరిక మిక్కిలి మానసంబునన్
బొడమి సురేంద్రునిం దెగడుభోగముతోఁ జనుదెంచునిన్ను నీ
కొడుకుల బంధులన్ హితులఁ గూరిమిత్త్రుల నాప్తమంత్రులన్
మెడలు దెగంగవేసి రణమేదినికి న్బలిచేసి పిమ్మటన్. 32

క. సింధురపురమునకుం జని, యంధునిఁ బాపాత్ము నంబికాత్మజు వేగన్
బంధించి తెచ్చి నేఁ డీ, సింధువునన్ ముంచిముంచి సిగఁ దెగవైతున్. 33

సీ. అనుచు ఘటోత్కచుం డవనిపైఁ గేతెంచి కురుపతిమకుటంబుఁ గూలఁ దన్ని
శకునిచెవు ల్వట్టి చంపలు వెసఁ గొట్టి హంసనందను నెత్తి నదరఁ గొట్టి
సింధురాజును దుస్ససేను నర్ధము చంపి భూరిశ్రవుని నేలఁ బొరలఁ దన్ని
కృపగురుపుత్త్రులకోపంబు లణఁగించి తక్కినరథికుల నుక్కణంచి
తే. మఘవసుతుపల్కి చెప్పినమాటఁ దలఁచి, కౌరవులఁ జంపనొల్లక గగనవీథి
కెగసి శరములు బరపిన నింద్రజిత్తు, మాయయుద్ధంబు గా నుండె మనుజనాథ. 34

వ. ఆసమయంబున. 35

చ. అతిరథు లెల్ల కార్ముకము లస్త్రములున్ ధరవైచి పల్కి రో
క్షితిపతి నీకు మాకు నిఁక క్షేమము లే దది యెట్టు లన్న యా
పతగకులాధిపధ్వజుని పల్మరు గేలి యొనర్చినందు కీ
గతి మనకున్ లభించె విను కౌరవనాయక యంచుఁ బల్కఁగాన్. 36

వ. విని సుయోధనుండు దీనాననుం డగుచు రాధేయుం జూచి కర్ణా! మనపరిణామంబు దక్కు నుపాయం బరయుం డని రహస్యంబుగాఁ జెప్పినం గని కృపాచార్యుం డిట్లనియె. 37

సీ. ఎప్పటిగుసగుస లెందుకు రాజేంద్ర సకలసైన్యంబులు చచ్చుపనికి
మాయయేనుఁగులచే మడిసె నీయేనుఁగుల్ మాయగుఱ్ఱములచే మడిసె హరులు

మాయబెబ్బులుల్తో మాయమై రందఱు కౌరగాని యోధవరుల్ గూడ దిచట
పాండునందనులకుఁ బరమాప్తుఁ డైనట్టి పుండరీకాక్షుని భూరిమహిమ

తే. కర్ణునకు నీకుఁ దెలియక గర్వమెత్తి, గేలిచేసిన చేటది యేలదప్పుఁ
దొలుత మిన్నేటికొడుకును గలశజుండు, వలదు వలదంచుఁ జెప్పిన వారి దాఁటి.

క. శశిపురవల్లభ నీ పీ, దురితాత్ముఁడు చెప్పినట్టి దుర్నీతులతో
నరుదెంచి సకలసేనలఁ, గురుకులజుల నీగి తెంక గుసగుసలేలా. 39

సీ. శేషశాయిని గేలిచేసినప్పుడె నీకుఁ జేటు మూడెను వేఱె చెప్పనేల
వక్రమానసుఁడ వీ వొక్కఁడు చక్కఁగాఁ గొఱవితోఁ దలగోఁకుకొందురయ్య
మిన్నుఁ జూచినముల్కి మించులు గనిపించు మన్నుఁ జూచినఁ బాము తెన్నొల్తోఁచు
బెగడి దిక్కులు చూడ బెబ్బులుల్ గనుపించుఁ గావునఁ బాచికల్ గావు నేఁడు

తే. నిలువ శక్యముగా దింక నీకు మాకుఁ, బ్రాణములు దక్కనొక్కింత బాహుబలము
లేదు విను కర్ణుఁ డాప్తుఁడై రేపు మాపు, నీకుఁ గఱపినదుర్నీతి నింతపుట్టె. 40

చ. అన విని కర్ణుఁ డాకృపునియాగ్రహ మొప్పఁగఁ జూచి వీనులన్
వినఁ జవిగానివాక్యములు విప్రకులాధమ యింకఁ బల్కితే
నినరుచు లీనుఖడ్గమున నిందఱు జూడఁగ నీదుకంఠమున్
దునిమెద నంచుఁ బల్కు విని ద్రోణతనూజుఁడు క్రోధమూర్తియై. 41

ఉ. ఏమిర కర్ణ కౌరవులయెంగిలికూడు భుజించి మత్తుఁడై
భూమియు మిన్నుఁ గన్పడక పొంగెద వింతియె కాక భూరిసం
గ్రామమునందు శత్రుఘనకాండము సోఁకినఁ బారు నీకు సి
గ్గేమియు లేక ప్రేలెదవు యించుక నెంచవు గొప్పగొంచెముల్. 42

సీ. నీజల్లుకూఁతలు నిశ్చయం బని యెంచి రాజ్యమదాంధుఁ డీరాజరాజు
శుక్కశౌర్యము నమ్మి కొదమసింగంబుల నెదిరించువిధముగా విదితయశుల
రణపండితులఁ బాండురాజనందనులతోఁ బగఁ బూనె నదిగాక పద్మనాభు
సరకు సేయక గేలి సలిపితి రిఁకమీఁద క్రతుకుమార్గం బేదొ వెతుకు మనిన

తే. ద్రోణి నీక్షించి యిట్లనుఁ దరణిసుతుఁడు
తావిగలమంచిఘృతముచేఁ దప్తమైన
మండిగెలు లడ్డులొబ్బట్లు మసఁగుఁబూలుఁ
మొదలుగాఁగలభక్ష్యముల్ ముదముఁ జెంద. 43

క. బరు లుబ్బఁగఁ బృష్ఠోద్వము, పర్యంకము మెక్కి పెక్కుపలుకులు పలికే
ధరణీబృందారకులకుఁ, దరమే సంగ్రామవిధము ధరణీస్థలిలో. 44

ఉ. పాపలు పూజనీయు లని భావమునందుఁ దలంచి మిక్కిలిన్
దూరము నోర్చికొంటి విను ద్రోణతనూభవ నన్నుఁ గూర్చి మీ

రారడి కారు లాడినఁ గరాసినిఁ ద్రుంచెద నంచుఁ బల్కినన్
ధారుణినిర్జరోత్తముఁడు తద్దయు రోషకషాయితాక్షుఁడై. 45

క. ఒఱ నున్నవాలుఁ బెఱికిన, గురుపుత్రుని మోముఁ జూచి కోపము వలదీ
తఱి యని చెప్పుచు నాతని, కరమిడి ఖడ్గంబుఁ గొనియెఁ గ్రక్కునఁ గృపుఁడున్.

వ. ఆసమయంబున రారాజు నంగరాజుం గదిసి యిరుగేలం బట్టి యనేకవిధంబులఁ బ్రా
ర్థింప నాతనిం జూచి కుంభసంభవసంభవుం డిట్లనియె. 47

క. విడువిడు వానిం బట్టకు, కడుమదమున మన్ను మిన్నుఁ గానఁడు నృపతీ!
మెడపోసరమున నున్నాఁ, డుడుగుసె నా దెబ్బ తాఁకి యుండిగినభంగిన్. 48

క. అనుతఱి శిలలున్ బిడుగులు, ఘన మాగుశరార్పములఁ జెరుగుగతి ధారుణిపై
దనుజుఁడు వర్షించినచో, జననాథునిఁ జూచి కృపుఁడు చయ్యనఁ బలికెన్. 49

తే. బయల నిల్చిన మనకింక బ్రతుకవశ మె, చూడఁ జూడంగ నెప్పటిచో టె మేలు
ధనువు లస్త్రంబు లన్నియుఁ దునుకలయ్యె, బిరుదుమగలకు లేదు పోఁ బింక మరయ

క. అనవిని కర్ణుఁడు శకునియుఁ, జనపతి మొదలైన రథికజనములు భీతిన్
గునగునఁ బర్విడి శోభన, ఘనభవనముఁ జొచ్చి రంత కౌరవనాథా. 51

క. క్రూరమృగంబులబాధకుఁ, బౌరులు కౌరవులు చాల భయవిహ్వలులై
జీవము వరుపులు పాఱఁగ, సీరాయుధుఁ డార్తి నొంది చిడిముడిపడుచున్. 52

చ. అసురులమాయ గాఁ దెలిసి యంగజభంగసమానమూర్తియై
ముసలము దివ్యమౌ హాలము మూఁపునఁ దాలిచి పండ్లు దీడుచుం
బసగలమందిరం బెడలి పర్వతగహ్వరసీమనుండి బ
ల్వెసఁ జనుదెంచుసింహ మన విక్రమ మొప్పఁగ వచ్చి యచ్చటన్. 53

చ. పగతుఁ డగోచరుం డగుటఁ బల్మరు దిక్కులు చూచునంతలో
గగనమునందు రక్కసుఁడు గర్జన సేయఁగ నాలకించి తా
నగములు ప్రక్కలించుకులిశాయుధుఁడో యన వేగ సీరమున్
దొగతునఁ గేలఁ బట్టుకొని నూఱువిధంబుల వీచె రాముఁడున్. 54

సీ. ఆసమయంబున హైడింబుఁ డుగ్రుఁడై పెళపెళధ్వనులతోఁ బిడుగు లవనిఁ
దొరఁగించి వెంటనే తోరంపుశిఖంబు లెడసందు లేకుండ జేసి మఱియుఁ
నిగనిగద్యుతు లొలుకు నిప్పులవర్షంబు గురిపించి వెండియుఁ గోప మొదవ
హాలసాధనునిమీఁద మలమూత్రపంకంబు నించిన నచ్చోట నిల్వలేక

తే. పరిణయపుశాలలో దూరి పద్మనాభు, నగరిలోఁ జొచ్చి నాఁగేలు జగతి వైచి
పిదప రోఁకలి గోడకుఁ బెట్టి హరిని, జూచి గోవింద యిదియేమిచోద్య మనుచు.

వ. అని మఱియును. 56

సీ. ఇందిరేశ్వర నీకు నేమని వివరింతుఁ బులులు సింహంబులు భూతములును
మండ్రగబ్బలు తేళ్లు మఱియుఁ సర్పంబులు జగతిపై నెరపినచంద మయ్యెఁ
గూత లార్భటులతోఁ గుధరముల్ వాపోయెఁ గాని కూఁతురి పెండ్లి కాకపోయె
నదిగాక శశిరేఖ యరయంగ లేదాయె నెచ్చోట డాఁగెనో యెఱుఁగ నేను
తే. మొదట లక్ష్మణుఁ డిగిలించి మొఱలువెట్ట, నపుడె నామది కనుమానమయ్యె నంతఁ
జీర లెఱుఁగక బారిరి చెలులు భీతి, బ్రాహ్మణోత్తము లందఱుఁ బరువులిడిరి. 57

వ. ఆసమయంబున. 58

క. అనిసేయుటకై కొందఱు, జనపతు లచ్చోటి కేఁగి సంయమపురికిన్
జని రని చెప్పుచు వెఱచియుఁ, వనజాక్షునిఁ జూచి ముసలి వగచుచుఁ బలికెన్. 59

సీ. పెండ్లిఁ జూడగఁ జిన్నపెద్ద లందఱు వచ్చి గుండ్లు పైఁబడి నేలఁ గూలి చనిరి
కాల్బలంబులు చచ్చెఁ గరు లన్ని హతమయ్యెఁ దురగముల్ తేరులు తునుకలయ్యె
ధనువు లింతింతలై ధరమీఁదఁ బడిపోయె శస్త్రాస్త్రములు పాళ్లు జగతి నిండె
పరశుపట్టిసఖడ్గప్రాసంబు లన్నియుఁ బేరులేకుండఁగా బెంచులయ్యె
తే. రుధిరనదములుబాఱియంబుధులఁజొచ్చె, మెదడురక్తంబుమెక్కుచుఁ బదియునైన
కోట్లభూతంబు లందంద గుంపులగుచుఁ, దిరుగుచున్నవి పురిచుట్టు సరసిజాక్ష. 60

సీ. కయ్యమొనర్ప నే నొయ్యనఁ జని నాల్గుదిక్కులు చూడ నాదృక్కులకును
వైరి దృశ్యుఁడు గాక వారిదంబున డాఁగి యొకచోట భాషించు నొకటఁ దిట్టు
నొకచోట దిరుగు నొండొకచోట ఘోషించు నొకచోట నేస్చును నొకట నవ్వు
నాజి వాని జయింప నలవిగా దదిగాక నశనిపాతంబులు నస్త్రములును
తే. శిలలు దొరఁగింప నచ్చోటుఁ దొలఁగి నేను, త్రాసమును బొంది వచ్చితి వాసుదేవ!
యలసురయోధను గలియేమొ తెలియదాయె, నింతపని సేయుఁ డెవ్వఁడు హేతువేమి.

క. తెలిసిన దాఁచకు మదిలో, వలమురిధర యీవిధంబు వాస్తవ మొప్పన్
దెలుపు మటం చని వేఁడిన, బలరామునిఁ జూచి శౌరి పకపక నగుచున్. 62

తే. ఎఱిఁగి చేసినపని కేల యింత వగపు, కర్ణశూలంబులైనట్టి కాఱు లఱచి
తోడఁబుట్టును యిలు వెళ్లఁ దోలినట్టి, చేటు వాటిల్లెఁ బో నీకు సీరపాణి. 63

తే. తూర్పు మాగాణిఁబాలించుదొరతనూజు, పడఁతియిలుబాసినిశివేళఁ గొడుకుతోడఁ
గదలి పాండవు లుండినకాననంబుఁ, జెర వెఱుంగక యడవిలో నరిగి యరిగె. 64

తే. సురఁటిపీవులపుట్టువుసుతునిపట్టి, కోన కేఁగిన నాకఁడు కుశల మడిగి
పట్టణము వాసి మీరిట్టి భయము లేక, ధీరులై వచ్చు హేతువుఁ దెల్పుఁ డనిన. 65

క. నీవాడిన వాక్యము లా, దేవారికి విన్నవింప దిక్కులు వ్రీలన్
దేవసమూహము బెదరన్, పావనసుతుఁ డార్చె మేరుపర్వత మదరన్. 66

వ. ఇట్లు సింహనాదంబు సేసి యప్పుడు. 67

క. నిటలభ్రూకుటి ముడివడఁ, బటపట మని పండ్లు గొరికి పటుకోపముతో
నిటువచ్చి యిందురేఖన్, కుటిలాలక నెత్తుకొనుచు గొబ్బున నేఁగెన్. 68

వ. ఇట్లేఁగి తనవనంబున శశిరేఖం డించితక్షణంబ. 69

తే. మరలఁ జనుదెంచి మగువయై మాయతోడ, లక్ష్మణుని భీతిఁ బొందించి రాజసుతుల
గర్వభంగంబు గావింప గగనవీథిఁ, కెగసి మిక్కిలి యుగ్రుఁడై యింత చేసె. 70

క. అని యివ్విధమునఁ జెప్పిన, విని నల్లనివలువతాల్పు విస్మయమతితో
వనరుహనేత్రునిఁ గనుఁగొని, మనసోకరి యిట్లు సేయు మంచిద తనకున్. 71

తే. అబ్జరేఖను ఇవ్వలే దంటిఁగాని, యిల్లు వెడలాసిపొమ్మంచు నెవ్వ రనిరి
కొడుకుతో లేనికొండెముల్ కొన్ని చెప్పి,మనకు నవమాన మొనరింపఁ దనకు మేలె.

క. అని దుక్కిటాలుదాలుపు, మనమునఁ గోపంబు వొడమి మఱి యేమనకన్
మునిబోలె నుండి వెండియుఁ, దనతమ్మునిఁ జూచి లేచి తానిట్లనియెన్. 73

క. దిట్టయయి తాను పంపిన, బెట్టిదుఁ డగురక్కసుండు బెదరక యెదుట
న్నెట్టుకొని కయ్య మొసఁగినఁ, గొట్టుదు జముపురముఁ జేర గోగణరక్షా. 74

వ. కావున నాచూడ్కులకు దృశ్యుండుగాక నదృశ్యుం డగుటంజేసి రక్కసుని సామ
ర్థ్యంబు చెల్లె నని చెప్పి వెండియు సుభద్ర నుద్దేశించి హలాయుధుం డిట్లనియె.75

సీ. తా నెంత చేసినఁ దనతనూజునకు నా పట్టినిత్తునె పట్టిభ్రమలుగాక
దానవేశ్వరుఁ డున్నకొనకు నే నేఁగి యిందురేఖను దెచ్చి యిభపురేంద్రు
సుతున కిచ్చెదఁగాక సుదతి సౌభద్రు నకిచ్చిన జనులెల్లహీనుఁ డనరె
వనజాక్షి నేఁడోయి వనితఁ దెచ్చెద నంచు ముసలంబు నాఁగేలి మూపుఁ జేర్చి
తే. పైనమై పోవురాముని బారఁ జూచి, మొదటఁ గోపంబు పొడమిన మది నడంచి
పిన్ననగ వొప్ప జనులెల్ల సన్నుతింపఁ, జుట్టుకైదువజోదు తా నిట్టులనియె. 76

చ. చెల్లెలి దక్రమం బనుచుఁ జెప్పెద వించుకనీతి లేక యీ
కల్లలు పల్కెదన్ జనులు కాపురుషుం డనఁ బోరె రేవతీ
వల్లభ కూటికై గృహమువాఁకిలిఁ గాచితి వంచు దూరుటల్
ఇల్లును వెళ్లిపొమ్మనుట కించుక భేదము లేదు చూడఁగన్. 77

తే. తోడఁబుట్టువు పుత్త్రునిఁ దోడుకొనుచు, విపినభూముల కరిగినవిధము దెలిసి
యించుకైనను వగవ కాయింతియందు, నెగ్గు గలదని చెప్పుటో సిగ్గు గాదె. 78

వ. అని మఱియుఁ గోవిందుఁడిట్లను వీరపత్నియుఁ, వీరమాతయు నగుసుభద్ర మనయందుఁ
గల కృపాతిశయంబున యాదవాదికౌరవులనెల్లఁ జంపవల దని సెల వొసంగుటం
జేసి రక్షించెం గాక లేకున్న లోకవిద్రావణుం డగురావణునకు సమానవిక్రముం

డీఘటోత్కచుని జయించుట యింద్రాదుల కసాధ్యం బదియునుంగాక రేవెల్ల రేశం దెచ్చుట కీవు చనిన సౌభద్రునకుఁ బులికిఁ గండం గనినవిధం బగుట నిశ్చయం బనంతరంబు బ్రతికివచ్చుట కసాధ్యంబుగానుండు నని చెప్పి దామోదరుండు వెండియు నిట్లనియె. 79

క. కాననభూములఁ బన్నియుఁ, సూనుఁడువిహరించువిధము సురముని దెలుపన్
వానరపతి పెక్కుమువా, డీనినపులివోలె వచ్చు నెఱుఁగవె యతనిన్. 80

వ. అదియునుం గాక. 81

క. వనసూకరంబు కొఱకై, మినుసిగదయ్యంబుతోడ మిక్కిలికయ్యం
బొనరిచి పాశుపతాస్త్రం,బును బడసినపార్థుఁ బోలుభూపతి గలఁడే. 82

తే. ఆధనంజయు జంటగా నరుగుదెంచు, బకహిడింబులఁ ద్రుంచిన బాహుబలుఁడు
వసుధ వినుచూలి సంతోషవార్ధిఁ దేలి,వరధనంజయుం జంటయై వచ్చినట్లు. 83

క. ధృతరాష్ట్రపుత్త్రశాసన, వితతన్ గుమలించి వరుస విజయానలుఁ డీ
క్షితి కెల్ల ధర్మసూనునిఁ, బతిఁగా నొనరించు సురలు బ్రస్తుతి సేయన్. 84

వ. కావున. 85

సీ. ఉరుమృగేంద్రస్నేహమొల్లక గోమాయువులను జేకొనువానిచెలువు దోఁప
వినతాత్మజుని మేటివిశ్వాసమును మాని చెలిమి కాకులతోడఁ జేసినటుల
ఖండనరిపుకాండఖండనుం డగుపార్థు వియ్యమందక నీవు వెఱ్ఱి వగుచుఁ
జెడుగుమనుజులతోడఁ జేసినవియ్యంబు కొనసాఁగునే పట్టికొఱ్ఱె గాక
తే. ఆదురాత్మకు లీపురి కరుగుదెంచు, ఫలము యాదవ్రులకుఁ గొంత ప్రాప్తమయ్యె
ననిన విని రాముఁ డౌను కా దనక శిరము, వంచి తర్జని నాసిపై నుంచియుండె. 86

వ. ఆసమయంబున. 87

సీ. ఆసదాగతిపౌత్త్రుఁ డతిరౌద్రమూర్తియై తనమాయఁ జేసిన దానఁ జేసి
పుడమి కుమ్మరసానపోలికె దిర్దిరఁ దిరిగె నంబరమెల్ల ధరణిఁ బడిన
విధమయ్యె మెఱుపులు విస్తారముగఁ దోఁచెఁ దోఁడనె పిడుగులు దొరఁగె నపుడు
ప్రజలెల్ల దిగులొంది ప్రళయకాలం బని చిత్రరూపంబుల చెలువుదోఁప
తే. దీనులై యున్నవారలఁ జేరి చూచి, దానవేశ్వరుఁ డావేళ దశసహస్ర
కింకరులఁ బంప వారలిబ్బింక మడర, బలునియలుఁ జొచ్చి రందఱు పార్థివేంద్ర. 88

క. బకవైరిసుతుఁ డిబలగము, ప్రకటంబుగఁ జేసినట్టిపను లేమందున్
సకలపదార్థము లన్నియుఁ, మకరాలయమందు వైచి మఱి యాపురిలోన్. 89

క. చరియించురాక్షసులలో, ఖరకరుఁ డసురక్కసుండు కడుకోపమునన్
గురుబలితమ్మునిఁ గనుఁగొని, దురితాత్ముఁడ నీవు మున్ను ద్రుపదాత్మజకున్. 90

క. పలువల సభలో నొల్చిన, ఫలమంతయుఁ నీకుఁ గుడిపి బహువేడుకతో
విలసిల్లెద నని పల్కుచుఁ, దలపైఁ గుడిపాద మెత్తి తన్నెఁ గడఁకన్. 91

క. ఇంకొక దానవనాథుఁడు, పంకజహితసుతునిఁ జూచి పాండవపత్నిన్
వంకరకూఁతలు కూసిన, సంకటమును మాన్ప నాకు సమయం బబ్బెన్. 92

క. అని కర్ణునిఁ బెడతలపైఁ, దన డాఁపలిపాద మెత్తి తన్నిన వాఁడున్
పెనుగాలిచేతఁ గూలిన, ఘనభూజము మాడ్కి నేల గ్రక్కున వ్రాలెన్. 93

తే. పలలభోజనుఁ డొకఁడు సౌబలునిఁ జేర, కపటనేత్రంపుఁబాచికల్ గావటంచు
నొక్కకరమున సిగఁ బట్టి చంక లెగర, గొఱిగెఁ దలవాఁడికత్తితోఁ గురుకులేంద్ర.

సీసమాలిక:—

మఱియొక్క రాక్షసుం డరుదెంచి దుస్సలపతి జయద్రథు నేలఁ బండపెట్టి
తోడిఁబడ మోముపై నడిచి యంతటఁ బోక కొనకాలు పట్టీడ్చెఁ గొంతదవ్వు
వెండియు నొకరాక్షసేశ్వరుఁ డేతెంచి బలియుఁ డౌబాహ్లికుపజ్జఁ జేరి
ముసలిముప్పునఁ బెండ్లిమురిపెంబు వీక్షింపఁ జనుదెంచి తీపాటు ననుభవింపు
మనుచు మూపును బట్టి ఘనరౌద్రమూర్తియై నీటుగా వెన్ను మోకాట నూఁదె
సురవైరి యొక్కఁ డాగురుతనూభవుఁ జూచి బాగాయెనో పెండ్లి బాపనయ్య
మరలఁ బెండ్లికి మీరు తర్లిపోదురు నేఁడు సంయమపురి కంచు సాఁగి మ్రొక్కె
నొకఁడు కృపాచార్యు నొయ్యన వీక్షించి భూసురోత్తమ పప్పుబువ్వకొఱకు
బ్రతిమాల ధృతరాష్ట్రసుతుని వెంబడి వచ్చి బోనేసితివి గాదె పొట్టనిండ
నాచార్యభాగంబు లర్పింతు రిఁక మీకు నిచ్చోట నుండుమం చేఁగె వాఁడు
రాక్షసుం డొక్కఁడు లక్ష్మణు వీక్షించి పెండ్లయ్యె నేమిరా పెండ్లికొడుక
గాము సోఁకినవానిగతి వేల్పువచ్చిన మనుజునిరీతి నున్మాదిమాడ్కిఁ
దలవంచుకొనియున్నఁ దప్పదు మృతి నీకు లెమ్మంచు సిగఁ బట్టి లేవనెత్తె
నొకపూర్వగీర్వాణుఁ డుగ్రుఁడై చనుదెంచి ధారుణీసురులలో దూరి పలికె
నాజ్యభక్ష్యమ్ముల కాసించి యీకార్య మాను కా దనక మీ రరుగుదెంచి
తత్తఱిల్లిన మీకుఁ దప్పదు చావంచు గుదికాళ్లు బంధించి కూల నేసె
దుందుభి యనువాఁడు వందిమాగధబృంద మంతయుఁ వీక్షించి సంతసిల్లి
పన్నెలతలచీర లన్నియుఁ విదళించి గట్టిగా దామెనల్ గట్టివైచె
వెంటనే యొక్కఁడు వేశ్యాంగనలఁ జేరి సూచీముఖం బెట్టు చూపుఁడనుచు
ఖరకరద్యుతిగల కరవాల మంకించి ముక్కులు వరుసగా మోటుచేసె
నదియెల్ల వీక్షించి యతిభీతచిత్తులై పౌరు లొండొరులతోఁ బలికి రార
బలరాముఁ డత్యంతపాపాత్ముఁడై తోఁడఁబుట్టువు నిలు వెళ్లగొట్టి యిట్టి

పాపమానవులతో బాంధవం బొనరించుకతమునఁ బ్రజలకు గాసి గలిగె
మన సొప్పియుండిన మాధవుం డిది మాన్పఁ గన్నెత్తి చూడఁ డీకర్మ మేమొ
సదనంబులం దున్న సర్పవృశ్చికబాధ తలయెత్తి చూడఁ బో శిలలబాధ
అని విలపింపఁగా నంతలోఁ గొండఱు పడఁతు లొండొరులతోఁ బలికి రహహ
అత్తగారింటికి నల్లుఁడు క్రొత్తగాఁ జనుదెంచి పిడుగుతోఁ జచ్చెనమ్మ
కలకంఠి యొక్కతె కపిలధేనువు పెద్దపులినోటఁ బడి నేఁడు పోయెనమ్మ
ముదితరో వినరెంత మంతలపా లిచ్చు నెనుములు పెనుబొబ్బ కీల్గెనమ్మ
తొయ్యలి నూటాఱుతోడేళ్లు గుంపులై కూడి మేఁకలదొడ్డిఁ బాడుసేసెఁ
బదునైదుపాములు పదముల కెగఁబ్రాక భీతయై మాయత్త బెబ్బరించె
తలనిక్కి చూచినఁ దటుకున శిల దాఁకి యక్కకంటికి మోసమాయెనమ్మ
పాషాణ మొక్కటి బఱతెంచి తాఁకిన మఱదికాల్ విఱిగెనే మందగమన
మిక్కిలిచలితేళ్లు మీఁటిన మాతాత పెక్కుగంతులు వైచి పొగులసాఁగె

తే. ననుచుఁ బల్కుచు నాబాలవృద్ధ మంత, నక్కడక్కడ గుంపులై పెక్కువగల
మొఱలు పెట్టుచుఁ దాలాంకు మోముఁ జూచి, బలుఁడ నీవల్ల నా కింతబాధ గలిగె.

క. అని జనులందఱు పల్కఁగ, విని రాముఁడు శిరము వంచి వేఁడొకటనకన్
తనమది యోచించెడు తఱిఁ, గనుఁగొని భీమాత్మజుండు గ్రక్కునఁ బలికెన్. 96

చ. వనమునఁ బాండవుల్ దిరుగ వారలవెంటఁ జరింపఁ దాలకన్
తనయుఁడుఁ దాను నిచ్చటికిఁ దద్దయుఁ గోర్కెను వచ్చి చేరినన్
మన మలరంగ సోదరిని మక్కువసేయక యాదరింపకన్
వనరుహనేత్రి నీవటుల వంకరమాటలు పల్కుటొప్పునే. 97

క. మేనల్లుని వరకన్యాప్రదానార్హునిఁ బార్థసుతుని దర్పకసమునిన్
మాని సుయోధనసుతునకు, మానిని నర్పింపఁ దగునె మామా నీకున్. 98

క. విజయతనూజున కొసఁగిన, గజగామిని లక్ష్మణునకుఁ గైకొనువాఁడై
విజయము చేసినవాఁ డీగజపురివల్లభుని బాగుఁ గనుఁగొను మింకన్. 99

క. పావనిపట్టికి మేనన్, జీవములుం గలిగియున్న సీరాయుధ! నీ
భావమునఁ దలఁచుకార్యముఁ, గావింపఁగ వశమె నీకుఁ గౌరవపతికిన్. 100

వ. అదియునుం గాక. 101

క. కురుపతి ననుజన్ములతో, సరసిజహితసుతునితోడ సౌబలుతోడన్
పరిణయదీక్షాత్తకులై, యరుదెంచినవారితోడ నవనిం గూల్తున్. 102

క. అని మీసంబులు దువ్వుచుఁ, గను లెఱ్ఱగఁ జేసి ప్రళయకాలసముం డై
వనమాలిపూర్వజానకున్, గనుపింపక నేఁగె వాఁడు ఘనపథమునకున్. 103

వ. ఇట్లంతరిక్షచరుండై ఘటోత్కచుం డతిభయంకరంబగు మాయ ప్రబలంబుగావింప

దానంజేసి కౌరవులయంగాంగంబులు దెగి ధరాతలంబునం బొరలిన ట్లంతఃపుర
కామినీజనంబులచూడ్కులకుం దోఁప భయాకులచిత్తులై విలపించువారలం జూచి
నీలాంబరుండు దనమనంబున నిట్లని వితర్కించె 104

చిన్నతమ్ముని పల్కు లన్నియుఁ నిజమయ్యె నదిగాక నకలంకుఁ డచ్యుతుండు
శరణాగతత్రాణబిరుదు దాల్చినమేటి శ్రీరమారమణుండు శేషశాయి
వేణునాదవినోది బాణాసురచ్ఛేది ఖగవాహనామోది కైటభారి
నరసఖుం డానందనందనుం డసురారి గోపికాలయవర్తి కృష్ణమూర్తి
ఆత్మఁ దలఁచిన నణువు బ్రహ్మాండమగును, క్షణములోపల జగ మెల్ల తృణము సేయు
నట్టిహరి పక్షపాతియై నందువలన, రక్కసులఁ జేని కీపరాక్రమము చెల్లె. 105

అని గోపాలదేవుని మాహాత్మ్యంబు వర్ణించి మఱియును. 106

ఇతనిఁ జేపట్టి పాండవుల్ బ్రతుకఁ గలరు, కౌరవేంద్రుఁడు మిక్కిలి గర్వియగుచు
నరకు సేయుఁ గర్ణాదిసహితముగను, జెడుట నిశ్చయమని యెంచి సీరపాణి. 107

అబ్జనాభుని పల్కు లాలకింపక నేను వెట్టితినై శశిరేఖ విజయసుతున
కీయక పాపాత్ముఁ డిభపురేంద్రునితోడ వియ్యమందెద నంచు విజ్ఞపీఁ గి
చేసిన కార్యంబుఁ జేసేత గుఱిచితి హరిచిత్త మరయ లేనైతి ననుచుఁ
దనలోన చింతించు తాలాంకు వీక్షించి వికవిక నగుచు గోవిందుఁ డనియె
ప్రళయకాలంపు రుద్రునివగది మింట, సంచరింపుచు వనమీఁదఁ జలము పట్టి
రాక్షసేంద్రుఁడు వచ్చిన రాజసుతుల, వసుధపైఁ గూల్చు గావున వగపుమాని. 108

అన్నా నా పల్కులు విను, కన్నియ శశిరేఖ మనసు కవ్వడిసుతుపై
నున్నది సౌభద్రునకుం, గన్నియపైఁ గోర్కి గలదు కావున వారిన్. 109
ఎడబాపఁ దగదు నీకున్, గడుపాపము సంభవించుగతిఁ బో నేలా
యెడయుఁడవు మనశశిరేఖకు, వెడఁగల్లునిఁ బోలునట్టి విజయాత్మజుఁ డా. 110

పరశురాముఁ జయించిన బల్లిదునకు, వాయుభుగ్భక్షణోత్తమవాహనునకుఁ
దుల్యుఁ డభిమన్యు లక్ష్మణతుల్యుఁ జేయ, హస్తిమశకంబునకు సామ్యమనుట రామ.

అని చెప్పి మధుసూదనుండు మఱియు నిట్లనియె. 112

పామంబునఁ జక్రంబను, భీమునిసుతుఁ డంచుఁ బల్కి పీతాంబరుఁ డా
రామునిఁ దోడ్కొని సంధికి, భూమిజను ల్మనముఁ జెందఁ బోయెడువేళన్. 113

కరకంకణధ్వనుల్, గల్లుగల్లని మ్రోయ రమణీమణులు చామరములు వీవ
వందిమాగధులు కైవారము ల్గావింప నుర్వీగీర్వాణు లాశీర్వదింప
వేత్రహస్తులు నూరువే లడఁకువతోడ బహుపరాక నిబరాబరు లొనర్ప
ఢమరు వీణా మృదంగ ఢక్కాదివాద్యముల్ శ్రుతుల కంతంతకు సొంపొనర్ప

తే. తమ్ముఁ డత్యంతభక్తిఁ గైదండయొసఁగ, రత్నమయ మైనకొన్ని ద్వారములు దాఁటి
పాకజాత్ముఁడు వేగమె బయలు దేఱ, గట్టిగాఁ దానె దనుజున కిట్టులనియె. 114

సీ. ఓహో ఘటోత్కచ యోభీమనందన మెచ్చితి నీధైర్యలక్ష్మిమహిమ
రావణాసురపాటిరణగరిష్ఠుఁడ వీవు నిన్ను సాధింపఁగ నెవ్వఁడోపు
తమ్మునికొఱకునై తత్క్షణంబున వచ్చి వనిత నెత్తుకపోయి వనముఁ జేర్చి
వెండియుఁ జనుదెంచి వేదండపురనాథు కండక్రొవ్వణఁగించి కర్ణు నొంచి
తే. పరిణయంబున కరుదెంచుధరణిపతులఁ, జంపఁ జూచెద విది యేమిసాహసంబు
చలము సాధించుకొంటివి చాలుచాలు, రాక్షసేశ్వర దయయుంచి రమ్ము రమ్ము.

ఉ. కాలవిశేషము న్గనక గాండివిపత్నిని నిందురేఖకై
నీలపటంబు తాల్పు నవనీతిగఁ గొన్నివచించినందు కీ
యాలముఁ గల్గఁజేసితి వయారె విరోధము మామగారిపైఁ
జాలఁ గృపారసంబు నిడి సంధికి రమ్ము బకాంతకాత్మజా. 116

క. కల్లలు గావివి రాక్షసవల్లభ నాపలుకు నమ్మి వచ్చితివేనిన్
ఉల్లము రంజిలఁ బార్థికిఁ, జెల్లెలు ముదమందఁ బెండ్లి జేసెద మింకన్. 117

క. అనిపల్కిన గోవిందుని, మునుగని యాభీమసుతుఁడు ముకుళితకరుఁడై
వనరుహలోచన మాధవ, సనకసనుత వాసుదేవ సామజవరదా. 118

క. కందర్పజనక వినతా,నందనకంఖాణ నందనందన హరి గో
వింద జనార్దన నీకు, న్వందన మిదె వాసుదేవ వారిజనాభా. 119

వ. అని మఱియు నిట్లనియె. 120

సీ. పాకశాసనుపుత్త్రుపత్నియై గోవింద నీకు తోఁబుట్టు వై నెగడినట్టి
యాసుభద్రను రాముఁ డాడరానటువంటి కఠినవాక్యము లాడి కౌరవులకు
రమణి నిచ్చెద నంచు రప్పించి వెంటనే పరిణయం బొనరింప భావ్య మగునె
మీబోఁటిపెద్దలు మేరఁ దప్పినయంత మాబోఁటిమూఢులమది దలంప
తే. నిబ్బరముఁ బట్టఁజాల దోనీరజాక్ష,సామమున కీవు రమ్మని ప్రేమచేతఁ
బిలిచినటువలె హలపాణి పిలువఁ డితఁడు, పిలువకుండిన నేనేల నలుగకుందు. 121

వ. కావున. 122

క. కౌరవుల వారివారలఁ, బోరున మర్దించి పిదప పురుషోత్తమ మీ
ద్వారకనగరముతోడన్, నీరధిలోఁ గలిపి పోదు నిమిషార్ధమునన్. 123

క. అని సింహనాద మొనరుచు,దనుజేంద్రునిఁ జూచి సీరి తగ నిట్లను నా
తనుజ యగునిందురేఖను, దనుజేశ్వర రమ్ము నీదుతమ్మున కిత్తున్. 124

వ. అని పల్కి బలభద్రుఁడు ఘటోత్కచునితో మఱియు నిట్లనియె. 125

క. శినివరుఁడు మాధవుండును, ననుదూఱుదు రదియుఁగాక నగరములోనన్
జనులెల్లఁ దిట్టుచుందురు, దనుజేశ్వర నీవు దానిఁ ద్రవ్వఁగ నేలా? 126

క. మీకంటెను బంధువు లిఁక, నా కెవ్వరు లేరు వినుము నా కపకీర్తిన్
రాకుండ నిటకు వచ్చిన, రాకొమరుల బ్రతుకఁ జూడు రాక్షసనాథా. 127

క. వలమురితాలుపు చెప్పిన, పలుకులు చెవి సోఁకనీక పాపాత్ముఁడ నై
చెలియలి నవమానించిన, ఫలమంతయు నేఁడు నాకుఁ బ్రాప్తం బయ్యెన్. 128

క. లలనామణి శశిరేఖను, బలభిత్సుతసుతున కీక పాపాత్మకులా
తులువల కొసఁగినకతమునఁ, గలహము జన్మించెఁ గాక కలుగునె మనకున్. 129

వ. అని మఱియును. 130

క. ధరణీనాథు లనేకులు, పరిణయమీక్షాత్ము లగుచు బహువేడుకతో
నరుదెంచినారు వీరిన్, కరుణారసపూర మొలుకఁ గావుము వత్సా. 131

క. అని పల్కిన బలరాముని, వినయోక్తుల కాత్మ నలరి వికవిక నగి య
ద్దనుజశిఖామణి వెండియుఁ, దెనరూరఁగ నిట్టులనియె నీలాంబరుతోన్. 132

ఉ. మంజుల మైననీవచనమాధురికి న్మది సంతసిల్లె నీ
కంజలి చేసి వేఁడెద హలాయుధ విన్నప మాలకించి యీ
కుంజరపట్టణాధిపుని కూరిమితమ్ములఁ బుత్రమిత్రులన్
కంజదళాక్షుల న్వరుసఁ గ్రక్కునఁ బ్రోల్వెడలింపు మింతటన్. 133

వ. అని చెప్పిన ఘటోత్కచునివాక్యంబులకుఁ బ్రతివచింపంజాలక తనసహోదరుండైన
సాత్యకిం జూచి హలాయుధుం డిట్లనియె. 134

ఉ. తమ్ముఁడ నీవు తత్క్షణమె దంతిపురేంద్రునిఁ దత్సహాయులన్
దమ్ములఁ బుత్రులన్ హితులఁ దామరసాప్తతనూభవాదులన్
బొమ్మనిచెప్పి రమ్మనిన బుద్ధి పరాకని చెప్పి యప్పుడే
సమ్మదమందుచు న్వెడలి సాత్యకి వారలఁ జేరి యిట్లనెన్. 135

సీ. ఓరి దుర్యోధన యోజయద్రథ కర్ణ యోదుస్ససేన యోరోరిశల్య
ఓద్రోణనందన యోకృప వృషసేన యోసోమదత్త యోరోరిశకుని
ఓరిబాహ్లీక మీ రూరక ఘూయూరివంచను బడి యేలపరితపింప
మెచ్చి మాపెద్దన్న మిముఁ దెచ్చినందుకు మీరు చావకయున్న మేలుచాలు
తే. ధార్తరాష్ట్రులు త్రొక్కినస్థానమెల్లఁ, దలఁచి చూడంగ నిర్ధూమధామ మగును
కేశవుని మీరు పలుమారు గేలిచేసి, నట్టిఫలమెల్ల ననుభవ మయ్యె మీకు. 136

వ. అని వెండియు. 137

తే. ఇనుములోఁగూడి తొలుత యజ్ఞేశ్వరునకు, దఱచు సమ్మెటదెబ్బలు తగిలినట్లు

మీరు పాపాత్ములగుట మాయూరుజొచ్చి, రాగ జనులకు శిలపెట్టు ప్రాప్తమయ్యె.

వ. కావున. 139

క. పనియేమి యిచట మీకున్, మనుజాధములార యింక మసలితిరేనిన్
దనుజశిఖామణి మిమ్మున్, దునుమాడుట నిశ్చయంబు దుర్మతులారా. 140

క. అని శినిపౌత్రుఁడు పల్కిన, విని యొండొరు మోము లట్టె వీక్షింపుచు న
జ్జననాథులు తమకాంతలఁ, గనుసైఁగలఁ బిల్చికొనుచుఁ గదలెను వేళన్. 141

చ. కురుపతి మోము వంచుకొని కుందినడెందముతోడ ద్వారకా
పురిపొలిమేరయం న్గడచిపోయెదురాజును జూచి తమ్ములున్
తరుణులు పుత్త్రమిత్త్రులును దక్కిన భూపతు లెల్ల భీతులై
కరిపురిత్రోవఁ బట్టుకొని గ్రక్కున నేగిరి యేమిచెప్పుదున్. 142

వ. ఆసమయంబున. 143

ఉ. అంతిపురాంగనల్ పలికి రౌర సుభద్ర యొనర్చుపుణ్యమున్
ఎంతనిచెప్పవచ్చు సుతు లింతపరాక్రము లాజ్ఞ మీరకన్
ఇంతటికార్యము న్సలిపి రిట్టితనూజులు లేనిమాకు నీ
దంతిరథాశ్వసైన్యధనధాన్యవిశేషము లేల కాల్పనే? 144

వ. అని మఱియు నిట్టని రర్జును డరణ్యంబున ముక్కంటితో నెక్కటిఁ బోరి పాశు
పతాస్త్రంబుఁ గొని కాలకేయాదినివాతకవచుల నిర్జించి పాకశాసనుచేత దివ్యాస్త్ర
లాభంబు నొందినట్టిభీభత్సునకుఁ బత్ని యగుటంజేసి వీరపత్నియును, కంస నరకాసుర
బాణాసురమర్దనుం డగురథాంగపాణితోఁబుట్టు వగుటంజేసి వీరసోదరియును, అభి
మన్యు ఘటోత్కచులకు మాత యగుటంజేసి వీరమాతయుఁ గావున సుభద్రపురా
కృతపుణ్యఫలం బెంతయని గణుతింతు మని కౌరవాంగన లొకరితో నొకరు భాషిం
చుచుం బనుచున్నసమయంబున. 145

సీ. భూసురుల్ గుంపులై పురిఁ బాసి పోవుచు నెక్కడిపెండ్లి వీఁ డేటిరాజు
క్షాత్త్రంబు వర్జించి సమరంబు సేయక యొక్కరక్కసునకై యోడి పారె
వీనిసంభావన వీసమైనను లేదు సూపాన్న మెట్టిదో చూడలేదు
ఆజ్యభక్ష్యంబులు పూజ్యమైపోయెను జాలదెబ్బలు చాల లభ్యమాయె
తే. రాజరా జనుపేరు యీరాజు కేల, ప్రధన మెందుకుఁ గరు లేల రథము లేల
సాధనము లేల వారు లేల సైన్యమేల, యేల నిర్భాగ్యునకు రాజ్య మేల యేల. 146

సీ. అనినకొందఱువిప్రు లసురచే నీరాత్రి చావకుండిన మేలు చాలు చాలు
గుండ్లుదెబ్బలె కదా పెండ్లిసంభావన పదమని చెప్పుచుఁ బరువు లిడఁగ

వారాంగనామణు ల్వగచుచు గుమిగూడి దిక్కు మాలినపెండ్లి దీర్పరాఁగ
ముక్కుఁ గోఁతలు గల్గె నక్కరో యింకేమి గతి యంచుఁ జింతించు కమలముఖులఁ
తే. జూచి యొకబోటి పలికె నోసుందరాంగి, తాళగాఁ డీల్గె సుతికాఁడు ధరణిఁ గూలె
వరుస మద్దెలవాయించువాఁడు చచ్చె, సామజముచేతఁ బులిచేతఁ బాముచేత. 147

క. అని యిట్లు వారవనితలు, దనుజేంద్రునిభీతిఁ దవిలి తత్తరపడుచున్
మును వచ్చినమార్గంబునఁ, జని రందఱు గుంపులగుచు జగతీనాథా. 148

వ. ఇవ్విధంబునఁ గౌరవసైన్యంబునం గలజనంబులు శార్దూలంబుబారిం బడి వెడలుధేనువులమాడ్కి కంఠీరవంబులం గని బెగడుగజంబులపగిది వృకంబులం గనినయజంబులరీతి పలాయనం బగుట వీక్షించి భీష్మద్రోణులవాక్యంబు లుగ్గడించి దీనాననుండై చింతించుచున్న సుయోధనుం జూచి రాధేయుం డిట్లనియె. 149

సీ. మనుజాశనుఁడు పెక్కుమాయలు గల్పించి వారిదంబున డాఁగి వైరులకును
అంగంబుఁ జూపక దొంగపోరొనరించుకతమున జీవించెఁ గాక యెదుట
నిలిచి కయ్యముసేయ నిమిషమాత్రంబులోఁ బంపుదు సంయమిపట్టణమున
కదిగాక వారి పక్షపాతి యైనందున వాసిపోకలు చెల్లె మానవేంద్ర
తే. మనకుఁ గౌంతేయులకు యుద్ధ మొనసినపుడు, పసిఁడిపరయందుఁ జేర్చినపాముతూపుఁ
బెటికి పార్థునిఁ దక్కినధరణిపతుల, క్షణములోపలఁ బరిమార్చి ఋణముదీర్తు.

వ. అదియునుంగాక. 151

క. ఇంద్రజునికొడుకు కోసఁగిన, చంద్రానన తగదు మనకు సరిపోల్పఁగ రా
జేంద్ర మనలక్ష్మణునకును, సాంద్రముగాఁ గలరు చెలులు జగతీస్థలిలోన్. 152

వ. అనిన గృపాచార్యుండు కర్ణునితో నిట్లనియె. 153

సీ. భీమపుత్త్రునిచేతిపెట్టు కోర్వఁగలేక పిఱికివై చనుదెంచి బిరుదుమాడ్కి
రజ్జుకూఁతలు కూసి రారాజునకు లేనియాశఁ గల్పించెద వంతెకాక
ఫాలనేత్రునితోడ బవరం బొనర్చినఁ బార్థుబారిని బడి బ్రతుకవశమె
ఆకిరీటికి నీకు నజగజంబులవలె నమరంగఁ దార్క్ష్యకాకములపగిదిఁ
తే. దారతమ్యంబు తెలియఁగక తప్పుకూఁత, లేల కూసెద వినువారి కింపుగావు
పడమడియుఁ బార్థు లేకమై వెడలినపుడు, వాసవునకైన శక్యమె వారి గెలువ.

క. అనిన విని కర్ణుఁ డిట్లనుఁ, బనికిం గొఱగానియిట్టిపలుకులు పలుకన్
వినువారలెల్ల నవ్వరె, మనుజాధమ నీకుఁ దగదు మఱిమఱి పలుకన్. 155

క. జీవన మొసఁగెడురాజును, దైవముగా హృదయమందుఁ దలఁపక నిరతం
బీవిధమున దూషింపుచుఁ, గావరమున శత్త్రుఁ బొగడుకపటాత్ములకున్. 156

వ. కృతఘ్ను లనునామంబు గలుగు నని రారాజుం జూచి కాసీనుం డిట్లనియె. 157

క. అని మొన గార్ముక మెక్కిడి, ఘనశరములు నారిఁ దొడిగి కౌంతేయులతో
నని చేసినపుడు నన్నుం, గనుఁగొను మిపు డేలచెప్పఁ గౌరవనాథా. 158

క. అన విని కురుపతి కర్ణునిఁ దనతమ్ముల సుతుల హితులఁ దద్దయుఁ బ్రీతిన్
గనుఁగొని కుశలం బడుగుచుఁ, జని తనపురిఁ జొచ్చె రాజు సందడిగొనఁగన్. 159

వ. ఇవ్విధంబున. 160

ఉ. ద్వారకఁ బాసి కౌరవులు తర్లినఁ జూచి ఘటోత్కచుండు కం
సారికి సీరికి న్వరుస సాఁగిలి మ్రొక్కి మహాత్ములార మీ
కూరిమి నాపయి న్నిలిపి కోరినకోరికెఁ దీర్చి బ్రోవుఁ డీ
సారికిఁ బోయివత్తు నని చయ్యనఁ దద్వనసీమ కేఁగినన్. 161

వ. ఆసమయంబున. 162

క. కొక్కులు విదలిచి యీఁకలు, ముక్కునఁ జక్కంగ దీడి ముదమున మోము
ల్నిక్కించి మిన్నుఁ జూచుచుఁ, గొక్కొరొకో యనుచుఁ గోళ్లు గూసె న్వరుసన్.

వ. తదనంతరంబు. 164

సీ. ప్రాగ్దిశాంగన తాల్చు బహురత్నభరితమౌ పదియాఱువన్నెలపదక మనఁగ
దినవిటుం డనువాఁడు దిక్కాంతకును బంపు మణిగణద్యుతుల రాశి యనంగఁ
గరిమె రాలింపుచుఁ గ్రక్కున మకరిపై సారసాప్తుఁడు పంపుచక్ర మనఁగ
గైరికద్యుతు లొలుకఁ ఘనయశోకపుసుమసమితిఁ గూర్చినవరస్తబక మనఁగఁ
తే. దమముఁ దోలుచుఁ జక్రవాకముల కెల్లఁ, బరమసంతోష మొనరించి పద్మములకు
ముఖవికసనంబుఁ గావించి ముద మొనర్చి, యుదయశైలాగ్రమున భానుఁ డుద్భవించె.

వ. ఆసమయంబున ఘటోత్కచుండు హిడింబి సుభద్రలకు సాష్టాంగదండప్రణా
మంబు లాచరించి సౌభద్రుని గౌఁగిటం గ్రుచ్చి తాను పోయివచ్చినవృత్తాంత
బాద్యంతంబు సవిస్తరంబుగా వినిపించిన విని సుభద్ర సంతోషసాగరంబునం దేలి
హైడింబున కిట్లనియె. 166

క. అస్మా నీశౌర్యము నే, నెన్నఁడు వివరించి చూచి యెఱుఁగను నేఁ డీ
కన్నియకై చూచితిఁ, గన్నులకును బండువయ్యెఁ గాదా నాకున్. 167

క. జననీజనకులు నిన్నున్, గని ముదమున నెత్తి పెంచి కడుముక్కువతో
మనిచినఋణంబుఁ బాపెదు, తనయుఁడు మఱి నీవె కాక దానవనాథా. 168

క. పసగలకురుసైన్యమునం, దసహాయులు గలరు వారి నని మొనలోనన్
దెసలకు గదిమితి వౌరా, యసురేశ్వర నీసమాన మవనిం గలరే. 169

క. మీతండ్రిగారు యీవిధఁ మాతతముగ వినినఁ గోర్కి లబ్బె నటంచున్
చేతోమోదము నొందరె, మాతెఱఁగున వార లచట మారుతిపుత్రా. 170

వ. అని మఱియు నిట్లనియె. 171

క. తనయా దీర్ఘాయువు గ, మ్మని తా దీవించుతల్లిమధురోక్తులకున్
దనుబోఁడు మది ముద మందుచు, జననీమణిపాదములకు సాఁగిలి మ్రొక్కెన్. 172

క. ఈతెఱఁగున హైడింబుఁడు, మాతకుఁ దనసోదరునకు మఱఁదలిమదికిన్
బ్రీతి వహిల్లఁగఁ జేయుచు, పీతమనోమలినుఁ డగుచు వేడ్కతో నుండెన్. 173

వ. అని వైశంపాయనుండు మఱియు నిట్లనియె. 174

ఉ. ద్వారకవాసుఁ డై వెలయు దైవశిఖామణి రుక్మిణీమన
స్సారసభానుని న్వికచసారసలోచను మేలుకొల్ప శృం
గారవిలాసముల్ గలుగుకాంతలు భక్తులు రత్నమందిర
ద్వారముచెంగట న్నిలిచి దానవభంజనులీల లెన్నుచున్. 175

సీ. యాదవాన్వయవార్ధి మోదంబు నొందించు మిహిరకిరణప్రాయ మేలుకొనుము
పూతనచనుఁ ద్రావి భూమిపైఁ గూల్చిన మేదినీధరధీర మేలుకొనుము
షోడశాయుతగోపసుందరీలోలుఁ డై మీఱుచారువిహార మేలుకొనుము
గోవర్ధననగంబు గోరక్షణంబు కై కేలఁ దాల్చినదేవ మేలుకొనుము
తే. నీలనీరదరుచిదేహ మేలుకొనుము, ఫాలలోచనసుతశీల మేలుకొనుము
వాలితాకార మాధవ మేలుకొనుము, బాలగోపాల పరిపాల మేలుకొనుము. 176

క. అని యిట్లు మేలుకొల్పిన, విని దిగ్గున నిద్ర లేచి వేగంబున మ
జ్జనశాల కేఁగి యచ్చట, వనితామణు లందియిచ్చువారిం గొనుచున్. 177

సీ. స్నానంబుఁ గావించి సరిగంచుచేలంబు సవరించె తిరుమణి చక్క దిద్ది
తిరుచూర్ణతిలకంబుఁ దీర్చి పిమ్మట కార్యవిధు లొప్పఁగా సల్పి వేడ్క మిగుల
మణిహేమరుచిరమా మకుటంబు వెసఁ దాల్చి విమలవజ్రపుఁగుండలములు పెట్టి
పాకారిమణులచే భాసిల్లుబంగారు భుజకిరీటంబులు పొసఁగ నునిచి
తే. భర్మవసనంబు చుంగులు జారఁ గట్టి, చక్రశార్ఙ్గాదిసాధనచయముఁ దాల్చి
సఖులు తనవెంట నంటిరా సంతసమున, మధ్యకక్ష్యాంతరముఁ జేరె మాధవుండు.

వ. అట్టియెడ బలదేవసాత్యకిగదాక్రూరకృతవర్మోద్ధవాదులును సారణప్రద్యుమ్నసాం
బానిరుద్ధాదికుమారులును దోడచూపినం జూచి దామోదరుండు వారల నుచితపీఠం
బులఁ గూర్చుండ నియోగించి తదనంతరంబ బలభద్రసాత్యకులం బిలిచి సుభద్రా
భిమన్యులఁ దోడ్కొనివచ్చుట కంతఃపురకామినులతోఁ బ్రయాణసన్నాహంబు
సేయుం డనిన వార లాక్షణంబున రేవతీరుక్మిణీసత్యభామాదికాంతల రథంబు
లం జేర్చి తమతమరథంబు లారోహణంబుఁ గావించి రాజమయంబున గోపాల

దేవుండు డెబ్బదిరెండుకక్ష్యాంతరంబులు గడచి యేనుంగుమొగసాలకడ రథం
బెక్కి ప్రయాణోన్ముఖుం డగుచు వెడలుసమయంబున. 179

సీ. కూర్చినముత్యాలగొడుగులనీడచే హంసమండలరశ్మి యడఁగిపోవఁ
చామరంబులఁ బుట్టుచంచద్ఘనానిలంబుచే నీలాంబుదంబులు నింగి కెగయ
వాజిఖురోద్ధూతపాంసుజాలంబుచే భాస్కరుం డద్దంబుభాతిఁ దనర
గజబృంహితఘీంకారఘనవిరావంబుచేఁ బరగ దిక్కరులకు బధిర మొదవ
తే. సమరభీకర మగుసాధనములు పట్టి, శూరభటు లాయుధమ్ముల్ చుట్టు నడువ
వనజనాభుఁడు హైడింబువనముఁ జొచ్చె, ... 180

క. అంతట హైడింబుఁడు తా, నెంతో మది ముదము నొంది యిట్లని పలికెన్
దంతిరథాశ్వభటాళితో, కంతునిగురుఁ డరుగుదెంచు కలకల మదిగో. 181

క. కరుణాకటాక్షవీక్షణుఁ, డరవిందదళాయతాక్షుఁ డరిమర్దనుఁ డా
గరుడతురంగుఁడు శ్రీహరి, మరచునె మనయందుఁ గలుగుమాలిమి తల్లీ. 182

క. అని యిట్లు పల్కుసమయంబున రాముఁడు కేశవుండు ఘోరతరంబౌ
దనుజుని గిరిగహ్వరముం, గనుఁగొని తమరథము లచట గ్రక్కున డిగినన్. 183

వ. ఇట్లు రథావతరణు లగురామకేశవులకు మ్రొక్కి ఘటోత్కచుండు మణిమయం
బైనగుహాప్రదేశంబునకుం దోడ్కొనిపోయి కూర్చుండ నియోగించె నంత సుభ
ద్రయుం జనుదెంచి తదగ్రజులకు సాష్టాంగదండప్రణామంబు లొనరించి యుం
న్నంత రుక్మిణీదేవిమొదలైనకాంతలును ప్రద్యుమ్నాదికుమారులును కృతవర్మాక్రూ
రయుద్ధవాదులును దమతమరథంబులు డిగ్గి గుహాప్రదేశంబునకుం జని కూర్చుండి
రాసమయంబున దీనానన యై యున్న సుభద్రం జూచి దామోదరుం డిట్లనియె.

క. పెద్దన్న పల్కుపల్కులు, ముద్దియ మదినుంచవలదు మమ్మారును నీ
పద్దు జయించెను కోపము, వద్దమ్మా విజయురాణి యోమృదుపాణీ. 185

క. క్షితిభృద్ధైర్యం బొప్పిన, యతులితరణరంగదక్షు లరిమర్దను లీ
సుతులుం గలిగిననీ వీ, గతిఁ బరిచింతింప నేల కమలదళాక్షీ. 186

క. భీమతనూజునిసాహస, మేమని వినుతింతుఁ గౌరవేంద్రుని శకునిం
దామరసాప్తతనూజుని, సామజపురిఁ జేర్చి నింత చాలదె మనకున్. 187

క. నీకోడలు నినుఁ జేరను, నీకోరిక సఫల మయ్యె నిమిషార్ధములోఁ
నీ కేమికొదువ తల్లీ, పాకారికుమారుఁ డాత్మపతియై యుండన్. 188

వ. అని మఱియుం గోవిందుం డిట్లనియె. 189

సీ. అభిమన్యునకు వారిణాక్షికిఁ బరిణయం బొనరించుకోరికె పొడమి యిటకు
నిన్నుఁ దోడ్కొనిపోవ నీలాంబరుఁడు వచ్చె నని పల్కుకౌరియాననముఁ జూచి

భద్రేభయాన సుభద్ర చేతులు మోడ్చి పంకజనాభ యీబలుఁడు నన్నుఁ
బలికినపలుకుల కలిగి పుత్త్రునితోడ రెండుదినంబులు రేయుం బగలు
తే. నడచి యీఘోరవనమున నడవలేక, నలఁతచే నేను నిద్రించునంతలోన
నన్నుఁ దమ్ములభావంబు లరయలేక, ధీరు లీపుత్త్రు లిరువురు పోరిపోరి. 190

క. రోసంబున వీరిరువురు, భాసురకమలాసనాఖ్యబాణంబులఁ జే
రీసున నుపక్రమించిన, వ్యాసమహామునిసింహుఁ డడ్డం బగుచున్. 191

వ. వీరిరువురనడుమ నిలిచి భీమార్జునులకుమారు లని యెఱిఁగించి పారాశర్యుం డంత ర్ధానంబు నొందిన ఘటోత్కచుం డభిమన్యుం గౌఁగిలించుకొని మద్వృత్తాంతం బాద్యంతంబు విని రోషారుణితనేత్రుండై ద్వారకాపురంబునకుం జని శశిరేఖం దెచ్చినాఁ డనిచెప్పి సుభద్ర గోవిందున కిట్లనియె. 192

సీ. ఈభీమనందనుం డింతిఁ దెచ్చిన దొక యొగ్గుగా దోఁచిన నితనిఁ బ్రోవుఁ
డీశశిరేఖాఖ్య యిభరాజగామిని మీరు తోడ్కొనిపొందు మేము పాండు
తనయులు విహరించువనము కేఁగెదము నాసుతున కెచ్చటనైన సుదతి దొరకు
భాగ్యవంతులపుత్త్రి బహుగుల కేలబ్బు ధనవంతు లగుసుయోధనునిపట్టి
తే. కొసఁగి చేసిన సమువియ్య మొప్పు ననుచు, న్యాయనిష్ఠురవాక్యముల్ తోయజాక్షి
పలుక నాపల్కు విని బలభద్రుఁ డాత్మఁ, బుట్టువగపునఁ జెల్లెలి కిట్టులనియె. 193

క. పంకజలోచన దైవము, బొంకించిన బుద్ధి లేక బొంకితి విను నా
బొంకు తిరంబుగ నీవ్రా, త్పంకజమున నిల్పవలదు పార్థునియానన్. 194

సీ. నాకతంబున నీవు నగరంబు నెడబాసి భయదాటవులయందు బాధనొందు
పాపంబు పోవునే పడఁతి నీసుతునకుఁ బొసఁగఁ గన్యాదాన మొసఁగకున్న
నేను బార్థునకు మో మెట్లు చూపుదు నంచు విలపించుహలిఁ జూచి విజయురాణి
యేడ్చిన వీక్షించి యింతులందఱు నేడ్చి రది చూచి ప్రద్యుమ్నుఁ డాదిగాఁగ
తే. సాంబుఁ డనిరుద్ధుఁ డుద్ధవసాత్యకులును, గదుఁడు కృతవర్మ సారణు లన్నుఁగవల
నీరు పెట్టిన వీక్షించి నీరజాక్షుఁ, డూరడింపుచుఁ బార్థప్రియయుం బిదక ననియె. 195

ఉ. చెల్లెల నీవు నీపగిదిఁ జింత వహింపఁగ సీరసాధనుం
డుల్లమునందు నెవ్వగపు నూర్జితమై పెనుపొందువేదనన్
జల్లనఁ గంట నీరిడియె సారసలోచన యీమహాత్ముఁడున్
దొల్లి వచించువాక్యములదోషము లెంచకుమమ్మ వేఁడెదన్. 196

సీ అని యిట్లుపల్కిన హరిపల్కు లాలించి సంతసంబున సవ్యసాచిపత్ని
మాధవ నీవాక్యమధురామృతంబున మదినున్నతాపంబు మానె నాకు

బలభద్రుపుత్త్రి యీజలజారిరేఖను నిచ్చిన మఱియును మీ రివ్వకున్న
మేనమామలు మీరు మేనల్లుఁ డభిమన్యుఁ డన్నలు మీరు నే ననుజ ననుచుఁ
తే. కరయుగంబును ముకుళించి పరమభక్తి, వారిజోదర గోవింద వాసుదేవ
సుందరాకార గోపికాబృందలోల, పన్నగాశనకంఖాణ పరమపురుష. 197

వ. అని సుభద్ర బలభద్రుం జూచి యిట్లనియె. 198

క. నేరిచి నేరక చేసిన, నేరంబులు మఱచి నన్ను నెనరూరంగా
భూరికృపన్ రక్షింపవె, సీరాయుధ యంచుఁ బల్కుఁ జెల్లెలితోడన్. 199

క. బలదేవుఁ డనియెఁ దల్లీ, తలఁపఁగ నీయందుఁ గలదె తప్పరయంగాఁ
దెలియక మూర్ఖత నిన్నుం, బలికినయాతప్పు నాది పద్మదళాక్షీ. 200

క. పురికిం జనుదెంచెద నని, కరివరదుం డాలకింప గ్రక్కున నాకున్
వర మొసఁగు మనిన విని యా, సరసిజముఖి పార్థురాణి సంతోషిత యై. 201

క. ఉన్నయెడ రాముపత్నియు, వెన్నునిసఖు లరుగుదెంచి వినుము సుభద్రా
పన్నగమృగవినివేశముఁ, బిన్నగముల సంచరింప నెందుకు దల్లీ. 202

వ. అని మఱియు నిట్లనిరి. 203

సీ. పురుషోత్తమునితోడఁ బుట్టువై భీభత్సువనిత వై యీఘోరవనమునందు
తల్లిదండ్రులఁ బాసి తనయునితో నీవు గాసిఁ బొందఁగ నేల కమలనేత్ర
బలభద్రుఁ డత్యంతభక్తిఁ దోడ్కొనిపోవ వచ్చెవాఁ డింక నీవగపు మాను
మెక్కడ లక్ష్మణుం డెక్కడ శశిరేఖ కాలిగోరునుసాటి బోలఁ డతఁడు
తే. చూడ వీరిద్దరకు నీడు జోడు గాక, యిభపురేంద్రునిపట్టికి నీడుగాదు
సుదతి శశిరేఖ యభిమన్యుసొమ్ముగాని, యితరులకుఁ దక్కనేర దిందువదన 204

క. అని యిట్లు వదినె లందఱు, మునుకొని భీభత్సుసతిని ముద మొనరింపన్
వినయోక్తులు పల్కిన విని, కనకాంగి సుభద్ర వారిఁ గౌఁగిటఁ జేర్చెన్. 205

వ. ఇట్లు కౌఁగిలించికొన్న సుభద్రం జూచి మఱియు నిట్లనిరి. 206

సీ. గహనసీమకు నీవు కదలినదాదిగా రాకేందుముఖి నిద్ర రాదు మాకు
అనిపల్కినంతలో నలివేణి యొక్కతె చనుదెంచి వినవమ్మ సారసాక్షి
యడవి కేఁగినవార్త లాలించినది మొద లాహార మింపుగా దనుచుఁ బలికె
వెండియు నొకబోటి విజయుపత్నిని జూచి చూచితె రారాజుసుతునిరూపు
తే. వావిరూపంబు తుడిచెఁబో వారిజాక్షి, వాయుసూనునిసుతుఁ డింతసేయకున్నఁ
బోలఁతి శశిరేఖ వ్యర్థమై పోవునమ్మ, కుక్క ముట్టినకుండ యై కుందరదన. 207

తే. అని వచించినవారిజాననలఁ జూచి, యలసుభద్రయు సంతోషజలధిఁ దేలి
యతిశయంబగుభక్తితో నతు లొనర్చి, వదినెగారికి నత్యంతముద మొనర్చె. 208

సీ. ఆసమయంబునం దలివేణి శశిరేఖ చనుదెంచి జనకులచరణములకు
మ్రొక్కి నిలచిన తనముద్దుపుత్త్రినిఁ జూచి బలభద్రుఁ డానందభరితుఁ డగుచు
నాపుత్త్రి నాకూన నరభోజనుఁడు నిన్నుఁ దెచ్చినప్పుడు నెంత దిగులుపడితో
మముఁ బాసి యీవనమధ్యదేశంబున నెట్లు నిద్రించితో యిందువదన
తే. శుభకరంబుగ నిను పార్థసుతున కిచ్చి, సిరులు విలసిల్లఁగాఁ బెండ్లిసేతు నను చుఁ
బలుకుపలుకులు విని వచ్చి పార్థసుతుఁడు, హాలికి హరికిని సాష్టాంగ మాచరించె.

వ. ఇట్లు సాష్టాంగనమస్కారంబు లొనరించిన సౌభద్రుం జూచి యత్యంత సంతో 210
షంబుతో నీలాంబరుండు తనమనంబున నిట్లని వితర్కించె.

సీ. కంతుజయంతనలకూబరుల హసించు పరుస శృంగారంబు లరసిచూడ
శరజన్మగాంగేయజామదగ్న్యులఁ గేరు ఘనపరాక్రమశస్త్రకౌశలముల
అనిలనాగాంతకయమీరాజుల హసించు పటుతరం బగుబాహుబలమునందు
సద్బృందపూర్ణేందుచౌదంతులను గేరు భాసురం బగుకీర్తిపటిమలందు
తే. అహహా యిటువంటియల్లుని నడవి కనిది, కురునరేంద్రునిపుత్త్రునిఁ గోరినట్టి
బేలతనమును దనుఁ దాని తూలనాడి, భూరిబలుఁ డైనహైడింబుఁ బొగడి పొగడి.
212
వ. తననహోదరుఁ డైనగోవిందుం జూచి హాలాయుధుం డిట్లనియె.

ఉ. ద్వారక కేఁగుయత్న మిఁక దానవభంజన సేయవే యనన్
వారిజనాభుఁ డాక్షణమె వాయుసుతాత్మజుఁ జూచి వత్స నీ
భూరిపరాక్రమక్రమముఁ బూని నుతింపఁగ శేషుఁ డోపునే 213
ధారుణిఁ బాండుసూనులకు దైత్యశిఖామణి కీర్తిఁ దెచ్చితే.
214
వ. అని మఱియు నిట్లనియె.

క. దుస్తర మగుకార్యంబులు, నిస్తులశౌర్యంబుచేత నెరవేర్చితని
215
ప్రస్తుతి సేయఁగ బ్రహ్మకు, శక్తిగదా భీమపుత్త్ర ఘననిభగాత్రా.
క. అనుచు నిర్వైవాహికముం, గనుఁగొనఁగా రమ్ము లెమ్ము గ్రక్కున ననిన 216
న్వీని కరములు ముకుళింపుచు, దనుజారికి నిట్టులనియెఁ దద్దయు భక్తిన్.

సీ. అప్పటప్పటికి నన్గొప్ప సేయఁగ నేల పాటించి వినుము నామాట యొకటి
అసురారి నీకృపారసము నాపై నిల్చుకతమున శాత్రవు ల్కదనమందు
కృశులై నాచేత నపజయంబు బొందిరి అదిగాక పాండవు ల్విదితయశులు
నిను నమ్మి మిక్కిలి ఘనులైరి మాధవ యని పల్కి సాష్టాంగ మాచరించి
తే. బిడ్డ నర్పించి సౌభద్రుఁ బెండ్లిసేయఁ, బాటువడువారు మీరుండఁ బద్మనాభ 217
నేను రాకున్నఁ గార్యంబు నిలువనేర, దనిన విని పార్థనందనుం డాత్మఁ గుంది.
తే. అన్న రాఁడని చింతించునతనిహృదయ, మెఱిఁగి గోవిందుఁ డసురేంద్రు కరముఁ బట్టి
భీమసుత నీవు రాకున్నఁ బెండ్లి యేల, నను చుఁ జింతింప నీకమ్ముఁ దదిగొ చూడు.

క. అనిన విని దానవేంద్రుఁడు, తనతమ్ముని మోముఁ జూచి తమ్ముఁడ నీతోఁ
జనుదెంచెదఁ జింతింపకు, మని వెండియు నిట్టు లనియె నభిమన్యునితోన్. 219

సీ. జనకు లడవి నున్న సమయంబులో నీకుఁ బరిణయం బిపుడు సంప్రాప్తమయ్యె
తమ్ముఁడ నీభాగ్యదశ యేమిచెప్పుదు ననుచుఁ గన్నుల నీరు నతఁడు రాల్పఁ
జూచి పార్థునిరాణి జోటజోటఁ గన్నీరురాల్చిన వీక్షించి రమణు లెల్లఁ
బొక్కుచు విలపింపఁ బురుషోత్తముఁడు చూచి చెల్లెల నీవిట్లు చింత సేయఁ
తే. గారణం బేమి వినవమ్మ కంబుకంఠి, సమయకాలంబు గడచిన యమతనూజుఁ
డాదిగాఁ గలపాండవు లరుగుదెంతు, రిపుడు శుభకార్య మెడసేయ నెందుకమ్మ.

క. అని గోవిందుఁడు పల్కిన, విని సోదరి వగపు మాని వేఱొక టనకన్
తనమది సంతసమందుచు, తనయులమదిఁ జింతబాపె ధరణీనాథా. 221

సీ. అంత ఘటోత్కచుం డత్యంతసంతోషసహితుఁడై బలకృష్ణసాత్యకులకు
వారిభార్యలకును వరుస యాదవవీరవరులకు మఱి వారివనితలకును
దివ్యభూషణముల దివ్యాంబరంబుల దివ్యగంధంబుల దివ్యకుసుమ
ములను బూజలు సేసి ముదముతో మ్రొక్కిన భీమపుత్త్రునిఁ జూచి పెద్దప్రొద్దు
తే. నతఁడు చేసినసాహసం బాత్మ మెచ్చి, యోఘటోత్కచ వినుము ఈయుర్వియందు
ఘనుఁడవై వేయువర్షముల్ మనుమటంచు, వరుస దీవించి రప్పుడు వసుమతీంద్ర.

వ. ఆసమయంబున. 223

సీ. కమలాక్షుఁ డాఘటోత్కచునిఁ గైదండచేఁ దనరథం బెక్కించుకొనియె నపుడు
బలభద్రుఁ డంత సౌభద్రసహితుఁడయి రథ మెక్కెఁ దక్కినరథికవరులు
తమతమరథములు తా మెక్కి తఱిఁ గాంత లందఱు గుమిగూడి యాహిడింబి
మోము వీక్షింపుచు ముసిలిముత్తైదువ రమ్ము రమ్మని పిల్చి రథముఁ జేర్చి
తే. వారు తమతమయరదము లవ్వరుస నెక్కి, రంత బలరామకృష్ణు లాయడవిఁ బాసి
కడుజవంబున రథవారు లరులు నడువఁ, బుడమి గంపింప ద్వారకాపురముఁ జేరి.

వ. ఏనుంగుమొగసాలకడ రథంబులు డిగ్గి నగరు ప్రవేశించి రామకృష్ణులు జననీజన
కులకు మ్రొక్కుసమయంబున సుభద్రాభిమన్యుఘటోత్కచు లరుదెంచి దేవకీవసు
దేవులకు మ్రొక్కినం జూచి దేవకీదేవి సుభద్ర కిట్లనియె. 225

క. పాపనిఁ దోడ్కొని వారిపైఁ, గోపంబున భీమ మైనఘోరాటవికిన్
ఏపగిదిఁ బోతివో గద, మాపైఁ గలమమత మాని మాపటివేళన్? 226

క. పన్నగమృగములఁ గనుఁగొని, పెన్నగములఁ గాంచి మదికి భీతి జనింపన్
వెన్నుని నన్నుఁ దలంచితొ, పున్నమశశితుల్యవదన పొక్కుచు మదిలోన్. 227

వ. అని మఱియు నిట్లనియె. 228

సీ. కాంతారమున నిన్నుఁ గామపాలుఁడు కల్కి పలుకులు మది నిల్పవలవదమ్మ
ఇందీవరాక్షి మీ రితరులు గారు యీ వాలసాధనుం డన్న యనుజ నీవు
నెలతరో నీసొమ్ము నీయిల్లు చేరెను బ్రీతితో సుతునకుఁ బెండ్లిచేసి
నేఁడాదిగా నీవు నీకుమారుండును వెనుపొందుసిరులతో మనుఁ డటంచు
తే. దేవకీదేవి పార్థునిదేవిహృదయ, సంకటముఁ బాపి యభిమన్యు సంతసమునఁ
బెంచుదువ్వుచు ముద్దాడి సొంపు మిగుల, నిందు వేడుక మిన్నందుచుండె నపుడు.

క. అని చెప్పిన ముదమందుచు, జనమేజయుఁ డిట్టులనియె సన్మునినాథా
వినవిన నామదిఁ గోరిక, ఘన మయి తనరారె నవలికథ యెట్లనినన్. 230

మత్తకోకిల. వారిజాసనపంకజాసనవందితా నతపోషణా
ధారుణీధరతల్ప కేశవ దానవాన్వయశోషణా
నారదాదిమునీంద్రసన్నుత నాగభుగ్వరవాహనా
నీరజాక్ష కళింగమర్దన నీరదాంగ జనార్దనా. 231

గద్య. ఇది శ్రీమత్సూర్యనారాయణకరుణాకటాక్షవీక్షణాలంకార సుస్థిరామృతవాక్య జనితకవిత్వరత్నాకరవంశ పయఃపారావార రాకాసుధాకర రాంజనేయాఖ్య తనూజ అప్పప్పనామధేయప్రణీతం బైనశశిరేఖాపరిణయం బనుమహాప్రబంధంబునందుఁ జతుర్థాశ్వాసము.

పంచమాశ్వాసము.

రాధాధరపరిమళ
సారామృతపానలోల సజ్జనపాలా
చారుమనీషాలోలా
సారసభవవినుతశీల స్వర్ణసుచేలా. 1

వ. అవధరింపుము సూతుండు శౌనకాదిమహామునులకుం జెప్పినట్లు వైశంపాయనుండు
జనమేజయున కిట్లనియె. 2

ఉ. సిరియుఁ జక్రియుం జెలఁగి చెల్లెలిసూనువివాహయత్నులై
చారులఁ బంచి పట్టణముఁ జయ్యన సుందర మొప్పఁజేసి బల్
సారసుగంధపుష్పముల సంగ్రహము౯ దగఁ జేయుఁ డంచు నా
కారుణికోత్తము ల్పలుక గ్రక్కున నేఁగిరి తత్ప్రియాత్ములై. 3

సీ. ఆసమయంబునం దమరమునీంద్రుఁడౌ నారదుఁ డాత్మలో నవ్వుకొనుచు
నలఘుఘటోత్కచుశౌర్య మందందఁ దలచుచు నింపుగా వీణె మ్రోయించుకొనుచు
సారసాక్షుని దివ్యసంకీర్తనంబులు తోడిరాగంబుతోఁ బాడుకొనుచుఁ
బార్థపుత్త్రుని పెండ్లి బహువైభవంబుగాఁ జెలఁగుమార్గం బేను జేతు ననుచు
తే. గుమగుమపరుపునఁ బోవుచు గోపురంబుఁ
గాంచి కాంచనవజ్రసంకలితమైన
మేటిమొగసాల గోపురాద్దాఁటిపోయి
విమలమైనట్టి యింద్రనీలముల చేత
దంబుమీఱిన కొలువుకూటంబుఁ జేరి. 4

సీ. కపిలమార్కండేయకౌశికజాబాలిమైత్రేయపర్వతమందపాల
కణ్వకుత్సవసిష్ఠకౌండిన్యవరతంతుజామదగ్నియగస్త్యశౌనకాత్రి
భార్గవగార్గేయపైలకశ్యపపుల్హగాలవహారిదశ్వవాలఖిల్య
శుకమతంగవ్యాసబకదాల్భ్యమంకణకౌండిల్యుఁ డాదియౌ సకలమునులు
తే. ధనదుఁ డనిలుండు నీశాన్యుఁ డనలుఁ డాది, సురలు యక్షులు కిన్నరు ల్చుట్టుఁ గొలువ
నర్జునునితోడ నేకసింహాసనమున, నింపు గొలువున్న దేవకీనేతఁ గాంచె. 5

వ. ఇట్లు గాంచి యేతెంచునారదుం జూచి సుపర్వాధిపుం డర్జునసమేతంబుగా నెదురు
వచ్చి సాష్టాంగదండప్రణామంబు లాచరించి లోపలికిం దోడ్కొనిపోయి సింహాస
నాసీనుం జేసి సహస్రాక్షుం డి ట్లనియె. 6

క. మునిసార్వభౌమ మీరున్, జనుదెంచిన నాదుపుట్టు సాఫల్యంబై
దనరారె ననుచు వెండియుం, వినయంబున నిట్టు లనియె విబుధేశ్వరుఁడున్. 7

సీ. మాయజూదంబున మహి నెల్లఁ గోల్పోయి ద్వైతవనంబులో ధర్మజుండు
తమ్ములతోఁగూడ ద్రౌపదీసహితుఁడై ఘోర లశనముగఁ గుడుచు వేళఁ
బార్థుఁ డథవుతోడఁ బందికై పోరాడి పాశుపతాస్త్రంబుఁ బడసి మఱియుం
దిక్పాలకులచేత దివ్యాస్త్రములు కొన్ని దక్క మందెవ నందుఁ దలఁచి వచ్చె
తే. దేవమానీంద్ర వినుము పెక్కుదినము లయ్యె, ధర్మజాదులవిధ మేమొ దుర్మదాంధుఁ
డాసుయోధనుఁ డదయుఁడై యాచరించు, దప్పునను లేమొ వివరించిచెప్పుమనిన. 8

క. నావిని మునిశంకరుఁ డా, దేవేశునిఁ జూచి పలికె దివిజాధిప స
ద్భావముతో నీ వడిగిన, యావిధ మెఱిఁగింతు వినుఁడు అర్జునుఁ డీవున్. 9

సీ. పార్థపుత్రున కిచ్చు బలభద్రుపుత్త్రిని మందుఁ డో రారాజనందనునకు
నడిగి రమ్మని ధరామరులఁ బంపిన వారు పోయి శాలాంతకునిపుత్త్రి నడుగ
నిచ్చెద నని మాట నిచ్చిన విని వచ్చి వెంది సుభద్ర తా వేఁడుకొనిన
తోఁడఁబుట్టును బెక్కుదుర్భాష లాడినఁ గోపించి యాయమకొడుకుతోడ
తే. వెడలి మిక్కిలి భయదమౌ నడవిఁ జొచ్చి, రపుడు సౌభద్రుఁ డాఘటోత్కచునితోడ
సమర మొనరింప సంతలో నస్సునీంద్రుఁ, డలపరాశరనందనుం డరుగుదెంచి. 10

సీ. భీమార్జునులు గన్నబిడ్డలు మీరంచుఁ బల్కఁగా విని భీముపట్టి వచ్చి
పిన్నతల్లికి మ్రొక్కి పిమ్మటఁ దమ్మునిన్ గౌఁగిటఁ గదియించి గారవించి
ఘనభయంకరమైన వనభూములకు మీరు నేతెంచుటకు నేమిహేతు వనిన
విని సుభద్రాదేవి వివరించి చెప్పఁగా దానవుం డుగ్రుఁడై తత్క్షణంబ
తే. ద్వారవతి కేఁగి శౌలాంతకతనుజఁ దెచ్చి, తనవనంబున ముదముతోఁ దరుణి డించి
మరలఁ జని తా శశిరేఖమాడ్కి నుండి, లక్ష్మణునిగంతు వేయించి రాక్షసుండు.

వ. అంతటం బోక నాఘటోత్కచుం డనేకరూపంబులు దాల్చి దుర్యోధనాది కౌర
వుల కపజయం బొనరించినం జూచి బలరాముం డాదానవుని జయింపం జని యలవి
గాక దామోదరుం దోడ్కొనివచ్చి సౌభద్రునకు శశిరేఖ నొసంగెద మని రామ
కేశవులు ఘటోత్కచువనంబునకుం జని సుభద్రాభిమన్యులఁ దోడ్కొనిపచ్చి సౌభ
ద్రునకు వివాహప్రయత్నంబు నిశ్చయంబు జేసి రని చెప్పి నారదుండు బిడౌజుం
జూచి మఱియు నిట్లనియె. 12

క. మనుమని వైవాహికమున్, గనుఁగొన దేవేంద్ర నీవు కడువిభవముతో
తనయుఁ డగుపార్థుఁ దోడ్కొని, చను మని వినిపింప సవ్యసాచికి మదిలోన్. 13

సీ. ముందుగాఁ దనపత్ని నిందించె నని చెప్ప రాజితంబై తోఁచె రౌద్రరసము
కొడుకుతో నిశివేళ నడవి కేఁగె నటన్న గణ్యమై తోఁచెఁ గారుణ్యరసము
అభిమన్యుఁ డసురేంద్రుఁ డనిచేసె ననిచెప్ప బహుచిత్రముగఁ దోఁచె భయదరసము
అసురేంద్రుఁ డంగనాకృతి నుండె నని చెప్ప ధుర్యమై తోఁచె నాశ్చర్యరసము
తే. ఇంతిఁ గని లక్ష్మణుఁడు గంతు వేసె ననిన, నాకిరీటికిఁ దోఁచెఁ బో హాస్యరసము
మెచ్చి రాముఁడు ననుజుఁ దోడ్తెచ్చె ననిన, సలలితంబుగఁ దోఁచెను శాంతరసము.

వ. ఇట్లర్జునుండు శాంతాత్ముం డగుచుఁ దనకుమారునివివాహంబు వీక్షించువాఁడై
యోచించుచున్నసమయంబున నారదుం జూచి సుపర్వాధిపుం డిట్లనియె. 15

ఉ. దేవమునీంద్ర మంచిపని తెల్పితి రాత్మకు మోద మబ్బె రా
జీవదళాక్షునిన్ దివిజసేవితమూర్తిని జక్రపాణి శ్రీ
దేవుని దానవాంతకుని దీనదయాళునిఁ జూచుకోర్కె నై
రావత మెక్కి పోదు యదురాజులవీటికి దేవకోటితోన్. 16

క. అని మఘవంతుఁడు పార్థుం, గనుఁగొని సౌభద్రు పెండ్లిఁ గనుఁగొను వేడ్కన్
వనజదళాక్షుని పురికిం, జనవలెఁ బయనంబు గమ్ము చయ్యనఁ బుత్రా. 17

సీ. అనిపల్కు నిర్జరాధిపుఁ జూచి విజయుండు వాసవ యిఁది వనవాసవేళ
గనుక నేవచ్చినఁ గౌంతేయపూర్వజుం డనుమానపడు ధర్మహానికొఱకు
అని సంశయగ్రస్తుఁ డైనపార్థునిమదిసంశయం బెడబాపి శతమఖుండు
పత్నీసమేతుఁడై పార్థజయంతాదితనయులతోడఁ జౌదంతి నెక్కి
తే. కనకమణియుక్త మగుపుష్పకములమీఁద, సురలు మౌనీంద్రులెల్లను జుట్టు నడువ
నలిముదంబున రంభాదిసతులు గొలువ, వనజనాభునిపురి కేగె వాసవుండు. 18

వ. ఇట్లేఁగి ద్వారకాపురిసమీపవనంబున నిలిచి దేవదూతం బంపిన వాఁడుం జని రామ
కేశవులం జూచి పురందరుండు శచీసమేతంబుగా జయంతార్జునులతో నేతెంచినాఁ
డనిన విని వార లత్యంతసంతోషంబునం బొదలుచుండి రంత రుక్మిణీదేవి మొదలైన
కాంత లాసుభద్రం జూచి తల్లీ! నీకోరికప్రకారంబున బార్థుం డరుదెంచె నని
పల్కుసమయంబున రామకృష్ణులు పుత్రమిత్రాదిబాంధవులతో జననీజనకులతో నభి
మన్యుఘటోత్కచులతో రేవతీ రుక్మిణీ సత్యభామాది కాంతలతో నెదురేఁగి వారి
వారికిం దగినయుపచారంబులు సేయుసమయంబున. 19

సీ. హైడింబుఁ డభిమన్యుఁ డరుదెంచి పార్థునిచరణంబులకు భక్తి సాఁగి మ్రొక్కి
ముకుళితహస్తులై ముంగిట నిలిచిన ముద్దుపుత్రుల జూచి పెద్దప్రొద్దు

కాంగిటఁ గదియించి గ్రక్కునఁ దొడలపై నిడుకొని వారితో నిట్టులనియె
అన్నదమ్ములపుత్త్రు లని యెఱుంగక మీరు భూరిరోషంబుతోఁ బోరి పోరి
తే. వరమునీంద్రు నిక్కృపచేత వసుధ యందు, బ్రతికితిరి మిమ్ముఁ జూచెడిభాగ్య మబ్బె
నని ఘటోత్కచు వీక్షించి యర్జునుండు, పరమసంతోషభరితుఁడై పలికె నపుడు.

ఉ. పోరున ధార్తరాష్ట్రులకు భూరిమదం బడఁగించి పిమ్మటన్
సీరికి మిక్కిలిన్ భయము చెందఁగఁ జేసిన నీపరాక్రమం
బౌర! నుతింప వ్యాళపతి కైనను శక్యము కాదటంచు నా
మారుతిపుత్త్రునిం బొగడి మక్కువతోడఁ గిరీటి యంతటన్. 21

క. పరమపరాక్రమపుత్త్రుల, మఱిపంబున వాసవునకు మ్రొక్కించినచో
సురపతి సంతోషితుఁడై, కర మరుదుగఁ జూచె వేయుఁగన్నులతోడన్. 22

వ. తదనంతరంబ సహస్రాక్షుండు రామకేశవులం జూచి భవద్దర్శనార్థంబుగా ముని
బృందారకాదిసంఘంబులతో నర్జునసమేతంబుగా నేతెంచితిమనిన గోపాలదేవుం
డిట్లనియె. 23

క. పురుహూత సురమునీశ్వర, పరివృతుఁడై శచిసమంత పార్థాదులతోఁ
గర మరుదుగఁ జనుదెంచుట, పరముగ మా కింతకంటె భాగ్యము కలదే. 24

క. అని యిట్లు వెన్నుఁడాడిన, విని మది ముదమొందఁ జూచి వేల్పులదొర యా
వనజదళాక్షుని కిట్లను, దనుజాంతక మిమ్ముఁ జూడ ధన్యుఁడ నైతిన్. 25

క. అని యి ట్లమరాధిపుఁడున్, వనజాక్షుఁడు పల్కువేళ వాసవి వేడ్కన్
తనపతియొద్దకు నేఁగిన, ఘనవేణి సుభద్ర పార్థుఁ గనుఁగొని భక్తిన్. 26

వ. సాష్టాంగదండప్రణామంబు లాచరించి యుధిష్ఠిరభీమనకులసహదేవాదిపాండవులను
ద్రుపదరాజపుత్త్రి యైన ద్రౌపదిం గుశలసమాచారంబు లడిగి పెన్నిధిం గనిన పేద
చందంబున సంతోషమగ్నమానస యై యుండె నప్పుడు. 27

సీ. అచ్యుతుం డాసురేంద్రాదులఁ దోడ్కొని పోయి వారల నెల్లఁ బొంకమైన
మందిరంబుల డించి మర్యాద లొనరించి యింద్రాణితోఁ గృష్ణుఁ డిట్టులనియె
పరిణయోత్సవకార్యపద్ధతుల్ జరిగింపు మన విని పౌలోమి యాత్మ నలరి
పార్థనందనునకుఁ బన్నీట జలకంబు గావించి దేవయోగ్యంబు లైన
తే. అంబరంబులు మణిభూషణములు దాల్చి, ముదముతోఁ బారిజాతముల్ ముడిచి మఱియు
దివ్యమైనట్టి కస్తూరితిలక మొప్పఁ, దీర్చె సఖులెల్ల వేడ్కతో దేవమాడ.

వ. అట్టిసమయంబున.

సీ. ముదముతో రుక్మిణిమొదలైనకాంతలు రేవతీసుత చంద్రరేఖ కెలమి
తలనంటి నలుగిడి తరువాత పన్నీట జలకంబు గావించి సరిగెపూల

చేలంబు ధరియించి లోలలోచన కురుల్ దువ్వి మేల్రాణి తొలుతఁ బెట్టి
కెంపులు నించెనకేడిగె వెసఁ జేర్చి కొమరొప్ప నవరంపుఁగుప్పెఁ బెట్టి
తే. నిమునశైల జగ్గు వెంట్రుకల్ జడ నమర్చి, చెక్కడపుపసుంబిళ్లలు చెక్కి మఱియు
భాసురం బైనబొగడలు బావలీలు, నతులవజ్రాలకమ్మలు శ్రుతులఁ జేర్చి. 30

తే. రంగు లమరినపైఠణీరవికఁ దొడిగి, యాణిముత్యాలకూర్చినసరముఁ దాల్చి
సరిగెముక్కరయును బన్నసరము తీగె, మొదలుగాఁగలసొమ్ములు పదిలపరచి. 31

తే. రమణు లీరీతి వేడ్కతో రామసుతను, పరమశృంగార మొనరించి పరిణయంపుఁ
బడఁతిఁ గావించి ప్రీతితోఁ బద్మముఖులు, సంతసిల్లుచు విహరించుసమయమునను.

క. సురపతి గని వాచస్పతి, సురుచిర మగులగ్న వేళఁ జొచ్చె నటన్నన్
పరమామోదము నొందుచు, పురుహూతుం డిట్టులనియెఁ బురుషోత్తముతోన్. 33

చ. పరిణయవేళ వచ్చె నిఁకఁ బంకజలోచన జాగుసేయకన్
త్వరితము సేయు మంచు మఘవంతుఁడు చెప్పిన నాలకించి య
మ్మురరిపుఁ డన్నకుం దెలుప మోదము నొందుచు సీరసాధనుం
డురుతరవైభవం బెసఁగ నుత్సవయత్నము సేయుచుండఁగాన్. 34

సీ. ఇంద్రనీలప్రభ లీనుభూషణరుచుల్ చూడ్కికి మిరుమిట్లు జొనుపునదియుం
పద్మరాగంబుల భాసిల్లుపదకంబు తప్ప కనుదుటిపై నొప్పునదియుం
హాటకమణిమయం బగునూపురధ్వనుల్ శ్రుతుల కానందంబు సేయునదియుం
హిమగిరిశరదిందు హీరతారద్యుతు ల్నిరసించు కాంతుల నెగడునదియుం
తే. నాల్గుకొమ్ముల విలసిల్లు నాగ మపుడు
దేవవిభునాజ్ఞ దివిజులు తెచ్చి నిలుప
నిందుఁ డభిమన్యు నెక్కించి హితులు సుతులు
వెంట నమువంగ ముదముతో వెడలి రపుడు. 35

వ. రంభోర్వశీమేనకాదికాంతలు నాట్యంబుసేయుచు ముందు నడువఁ గాంచనవేత్రహస్తులు బరాబరు లొనరించుసమయంబున. 36

ఉ. అంతట రామకేశవు లవార్యతితేజు లరాతిభీకరు
లనంతసచిత్తులై సుతులు సఖ్యులు తమ్ములు భూసురేంద్రులున్
ఇంతులు వెంబడి న్నడువ నింద్రకిరీటులు తోడరాఁగ న
త్యంతముదంబుతోఁ బరిణయాలయసీమకు నేఁగి రప్పుడున్. 37

క. బలరామపత్ని రేవతి, బలభిత్సుతుసతిని జూచి బహువేడుకతోఁ
గలకాలము నామదికిన్, గలకోరిక ఫలిత మయ్యెఁ గమలదళాక్షీ. 38

వ. అని యిట్లు రేవతీదేవి సుభద్రతో నన్యోన్యసంభాషణంబులు సేయుచుండె నాసమ
యంబునం దొకరికొకరు క్షేమసమాచారంబు లడుగుచు గంధపుష్పంబు లొసంగు
చున్నతఱి సైనేయుండు ఘటోత్కచుం దిగిచి కౌఁగిలించుకొని సరససంభాషణం
బుల నాదరించె నప్పు డప్పురజనంబులు బకాంతకతనూజుం జూచి వానిసాహస
ధైర్యాదిగుణంబు లగ్గించుచు నిట్లని రమరేంద్రాదిబృందారకులం గనుఁగొంటి మింత
కంటెను భాగ్యంబు గలదే యిట్టికార్యంబులు గావింపఁ గౌంతేయులకుం జెల్లుఁ
గాని యితరులచేత నగునే యని పలుతెఱంగులఁ బలుకుచుండి రాసమయంబున. 39

సీ. అంతఁ బౌరోహితు లత్యంతముదముతోఁ జక్కఁగా స్వస్తివాచనము లెసఁగఁ
జదువ ముత్తైదువల్ సంతోషచిత్తులై పరమకల్యాణము ల్పాడుచుండ
వందిమాగధులు కైవారముల్ గావింప నుర్వీగీర్వాణు లాశీర్వదింప
నాకాంగనామణు ల్నాట్యము ల్గావింపఁ దాళమర్దలవాద్యతతులు చెలఁగ
తే. విమల మైనట్టికల్యాణవేదిఁ జేర, నరిగినప్పుడు మాధవుం డమరవిభుఁడు
తెరకు నిరుపార్శ్వముల నిల్చి రిరువు రెలమి, నిండువేడుకమిన్నందుచుండి రపుడు.

క. సురపతిపౌరోహితుఁడున్, మురవైరిపురోహితుండు ముద మలరంగా
నిరుపుర గోత్రాన్వయములు, సిరు లలరఁగఁ జెప్పవేళ సీరాయుధుఁడున్. 41

వ. సంతోషమగ్నమానసుండై యప్పుడు. 42

క. క్షత్త్రియకులశేఖరునకు, ధాత్రీధరధైర్యధుర్యధనునకు రిపురా
డ్జైత్రుఁ డగుపార్థుకెలమిన్, పుత్త్రీమణి నొసఁగె సురలు భూసురు లలరన్. 43

వ. అప్పు డవ్వధూవరులమధ్యంబునం దిడిన తెర వంచి రాసమయంబున. 44

క. అభిమన్యుఁ డింతిఁ జూచెన్, ఇభగామిని యతనిఁ జూచె నిరుపురచూడ్కుల్
ప్రభ లొప్పభూషణములై, యుభయులకుం దోఁచె నపుడు నుర్వీనాథా. 45

క. అంగజసముఁ డభిమన్యుం, డంగనకంఠంబునందు నతివేడుకతో
మంగళసూత్రముఁ గట్టెఁ ద,దంగన ముదమందఁ బార్థుఁ డానందింపన్. 46

క. అత్తఱి వేడ్క వధూవరు, లెత్తినకరకంకణంబు లినరుచు లీనన్,
ముత్తెముల దోయిటను నిడి, చిత్తము లలరంగఁ బ్రాలు శిరముల నిడఁగాన్. 47

వ. ఆసమయంబున సీరాయుధుం డవ్వధూవరుల కనేకమణిమయంబు లగుభూషణం
బులును పట్టుపైణీచేలంబులును త్రిసహస్రతురంగంబులును జతుస్సహస్రదాసీ
జనంబుల నొసంగె నంబుజాక్షుం డాఱువేలరథంబులును ద్విలక్షతురంగంబులను
మూఁడువేల గజంబులును లక్షపదాతిజనంబుల నొసంగె దేవేంద్రుండు దేవ
యోగ్యంబు లైనభూషణాంబరంబులను నవగంధపారిజాతంబుల నొసంగె శచీ
దేవి యింద్రనీల ప్రభాభాసితంబు లైనభూషణంబు లిచ్చె ఘటోత్కచుండు

కనకకిరీటాదికుండలంబు లొసంగెఁ దదనంతరం బవ్వధూవరులఁ బౌరోహితం
డౌదుంబరపీఠంబునఁ బ్రాఙ్ముఖాసీనులం గావించి సౌభద్రునిచే నాజ్యపూరంబులు
వేల్పించి పిదప హోతృనకుఁ బ్రదక్షిణంబు చేయించి ధ్రువాదిసప్తఋషుల నరుంధతి
దర్శనంబు గావింప నియోగించి తత్పౌరోహితుం డయ్యుదుపురను బృహస్పతికి
మ్రొక్కించి తదనంతరంబ నారదాదిమునీంద్రులకు భూసుర సమూహంబునకు సురేం
ద్రాదిదేవతలకు రామకేశవాదియాదవులకు సవ్యసాచికిన్ వేర్వేఱ మ్రొక్కించిన వార
లెల్ల నాశీర్వాదంబులు గావింప సౌభద్రుం డాశశిరేఖకరంబుపట్టి తోడ్కొని
యంతఃపురంబునకుం బోవునెడ శశిరేఖశృంగారంబు రంభాదికాంత లాలోకించి
యమ్మానినిసౌందర్యంబునకు సరిపోలం జాలమని లజ్జించుచుండి రివ్విధంబునఁ బరిణ
యంపు దినచతుష్టయానంతరంబున. 48

తే. అలవధూవరు లిరువుర నప్పు డొకటి, సేయఁ గోరికె సంతోషచిత్తు లగుచు
శచియుం రేవతి రుక్మిణి సత్యభామ, మిత్రవిందాదికాంత లామిథునమునకు. 49

తే. శిరము మజ్జన మొనరించి జిలుఁగు వలువ, చేలమున నొత్తి తడి యార్చి చిక్కుతీసి
వెలకుమించినభూషణవితతు లిడుచు, పట్టుపెతిణిచేలము గట్టి మఱియు. 50

క. పడకింటిఁ బూలపాన్పును, గడుఁ బరిమళ మైనగంధకస్తురిలేపం
బెడతెగనితావిసుమములు, విడియము ఫలహారవస్తువితతులు వరుసన్. 51

వ. కాంచనమణిమయంబు లైనపాత్రలం దిడి రుక్మిణీసత్యభామశచీదేవిమొదలైన
కాంత లాసౌభద్రుని శయ్యాతలంబున నుండ నియోగించి తదనంతరంబ శశిరేఖం
దోడ్కొనిపోయి సుభద్రానందనుచెంగట న్నిలిపి ముసిముసినగవులతోఁ గవాటబంధ
నంబు గావించి రాసమయంబున. 52

క. ఆలసౌభద్రుఁడు ముదమునఁ, గలకంఠికరంబుఁ బట్టి ఘనతల్పముపైఁ
బెలుచ న్దిగిచినఁ బయ్యెద, వలువ వెసం దొలఁగె నపుడు వనజాననకున్. 53

క. సిగ్గడఁ బొడమినఁ బాన్పున, గొగ్గక నాలేమ సురత మొప్పక కరమున్
జగ్గున విదళింపుచుఁ జన, దిగ్గన సౌభద్రుఁ డరిగి తెంపున దానిన్. 54

క. కర మొడిసిపట్టి వినవే, కరిగామిని ప్రాలతోఁట గా దిచ్చోటన్
గురుతుగఁ జల్లనిమిత్తము, బరతెంచియుం ముంత దాఁచు కగి దిటఁ దోఁచెన్. 55

క. అని గేలినేసి వనితన్, మనసిజకయ్యమునఁ గూడి మక్కువతోడన్
గనులార నిదుర నొందెను, విను ముర్వీనాథ యంత వేకువ యయ్యెన్. 56

వ. అంత. 57

క. తెలతెలవారెను బత్తులు, కలకల మని ధ్వను లొసంగె ఘనచక్రములు
న్వెలసిల్లెఁ గమలముకుళము, లలరారె న్పూర్వశైల మర్కుఁడు పొడిచెన్. 58

సీ. ఆసమయంబునం దలివేణి తెలివొంది పలియఙ్కఁ గైకొని పాన్పు డిగ్గి
మోవికాటులతోడ మోముపై వ్రేలాడు పాటముంగురులతోఁ బంకజాక్షి
చెదరినకొప్పుతో జిటిలినగంధంపుఁబూఁతతో వాడినపూలతోడ
ముసిముసినగవుతో ముడివీడురైకతో వెడలుచుఁ దడబడ నడుగులిడుచుఁ
తే. బుడమి జీరాడుకుచ్చెళ్ల నెడమచేతఁ, బట్టుకొని మందయాన యై యట్టె వచ్చు
నిందురేఖను గనుఁగొని యింతులెల్ల, గుట్టు లెడఁబాసి నవ్వుచు నిట్టులనిరి. 59

సీ. అద్దాలఁ గేరునీముద్దుచెక్కులమీఁదఁ గసికాటు లేడవే కంబుకంఠి
డంబుమీఱినదివ్యబింబంబు సరిపోల్చు మోవి వాడిన దేమె ముద్దుగుమ్మ
నిస్తులం బైనట్టికస్తూరితిలకంబు చిట్లిపోయిన దేమె సింహమధ్య
అణిముత్యంబులహారము ల్మిక్కిలి చిక్కుబొందిన వేమె చిగురుఁబోఁడి
తే. కుందనపుగిన్నెలను గేరుకుచములందు, వాఁడియై సోఁకునఖరేఖ లేడవమ్మ
కంచుకం బేలపగిలెనే యంచగమన, వంచనము లేక తెల్పవే వారిజాక్షి. 60

వ. అనిపల్కువారిజాక్షులం జూచి శశిరేఖ లజ్జించుచు ముసిముసిదరహాసంబుతో నచ్చోటు వాసి యంతఃపురంబునకుం జనియె నప్పు డంబుజాక్షుం డమరేంద్రప్రముఖు లైనగీర్వాణులతో నారదాదిమహామునిసంఘంబులతో సాత్యకికృతవర్మాది యాదవులతోఁ గొలువై యున్నసమయంబున దామోదరుం జూచి నారదమునీంద్రుం డిట్లని స్తుతియించె. 61

దండకము. శ్రీమానినీమానసాంభోజహంసాబ్జగర్భామరేంద్రాదిబృందారకస్తోత్రపాత్రా సుచారిత్ర రాజీవనేత్రా మురారీ పురారిప్రియా చక్రధారీ దినేంద్రాయుతానంత తేజా జగద్రక్షకా భక్తకల్పద్రుమా యాతుధానాన్వయాంభోదఝంఝానిలా నీమహాచర్య లేమందు నో ముందు మీనాకృతి న్దాల్చి వారాశినిం జొచ్చి వేదాపహారు న్వెసం ద్రుంచి వేదంబు లాబ్రహ్మ కర్పింపవా కూర్మరూపంబుతో మందరాద్రి న్వీపిం దాల్పవా దేవ భూదారమై స్వర్ణనేత్రు న్విదారింపవా నారసింహుండవై యాహిరణ్యాక్షుతోఁబుట్టువుం ద్రుంపవా గుజ్జురూపంబు వే పూని వైరోచనున్ వేగఁ బాతాళముం జేర్పవా జామదగ్న్యుండవై రాజులం ద్రుంపవా భానువంశాబ్ధిచంద్రుండవై పఙ్క్తికంఠుం ధరం గూల్చి భూజాతనుం దెచ్చి రాజ్యంబు పాలింపవా నందసూనుండవై వెన్నల న్మెక్కవా బుద్ధకల్క్యవతారంబులం దాల్పవా వాసుదేవా జగన్నాథ నే నెంతధన్యుండనో యాసురేంద్రాదిబృందారకు ల్మందు నేస్నాన మేదాన మేయోగ మేలాగు గావించినారో మిముం జూడఁగా గల్గె వైకుంఠవాసా నమస్తే నమస్తే నమః. 62

26836
21.3.73

క. అని నారదుఁ డివ్విధమున, వనజాక్షుని సన్నుతించి వారిజనాభా
పనివినియెద మని పల్కుచు, మునిసంఘముతోడఁ జనియె ముద మలరారన్. 63

క. అమరేంద్రుఁ డంత మునుపునఁ, గమలోదరు మోముఁ జూచి కరము మొగుచుచున్
అమరావతీపురమునకుఁ, గమలేశ్వర మమ్ముఁ బంపు కారుణ్యముతోన్. 64

క. అనియింద్రుఁ డాడుసమయం,బున పార్థుఁడు శౌరిపాదపుష్కరములకున్
సవినయమున మ్రొక్కి దేవా, పనివినిగొద నంచుఁ బల్కి పయనంబయ్యెన్. 65

వ. ఆసమయంబున. 66

క. నాకజులెల్లన్గొల్వఁగ, పాకరిపుం డరుగువేళఁ బార్థుం డమరా
నీకముతో శరచయములు, చేకొను సంకల్ప మాత్రఁ జేయుచు నేఁగెన్. 67

వ. ఇవ్విధంబున నింద్రాజ్ఞుచు లమరావతికిం జనినపిమ్మట హిడింబానందనుం డచ్చోటఁ గొన్నిదినంబు లుండి రామకృష్ణులకు సుభద్రాదేవికిన్ మ్రొక్కి సౌభద్రుం గౌఁగిలించుకొని గమనోన్ముఖుండై ద్వైతవనంబునకుం జని యుధిష్ఠిరభీమనకులసహదేవాదులకు ద్రౌపదికిం బ్రణామంబు లాచరించి ద్వారకాపురంబునం జరిగినవృత్తాంతం బాద్యంతంబు వినిపించిన విని యుధిష్ఠిరాదిపాండవులు సంతోషసాగరంబునం దేలి ఘటోత్కచునిపరాక్రమంబునకు మెచ్చి పార్థునిరాక నిరీక్షించుచుండి రని వైశంపాయనుండు మఱియు నిట్లనియె. 68

క. ఈకథ వినుజనములకున్, లోకప్రభుఁ డబ్జపత్రలోచనుఁ డమరా
నీకముఁ బ్రోచిన కృష్ణుఁడు, ప్రాకటముగ సిరు లొసంగి భవములఁ బాపున్. 69

మత్తకోకిల. వేణునాదవినోద మాధవ వీరదానవమర్దనా
బాణబాహుసహస్రపర్వతపాకశాసనసాధనా
స్థాణుబాణ సుపర్ణవాహన సామజాధిపరక్షకా
క్షోణిభృద్ధర వారిజోదర సోమభాస్కరలోచనా. 70

గద్య. ఇది శ్రీమత్సూర్యనారాయణవీక్షణాలంకారసుస్థిరామృతవాక్యజనితకవిత్వరత్నాకరవంశపయఃపారావారరాకాసుధాకరాంజనేయాఖ్యతనూజ అప్పప్పనామధేయప్రణీతం బయినశశిరేఖాపరిణయం బనుమహాప్రబంధంబునందుఁ బంచమాశ్వాసము సర్వంబును సంపూర్ణము.

శశిరేఖాపరిణయము సమాప్తము.

చెన్నపురి : 'వావిళ్ల' ప్రెస్సున ముద్రితము.—1928.